

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

జనవరి, 2026

సంపుటి - 12 సంచిక-01 పేజీలు- 52 వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ & వర్సిటీ కులపతి శ్రీ జిష్ణుదేవ్ వర్మ



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి అగ్రిరోబోటిక్స్ ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎస్‌బిఐ చైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి




వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విద్యా దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



వ్యవసాయ పాలిటెక్నిక్ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహితీ, పోటీలలో పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న వ్యవసాయ పాలిటెక్నిక్, తోర్నాల విద్యార్థులు



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాలలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు



విశ్వవిద్యాలయ పరిధిలోని అఖిల భారత సమన్వయ గృహ విజ్ఞాన పరిశోధన పథకం, ఆధ్వర్యంలో చిరుధాన్యాలకు విలువ జోడింపు అన్న అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు మహిళలు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

జనవరి, 2026

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర పుష్య శుద్ధ త్రయోదశి నుండి మాఘ శుద్ధ చతుర్దశి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ సి. పద్మవేణి
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ పి. లీలా రాణి
ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

డా॥ బి. పద్మజ
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

పర్యవేక్షణ

డా॥ ఆర్. సునిత దేవి
ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.......... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.......... 12
4. సాంకేతిక వ్యాసాలు
   - హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి - మెళకువలు.......... 13
   - యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు సమగ్ర సస్యరక్షణ.......... 15
   - జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగులో ఎదురయ్యే సమస్యలు - పరిష్కార మార్గాలు.......... 17
   - జనవరి మాసంలో సాగుకు అనుకూలమైన కొర్ర పంట ప్రాముఖ్యత మరియు సాంకేతిక యాజమాన్య పద్ధతులు.......... 20
   - వేసవి నువ్వు పంట సాగులో అధిక దిగుబడులకు పాటించవలసిన మెళకువలు.......... 22
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......... 25
   - వ్యవసాయ విద్యా దినోత్సవం.......... 26
   - మానవ రహిత వ్యవసాయ సాధనలో జయశంకర్ వర్సిటీ తొలి అడుగు.......... 27
   - వ్యవసాయ పదవినోదం.......... 28
   - మిరపను ఆశించే పురుగులు - నివారణ మరియు వాటి నియంత్రణలో వాడే పురుగుమందుల సురక్షిత కాలం.......... 29
   - భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు - వాడే విధానం లాభాలు.......... 31
   - జీవక్రిమిసంహారకాల నాణ్యత ప్రమాణాలు - రైతులు తెలుసుకోవలసిన అంశాలు.......... 32
   - సమగ్ర వ్యవసాయం - స్థిర ఆదాయానికి సోపానం.......... 35
   - జాతీయ ఆహార విధానాల రూపకల్పనలో వ్యవసాయ డేటా పాత్ర.......... 37
   - జనవరి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......... 40
   - టెరేరియం - గాజు లోపల సహజ పచ్చని ప్రకృతి ప్రపంచం.......... 42
   - శీతాకాలంలో చేపలకు వచ్చే వ్యాధులు మరియు నివారణ చర్యలు.......... 44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......... 46
6. రైతన్నకో ప్రశ్న.......... 47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......... 48
8. రైతు విజయగాథ
   - "దమ్ముచేసిన వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్న పామిరెడ్డిపల్లి రైతుల విజయగాథ".......... 49

# జనవరి మాసం క్యాలెండర్ - 2026

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర పుష్య శుద్ధ త్రయోదశి నుండి మాఘ శుద్ధ చతుర్దశి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | | | | **1** పుష్య శుద్ధ త్రయోదశి రా.8-47<br>రోహిణి రా.9-53<br>ప.వ.2-26 ల 3-55<br>తె.వ.3-06 ల 4-36 | **2** చతుర్దశి సా.6-31<br>మృగశిర రా.8-18<br>తె.వ.4-12 ల<br>5-42 | **3** ○ పూర్ణిమ సా.4-23<br>ఆర్ద్ర సా.6-53<br>తె.వ.6-16 ల |
| **4** పుష్య బ.పాడ్యమి ప.2-29<br>పునర్వసు సా.5-40<br>ఉ.శే.వ.7-47 వ<br>రా.వ.1-22 ల 2-54 | **5** విదియ ప.12-50<br>పుష్యమి సా.4-45<br>తె.వ.5-14 ల | **6** తదియ ప.11-34<br>ఆశ్రేష సా.4-12<br>ఉ.శే.వ.6-48 వ<br>తె.వ.4-07 ల 5-42 | **7** చవితి ఉ.10-43<br>మఘ సా.4-04<br>రా.వ.12-11 ల<br>1-48 | **8** పంచమి ఉ.10-21<br>పుబ్బ సా.4-25<br>రా.వ.11-52 ల<br>1-31 | **9** షష్ఠి ఉ.10-30<br>ఉత్తర సా.5-15<br>రా.వ.2-08 ల<br>3-49 | **10** సప్తమి ప.11-12<br>హస్త సా.6-36<br>తె.వ.3-12 ల<br>4-55 |
| **11** అష్టమి ప.12-22<br>చిత్ర రా.8-25<br>రా.వ.2-31 ల<br>4-15 | **12** నవమి ప.1-58<br>స్వాతి రా.10-35<br>తె.వ.4-45 ల<br>6-31 | **13** దశమి ప.3-55<br>విశాఖ రా.1-02<br>తె.వ.5-28 ల | **14** ఏకాదశి సా.6-03<br>అనూరాధ తె.3-38<br>ఉ.శే.వ.7-15 వ | **15** ద్వాదశి రా.8-13<br>జ్యేష్ఠ తె.6-13<br>ఉ.వ.9-50 ల<br>11-37 | **16** త్రయోదశి రా.10-15<br>మూల పూర్తి<br>ప.వ.3-01 ల<br>4-47 | **17** చతుర్దశి రా.11-57<br>మూల ఉ.8-38<br>ఉ.వ.6-52 ల 8-38<br>రా.వ.7-03 ల<br>8-47 |
| **18** ● అమావాస్య రా.1-17<br>పూర్వాషాఢ ఉ.10-41<br>రా.వ.7-13 ల<br>8-56 | **19** మాఘ శు.పాడ్యమి రా.2-08<br>ఉత్తరాషాఢ ప.12-19<br>సా.వ.4-30 ల<br>6-11 | **20** విదియ రా.2-28<br>శ్రవణం ప.1-28<br>సా.వ.5-34 ల<br>7-12 | **21** తదియ రా.2-17<br>ధనిష్ఠ ప.2-07<br>రా.వ.9-21 ల<br>10-58 | **22** చవితి రా.1-36<br>శతభిషం ప.2-16<br>రా.వ.8-35 ల<br>10-10 | **23** పంచమి రా.12-30<br>పూర్వాభాద్ర ప.2-00<br>రా.వ.11-19 ల<br>12-52 | **24** షష్ఠి రా.11-00<br>ఉత్తరాభాద్ర ప.1-19<br>రా.వ.12-47 ల<br>2-19 |
| **25** సప్తమి రా.9-10<br>రేవతి ప.12-16<br>వర్జ్యము లేదు | **26** అష్టమి రా.7-06<br>అశ్విని ఉ.10-58<br>ఉ.వ.7-11 ల<br>8-42<br>రా.వ.7-58 ల<br>9-28 | **27** నవమి సా.4-53<br>భరణి ఉ.9-28<br>రా.వ.8-38 ల<br>10-07 | **28** దశమి ప.2-32<br>కృత్తిక ఉ.7-49<br>రోహిణి తె.6-09<br>రా.వ.10-42 ల<br>12-11 | **29** ఏకాదశి ప.12-10<br>మృగశిర తె.4-32<br>ప.వ.11-22 ల<br>12-51 | **30** ద్వాదశి ఉ.9-52<br>ఆర్ద్ర తె.3-04<br>ప.వ.12-25 ల<br>1-55 | **31** త్రయోదశి ఉ.7-42<br>చతుర్దశి తె.5-52<br>పునర్వసు రా.1-47<br>ప.వ.2-26 ల<br>3-56 |

14 భోగి

15 మకర సంక్రాంతి

26 గణతంత్ర దినోత్సవం

01 నూతన సంవత్సరం

16 కనుమ

23 శ్రీ పంచమి

03 అజరత్ అలీ జయంతి (ఆర్.ఎ)

17 షబ్-ఇ-మిరాజ్

### పూర్వాషాఢ-ఉత్తరాషాఢ కార్తెలు (29.12.25 నుండి 23.01.26)

- **వరి** : వరి నాట్లు, డిశంబర్‌లో వరికి కలుపు తీయుట, అంతర కృషి, సస్యరక్షణ.
- **సజ్జ** : వేసవి పంటకు నేల తయారి - విత్తనం వేయుట.
- **మొక్కజొన్న** : ఎరువులు వేయుట, అంతరకృషి.
- **వేరుశనగ** : డిశంబరులో విత్తిన వేరుశనగకు అంతర కృషి, తెలంగాణా ప్రాంతంలో నీటి వసతి క్రింద విత్తుట.
- **ఆముదం** : విత్తుట.
- **చెఱకు** : తెలంగాణా జిల్లాల్లో నాటిన పైరుకు, కార్శి తోటల్లో ఎరువులు వేయుట. ఎక్సాలి పంట వేయుట, సస్యరక్షణ
- **పప్పు దినుసులు** : వరి పొలాలందు (మాగాణిలో) నవంబరు లో వేసిన మినుము, పెసర కోతలు.
- **పశుగ్రాసాలు** : లూసర్న్, బర్సీము కోతలు, వేసవి పశుగ్రాసాల సాగు.

### శ్రవణ కార్తె (24.01.26 నుండి 05.02.26)

- **వరి** : ముందు నాటిన వరికి ఎరువులు వేయుట, సస్యరక్షణ.
- **జొన్న** : రబీ జొన్న కోతలు - వేసవి రకాలను విత్తుట.
- **పప్పుదినుసులు** : ఉలవ కోతలు.
- **వేరుశనగ** : డిశంబరులో విత్తిన పంటకు సస్యరక్షణ
- **కుసుమ** : కోయుట
- **ధాన్య నిల్వలు** : విత్తనాలు నిల్వ చేసుకొనుటలో జాగ్రత్తలు తీసుకొనుట, నిల్వ ఉంచిన ధాన్యానికి పురుగు పట్టకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించుట.

# అటవీ వ్యవసాయం అవలంబిద్దాం... బహుళ ప్రయోజనాలు పొందుదాం...



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

మనదేశం మరియు రాష్ట్రంలో నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా పట్టణీకరణ, బహుళ పరిశ్రమలు, రోడ్డు మరియు రైలు మార్గాల అభివృద్ధి విపరీతంగా పెరగడం వలన అడవుల విస్తీర్ణం, జీవ వైవిధ్యం తగ్గి, వాతావరణ కాలుష్యం మరియు భూతాపం పెరిగి, వాతావరణంలో పెను మార్పులు జరుగుతున్నవి. ఇందువలన పంట దిగుబడి, భూసారం, వాతావరణ సమతుల్యత కాపాడుటకు మరియు మానవ జీవన విధానాన్ని మెరుగుపరుచుట కొరకు భారతదేశ భౌగోళిక విస్తీర్ణంలో 33% అడవులు ఉండాలి. కానీ ప్రస్తుతం అటవీ విస్తీర్ణం 25.17% మాత్రమే ఉంది. అలాగే ప్రతి మనిషికి సగటున 100 చెట్లు ఉండవలసిన అవసరం ఉండగా కేవలం 28 చెట్లు ఉన్నాయి. ఈ పరిస్థితులను, సహజ అడవులను రక్షించుకుంటూనే అటవీ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటవీ వ్యవసాయంలో అటవీ చెట్లతోపాటు వివిధ క్షేత్రస్థాయి పంటలు మరియు పశువులను పెంచుతారు. ఈ విధానంలో చెట్ల మధ్య ఖాళీ స్థలంలో అంతరపంటలు వేయడం, పంట గట్ల వెంబడి లేక పొలం కంచె వెంబడి చెట్లను పెంచు పద్ధతుల వలన రైతులకు నిరంతర ఆదాయంతోపాటు, భూసారం, కర్బన స్థిరీకరణ మరియు జీవవైవిధ్యం పెరుగుతాయి. దీనివలన కలప, వంటచెరకుతోపాటు ఆహార ఉత్పత్తులు మరియు పశుగ్రాసం లభించి వ్యవసాయంలో సుస్థిరత ఏర్పడుతుంది. అయితే అటవీ వ్యవసాయ ఉత్పత్తులకు ఎల్లప్పుడు సరైన మార్కెట్ ఉండి, రైతులకు ఆదాయం రావటానికి వివిధ కలప, కాగితం, వెదురు మొదలగు పరిశ్రమలను ఏర్పాటు చేసి అనుసంధానం చేయాలి. దీనికి "కన్సార్టియం ఆఫ్ ఇండస్ట్రీయల్ అగ్రోఫారెస్ట్రీ" ని చేయాలి.

చెట్ల పెంపకం ద్వారా సహజ అడవులను, బంజరు భూములు మరియు వ్యవసాయ భూములలో అటవీ వ్యవసాయం ప్రోత్సహించటానికి కేంద్ర ప్రభుత్వం వారు "జాతీయ అటవీ వ్యవసాయ పాలసీ" (2014), "హర్ మేద్ పర్ పేడ్" (2016-17), "గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రాం" (2023)లను ప్రారంభించారు. మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ద్వారా కోట్ల అటవీ మొక్కలను నాటి, "ఆకుపచ్చని రాష్ట్ర" దిశగా పయనిస్తున్నది.

అలాగే వివిధ ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జీఓలు), కార్పోరేట్ సంస్థలు, హైదరాబాద్ మున్సిపల్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డిఏ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జిహెచ్ఎమ్‌సి) వారు పెద్ద ఎత్తున చెట్ల పెంపకాన్ని చేపడుతున్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ద్వారా అటవీ వ్యవసాయంను ప్రోత్సహించడం జరుగుతున్నది. విశ్వవిద్యాలయంలోని అటవీ వ్యవసాయ విభాగం వారు తయారు చేసిన లాభదాయకమైన మరియు సుస్థిరమైన అటవీ వ్యవసాయ విధానాలను, రైతులు వారి భూముల్లో పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. దీని వలన "కర్బన క్రెడిట్" మరియు "అగ్రో ఎకో టూరిజం" ద్వారా అదనపు ఆదాయం రైతులకు సమకూరుతుంది.

మన తెలంగాణ రాష్ట్ర రైతాంగం అనువైన అన్ని ప్రదేశాలలో అటవీ వ్యవసాయంను అవలంబించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించి, బహుళ ప్రయోజనాలను పొందాలని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి వరి పంట నారుమడి దశలో, నాట్లు వేసే దశలో లేదా పిలక వేసే దశలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో వరి నాట్లు ఆలస్యం చేసినట్లైతే ఏప్రిల్ మాసంలో ఉండే ఎండ తీవ్రత వలన నీటి లభ్యత తగ్గడమే కాకుండా నూకశాతం కూడా పెరుగుతుంది. కనుక యాసంగిలో వరి నాట్లు అవకాశం ఉన్న మేరకు డిసెంబర్ మాసంలోనే పూర్తి చేయాలి.
- చవుడు భూములలో, చలి వలన నారుమడిలో మరియు ప్రధాన పొలంలో, పెరుగుదల లేకపోవడం వలన మొక్కలు పసుపు రంగులోకి మారడం అంతేకాకుండా చవుడు, చలి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కలు చనిపోవడం కూడా గమనిస్తాము. కావున చలిని మరియు చవుడును యాసంగిలో అధిగమించే ప్రయత్నం చేయాలి.
- నవంబర్ ఆఖరి వారం నుండి సంక్రాంతి వరకు చలి ప్రభావం ఎక్కువగా ఉండడం వలన సహజంగానే నారు పెరుగుదల తక్కువగానే ఉంటుంది. రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండడం వలన నార్లు ఎర్రబడటం, ఎదుగుదల క్షీణించడం, పిలకలు వేయకపోవడం జరుగుతుంది. నార్లు పోసేముందు 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్ళ కోళ్ళ ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మికంపోస్టు వేసుకోవాలి.
- యాసంగి నారుమళ్ళలో చలి సమస్యను అధిగమించడానికి నారుమళ్ళపై ఇనుప చువ్వలు / వెదురు కర్రలతో ఊతం ఇచ్చి పైన పలుచటి పాలిథీన్ షీట్‌లను కప్పి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. అలాగే రాత్రి పూట నారుమడిలో నీటిని నిలువ ఉంచి మరుసటిరోజు ఉదయాన్నే తీసివేసి క్రొత్త నారు పెడుతూ ఉండాలి.
- యాసంగిలో చలి వలన నారుమళ్ళలో జింక్ లోపం కనిపిస్తుంది. నివారణగా లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. అలాగే ప్రధాన పొలంలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ భాస్వరం ఎరువులతో కలువకుండా దుక్కిలో వేసుకోవాలి. చౌడు సమస్య ఉన్న భూములలో తప్పనిసరిగా సేంద్రియ ఎరువులను వేసుకోవాలి.
- నారుమడిలో కలుపు ఎక్కువగా ఉంటే నాటిన 15-20 రోజులకు లీటరు నీటికి 2 మి.లీ. సైహలోఫాప్ బ్యుటైల్ లేదా 0.5 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియం మందులను పిచికారి చేసుకోవాలి.
- యాసంగిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున నివారణగా ప్రతి 2 గుంటల నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలు నారు పీకే వారం రోజుల ముందు వేసుకోవాలి.
- 30 రోజులలోపు నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. ప్రధాన పొలానికి సుమారు 10-12 రోజులు నీరు పెట్టి మురగ దమ్ము చేసుకొని ఎకరానికి 30 కి. యూరియా, 50 కి. డి.ఎ.పి మరియు 15 కి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేయాలి. పూర్తిగా మురగని ప్రధాన పొలంలో నాట్లు వేసినట్లైతే, వరి ఎర్ర బారడం లేదా చనిపోవడం జరుగుతుంది.
- ప్రధాన పొలంలో మొక్కలు కాండం కుళ్ళుతో చనిపోవడం గమనించినట్లైతే ఎకరానికి 30-35 కిలోల యూరియాకు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమ శిలీంధ్రనాశిని 100 గ్రా. కలిపి బురద పదునులో చల్లుకోవాలి.
- నారుమడి మరియు ప్రధాన పొలంలో అగ్గితెగులు (ఆకుమచ్చ దశ) గమనించినట్లైతే తొలిదశలో ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ ఐ. స్వర్ణలత దేవి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218**

## మొక్కజొన్న

అక్టోబరు మాసంలో విత్తుకున్న యాసంగి మొక్కజొన్న పూత దశ నుండి గింజపాలు పోసుకునే దశలో ఉంటుంది. కావున పక్షుల బెడద నుండి పంటను కాపాడుకోవడానికి శబ్ద పరికరాలను





ఉపయోగించవచ్చు లేదా మెరిసే రిబ్బన్లను పైరుకు ఒక అడుగు ఎత్తులో ఉత్తర దక్షిణ దిశల్లో కట్టవలెను లేదా పైరు చుట్టూ 2-3 వరుసలలో కండే ప్రక్కనున్న ఆకులతో చుట్టవలెను.

పైరు 60-65 రోజుల దశలో ఉన్నప్పుడు చివరి దఫా నత్రజని ఎరువు అనగా ఎకరాకు 50 కిలోల యూరియా మరియు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి.

పూతదశకు ముందు, పూతదశలో మరియు గింజపాలు పోసుకునే దశలో పైరుకు నీటితడులు తప్పనిసరిగా నేల స్వభావమును బట్టి 10-15 రోజుల వ్యవధిలో ఇవ్వవలెను లేకపోతే దిగుబడి తగ్గుతుంది.

ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పంటలో తొలిదశ కత్తెర పురుగు లార్వాల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్క సుడులు తడిచేటట్లు పిచికారి చేయాలి లేదా ఇసుక మరియు సున్నం కలిపిన మిశ్రమాన్ని 9:1 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్క సుడిలో పడునట్లుగా వేయాలి. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నచో ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎరను మొక్క సుడిలో సాయంకాలం వేయాలి.

**విషపు ఎర తయారీ విధానం:** ఎకరానికి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం తీసుకొని, బెల్లంను 2-3 లీటర్ల నీటిలో కరిగించి తరువాత తవుడులో కలిపిన మిశ్రమాన్ని 24 గంటలు పులియనిచ్చి అరగంట ముందు ఈ మిశ్రమానికి 100 గ్రా. ల థయోడికార్బ్ మందును కలిపి విషపు ఎరను మొక్క సుడిలో వేయాలి.

పూత అనంతర దశలో కాండం కుళ్ళు తెగులు ఆశించు ప్రాంతాల్లో పూత దశ నుండి పైరు బెట్టకు గురికాకుండా చూడవలెను. ఆకుమాడు/ఆకు ఎండు తెగుళ్ళు లేదా తుప్పు తెగులు ఆశించినచో మాంకోజెబ్ లీటరు నీటికి 2.5 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి. పొడతెగులు లక్షణాలు గమనించినచో ప్రోపికొనజోల్ లీటరు నీటికి ఒక మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

**జొన్న:** యాసంగి జొన్న పంట చలి ప్రభావంతో ఎదుగుదల లోపించినట్లు గమనిస్తే పై పాటుగా 19-19-19 మిశ్రమాన్ని 5 గ్రా. లీటరు నీటికి చొప్పున వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. యాసంగి జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు క్లోరాంట్రానిప్రోల్ 0.4 మి.లీ లేదా స్పైనటోరమ్ 0.5 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**సజ్జ:** వేసవిలో సజ్జను జనవరి మొదటి వారం నుండి ఫిబ్రవరి 15 తేదీలోపు విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. వెర్రి కంకి తెగులు సోకకుండా 1 కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్ లేదా 3 గ్రా. థైరమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తిన 2 రోజులలోపు కలుపు నివారణ కోసం అట్రాజిన్ మందును 1 కిలో 200 లీటర్ల నీటిలో కలిపి తడి నేలలో పిచికారి చేయాలి. విత్తనం విత్తిన 20 రోజుల లోపు ఒత్తు మొక్కలను తీసివేసి గుంటకతో అంతర సేద్యం చేయాలి. ఎకరాకు 36 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను వేయాలి. నవంబరులో విత్తిన పంట ప్రస్తుతము గింజ పాలు పోసుకునే దశలో ఉంటుంది. మొక్క కీలక దశలో నీటి తడుల ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చు.

**రాగి:** వేసవి రాగిని జనవరి మాసంలో విత్తుకోవాలి. ఎకరాకు 2 కిలోలు విత్తనం సరిపోతుంది. విత్తనశుద్ధి కొరకు కార్బండాజిమ్ 2 గ్రా./కిలో విత్తనానికి వాడాలి.

**కొర్ర:** వేసవి కొర్రను జనవరి మాసంలో విత్తుకోవాలి. 2 కిలోల విత్తనం ఎకరాకు సరిపోతుంది. విత్తనశుద్ధి కొరకు కార్బండాజిమ్ 2 గ్రా./కిలో విత్తనంకు వాడాలి.

**డా॥ డి. భద్రు, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 83338 18245**

## వేరుశనగ

- యాసంగిలో విత్తుకున్న వేరుశనగ ప్రస్తుతం 60-70 రోజుల దశలో ఉన్నది. ఈ సమయంలో నేలలో తేమని బట్టి ప్రతి 8-10 రోజులకొకసారి నీటి తడులు ఇవ్వాలి.



- ఈ దశలో పొగాకు లద్దెపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే, ఈ పురుగు నివారణకు నొవాల్యురాన్ 200 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ. ఎకరాకు సరిపోయేలా 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఉధృతి తీవ్రంగా ఉన్నప్పుడు ఎర ఉపయోగించి నివారించవచ్చు. ఇందుకుగాను 10 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, ఒక లీటరు క్లోరిపైరిఫాస్ మందును కలిపి, తగిన నీటితో ఉండలుగా చేసిన ఎరను తయారుచేసుకొని సాయంత్రం వేళ సమానంగా ఒక ఎకరా పొలంలో చల్లి ఈ పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.
- ఈ మాసంలో చలి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇనుపధాతు లోపం ఏర్పడే అవకాశం ఉంది. లేత ఆకులు పసుపు పచ్చగాను తర్వాత తెలుపు రంగుకు మారతాయి. ఈ లోపాన్ని అధిగమించుటకు ఎకరాకు 1 కిలో అన్న భేధి మరియు 200 గ్రా. సిట్రిక్ ఆమ్లం 200 లీటర్ల నీటిలో కలిపి రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.
- ఈ దశలో ఆలస్యంగా వచ్చే తిక్కా ఆకుమచ్చ మరియు కాండంకుళ్ళు తెగుళ్ళు ఎక్కువగా పంటనాశిస్తాయి. ఆకుమచ్చ తెగులు నివారణకు ఎకరానికి 200 మి.లీ. టెబ్యుకొనజోల్ లేదా 400 గ్రా. క్లోరోథలోనిల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. కాండం కుళ్ళు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 400 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క మొదళ్ళు తడిచేటట్లు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

- వానాకాలం వేసిన పంట ప్రస్తుతం చివరికోత దశలో ఉంది. పక్వానికి వచ్చిన గెలలను కోసి, ఎండబెట్టుకొని, ఎండిన తర్వాత కర్రలతో లేదా త్రెషర్స్ సహాయంతో విత్తనాన్ని వేరుచేసుకోవాలి. యాసంగిలో సాగు చేసిన పంట 40-50 రోజుల దశలో ఉన్నప్పుడు పైపాటుగా 15 కిలోల యూరియాను నేలలో తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి. యాసంగిలో సాగుచేసిన ఆముదంలో రసంపీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లద్దె పురుగు పంటను ఆశించినట్లైతే లీటరు నీటికి 1.0 మి.లీ. నొవాల్యురాన్ కలిపి పిచికారి చేసుకోవాలి. కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## ప్రొద్దుతిరుగుడు

- నీటి వసతి ఉన్నప్పుడు వేసవి పంటగా ప్రొద్దుతిరుగుడుని జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన పంట పూత దశలో ఉంది. ఈ దశలో పంటలో తేనెటీగల సంఖ్య తక్కువగా ఉన్నట్లైతే ఉదయం 8 నుండి 11 గంటల మధ్య సున్నితమైన గుడ్డతో వలయాకారంగా రుద్దాలి. ఈ విధంగా 15 రోజులపాటు చేసినట్లైతే గింజ బాగా కడుతుంది.
- శనగపచ్చ పురుగు ఆశించినట్లైతే 1 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. త్రుప్పు తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- పక్షుల బెడద ఉన్నట్లైతే మెరుపు రిబ్బన్లను పంటకు పైన అడుగు ఎత్తులో సూర్యరశ్మి తాకేట్లు ఉత్తర-దక్షిణ దిశల్లో కట్టుకోవాలి.
- పువ్వు వెనుక భాగం నిమ్మ పండు రంగుకు మారినప్పుడు పంటను కోయవలెను. కోసిన తర్వాత 2-3 రోజుల వరకు ఆరనిచ్చి నూర్పిడి యంత్రం సహాయంతో విత్తనాన్ని వేరుచేసుకోవాలి.

## నువ్వులు

- వేసవి పంటగా నువ్వులను జనవరి రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. శ్వేత, జగిత్యాల తిల్-1 (జె.సి.ఎస్-1020), జగిత్యాల తిల్-2 (జె.సి.ఎస్-2454), హిమ, చందన రకాలలో దేనినైనా ఎన్నుకొని వేసవిలో సాగు చేయవచ్చు. ఎకరానికి 2.5 కిలోల విత్తనాన్ని తీసుకొని, 2.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు



మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేటట్లు సాళ్ళలో విత్తుకోవాలి. విత్తుకునే సమయంలో ఎకరానికి 15 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్ మరియు 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

## కుసుమ

- ఈ మాసంలో కుసుమ పూత దశలో ఉంటుంది. ఈ దశలో పేనుబంక ఎక్కువగా ఆశిస్తుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. శనగ పంటకు దగ్గరలో కుసుమ పంట వేసుకున్నట్లైతే శనగపచ్చ పురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయి. నివారణకు 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ 25 ఇసి లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- జనవరి మాసంలో ఆకాశం మేఘావృతమై వాతావరణంలో తేమ 70% కంటే ఎక్కువగా ఉన్నప్పుడు పంటపై ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయి. ఆకులపై గోధుమ వర్ణంలో గుండ్రటి మచ్చలు గమనించినట్లైతే 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి ఒకసారి మరియు 7-10 రోజుల వ్యవధిలో రెండవసారి పిచికారి చేసుకోవాలి.

డా॥ ఎమ్. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838

## అపరాలు

**కంది:** మన రాష్ట్రంలో కంది పంట పూత, కాయ దశలో ఉన్నది. ఈ పంటను కొన్ని ప్రాంతాలలో శనగపచ్చ పురుగు మరియు మారుకామచ్చల పురుగు ఎక్కువగా ఆశించుట గమనించట మైనది. ఈ పురుగుల నివారణకు నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు మార్చి మార్చి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

గత రెండు సంవత్సరాల నుండి పిందె, కాయ దశలో కాయ ఈగ ఉధృతి కూడా ఎక్కువగా ఉండటం గమనించడ మైనది. కాయతొలుచు ఈగ ఆశించినప్పుడు నష్టం బయటకు కనిపించదు. కావున పిందె దశలో 5% వేపగింజల కషాయం పిచికారి చేసినట్లైతే తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించుకోవచ్చు. పిందె దశలో థయోక్లోప్రిడ్ 0.7 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కొన్ని ప్రాంతాలలో వెర్రి తెగులు గమనించడం జరిగింది. ఇది ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. ఇది ఆశించిన మొక్కల ఆకుల మీద ఆకుపచ్చ పసుపు వర్ణపు మచ్చలు ఏర్పడి మొక్కలకు పూత, కాయ ఏర్పడదు. నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**యాసంగి కంది:** యాసంగిలో విత్తిన కంది పూత దశ నుండి చిరు పిందె దశలో ఉంది. దీనికి శనగపచ్చ పురుగు ఆశించవచ్చును. నివారణకు స్పైనోశాడ్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పంట బెట్టకు గురికాకుండా మొగ్గ దశలో, చిరు పిందె దశలో గింజ కట్టే దశలో తప్పనిసరిగా నీటితడులు ఇవ్వవలెను. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో కీలకదశల్లో నీరు అందించినచో దిగుబడి పెరుగుతుంది.

**శనగ:** కొన్ని ప్రాంతాలలో శనగ శాఖీయ దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పూత మరియు కాయ దశలోనూ ఉంది. శాఖీయ పెరుగుదల దశలో పచ్చ రబ్బరు పురుగు, పూత, పిందె దశలలో శనగపచ్చ పురుగు ఆశించి నష్టం కలుగజేస్తుంది.

**శనగ పచ్చ పురుగు:** ఈ పురుగు కాయదశలో ఎక్కువగా ఆశిస్తుంది. కాయలపై గుండ్రటి రంధ్రాలను చేసి తల లోపలికి పెట్టి గింజలను తినివేసి అధిక నష్టం కలుగజేస్తుంది. నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. రసాయనిక మందులైన క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా స్పైనోశాడ్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



**త్రుప్పు తెగులు:** పైరు పక్వానికి వచ్చే దశలో ఆకులపై గుండ్రటి పొక్కులు ఏర్పడి తీవ్రమైతే మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 0.8 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

ఆలస్యంగా విత్తిన శనగ పంటలో ప్రతి 7-10 రోజుల వ్యవధిలో 2% డి.ఎ.పి ద్రావణం (20 గ్రా. లీటరు నీటికి చొప్పున) పిచికారి చేసినచో శాఖీయంగా ఎదుగుదలకు తోడ్పడి పూత కాయ నిల్చి మంచి దిగుబడులు సాధించడానికి తోడ్పడుతుంది.

**యాసంగి పెసర / మినుము సస్యరక్షణ:**

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక, పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయవలెను.

**తామర పురుగులు:** ఈ పురుగు పైరు తొలిదశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేయడమే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింపజేస్తాయి. తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** పూత, పిందె దశలో ఉన్న పంటను ఈ పురుగు ఆశించే అవకాశం ఉంది. పంటలో 35 రోజుల వయసులో వేప సంబంధిత మందులు (వేపనూనె / వేపగింజల కషాయం) పిచికారి చేసినట్లైతే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లైతే క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్‌సి 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అవసరమైతే పురుగుల ఉధృతిని బట్టి 7-10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**తెగుళ్ళ యాజమాన్యం:** సాధారణంగా క్లోరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, త్రుప్పు మరియు సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టడానికి పైరు 30-35 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. పల్లాకు తెగులు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి, పీకి వేసి తెగులు వ్యాప్తికి కారకాలైన రసం పీల్చే పురుగులను నివారించాలి.

**వేసవి అపరాలు:** నీటి పారుదల క్రింద 3-4 తడులిచ్చే అవకాశమున్నచో వేసవిలో తేలికపాటి మధ్యస్థ నేలల్లో పెసర బరువైన నల్లరేగడి భూముల్లో మినుము సాగు చేయవచ్చును.

**సిఫార్సు చేయబడిన పెసర రకాలు:** యమ్.జి.జి-385, యమ్.జి.జి-295, యమ్.జి.జి-347, యమ్.జి.జి-351, డబ్ల్యు.జి.జి-37, డబ్ల్యు.జి.జి-42, ఐ.పి.యమ్-2-14, టి.యమ్-96-2.

**మినుము రకాలు:** యమ్.బి.జి-1070, పి.యు-31, ఎల్.బి.జి-752, ఎల్.బి.జి-787.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- ప్రత్తి పంట సాగును జనవరి వరకు పొడిగించరాదు. పొడిగించినచో గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువై గుడ్డి ప్రత్తి ఎక్కువగా వస్తుంది. రాబోయే రోజుల్లో గులాబి రంగు పురుగు సంతతి పెరిగి పంటను అధికంగా నష్టం చేసే అవకాశం ఉంది.
- ప్రత్తి పంటను తీసి వేసి నీటి వసతి ఉన్నచోట ప్రత్తి అడుగులో రెండవ పంటగా మొక్కజొన్న, జొన్న, బొబ్బర, పెసర లేదా



కూరగాయలాంటి పంటలను సాగు చేసుకోవచ్చు. ప్రత్తి చేను (ప్రత్తి కట్టెను)ను రోటవేటర్ లేదా ష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి. తద్వారా నేల సారవంతమవుతుంది మరియు నేలలో కర్బన శాతం పెరుగుతుంది. ప్రత్తి కట్టెను కాల్చరాదు. ప్రత్తి చేనులో గులాబిరంగు పురుగును గమనించినచో లీటరు నీటికి సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ + క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి.

- గులాబి రంగు పురుగు సోకిన ప్రత్తిని నిలువ చేయరాదు. తీసిన ప్రత్తిని పట్టాలపై నీడలో 8-12 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లైతే మార్కెట్‌లో మంచి ధర వస్తుంది.

డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 8332970247

## చెఱకు

తెలంగాణ ప్రాంతంలో సాధారణంగా చెఱకును డిసెంబర్-జనవరి మాసంలో నాటుతారు. నాటుటకు అనువుగా నేలను ముందుగా లోతు దుక్కి చేసుకోవాలి. దీని వల్ల వేరు మండలం బాగా విస్తరించి పంట ఎదుగుదల అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత పశువుల పెంట లేదా కంపోస్ట్ ఎరువులను ఎకరానికి 10 టన్నుల చొప్పున వేసి చెఱకును నాటుటకు 4 నుండి 6 వారాల ముందు పళ్ళెపు దంతితో భూమిలో కలియదున్నాలి.

కార్శి తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవడం వలన కార్శి తోటలలో సగటు చెఱకు దిగుబడులు తగ్గుతున్నాయి. అందువలన చెఱకు సాగుచేసే రైతులు, రకాల ఎంపిక నుండి మొక్క తోటలను సకాలంలో నరకటం వరకు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

చెఱకును నరికిన తరువాత కార్శి చేయడం వలన విత్తనపు ఖర్చుతో పాటు పొలం తయారీ ఖర్చు తగ్గి చెఱకు సాగులో ఎంతో లాభం చేకూరుతుంది. మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ళ మధ్య దుక్కి చేసి భూమి గుల్లబారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి పిలకల నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణ వాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలకు నీరు, పోషకాలు సమాంతరంగా అందుతాయి.

కార్శి తోటల్లో ఖాళీలు ఎక్కువగా ఏర్పడి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. పడిపోయిన తోటలను నరకడం ఆలస్యమైన కొద్దీ దుబ్బులు చనిపోవడం ఎక్కువై - టి నుండి కార్శి తోటలు పెంచినప్పుడు ఎక్కువగా ఖాళీలు ఏర్పడి, దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. కార్శి తోటల్లో ఖాళీలు నింపడం వలన హెక్టారుకు సుమారుగా 8 టన్నుల అదనపు దిగుబడి పొందవచ్చు. ఖాళీలు నింపుటకు అదే రకానికి చెందిన మూడు కళ్ల ముచ్చెలను గాని పాలిథీన్ సంచులలో పెంచిన ఆరు వారాల వయస్సు గల మొలకలను గాని, మొక్క తోటలోని దుబ్బులను గాని ఉపయోగించవచ్చు. మోడు చెక్కిన వారం, పది రోజులలోపు కార్శి తోటలలో ఖాళీలు నింపాలి. ఖాళీలు నింపిన మొలకలు లేదా దుబ్బులు బ్రతికే వరకు నీరు పోసి సంరక్షించుకోవాలి. లేత వయస్సులో రెండు, మూడు తడులు దగ్గర దగ్గరగా పెట్టడం వలన మొక్కలు బ్రతికి త్వరగా పిలకలు తొడుగుతాయి.

తెలంగాణలో సాగు చేసే కార్శి చెఱకు తోటకు హెక్టారుకు 375 కిలోల నత్రజని, 100 కిలోల భాస్వరం మరియు 100 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. అంటే ఒక ఎకరానికి 330 కిలోల నత్రజని రూపంలో ఉండే యూరియా మరియు 250 కిలోల భాస్వరం ఎరువు రూపంలో ఉండే సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 86 కిలోల పొటాష్ రూపంలో ఉండే మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

జనవరి నుండి మార్చి కాలంలో దేశవ్యాప్తంగా కాలానుగుణ వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుంది. (దీర్ఘకాలిక సగటులో <88%). వాయువ్య, ఈశాన్య మరియు ద్వీపకల్ప భారతదేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. జనవరి 2026లో దేశవ్యాప్తంగా నెలవారీ వర్షపాతం సాధారణంగా ఉండే అవకాశం ఉంది (దీర్ఘకాలిక సగటులో 82-118%). దేశంలోని చాలా ప్రాంతాలలో వర్షపాతం సాధారణం నుండి సాధారణం ప్రాంతాలలో కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది; అయితే, వాయువ్య, తూర్పు మరియు ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో, అలాగే ద్వీపకల్ప మరియు మధ్య భారత ప్రాంతాలలోని కొన్ని స్థానిక ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం సంభవించవచ్చు. జనవరి 2026లో దేశంలోని చాలా ప్రాంతాలలో నెలవారీ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది; అయితే, వాయువ్య మరియు ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, అలాగే దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నెలవారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో జనవరి నుండి మార్చి కాలంలో, అదే విధంగా జనవరి మాసంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుంది. జనవరి మాసంలో కనిష్ట మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆదిలాబాద్, నిర్మల్ మరియు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో శీతల గాలులు 1-2 రోజులు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం కలదు.

రాష్ట్రంలో 01.10.2025 నుండి 31.12.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. గాను 190 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (72 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (31.12.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 12 శాతం (606452), జొన్న - 69 శాతం (136743), మొక్కజొన్న - 89 శాతం (576668), కంది - 15 శాతం (782), శనగ 51 శాతం (155078), పెసర - 9 శాతం (2075), మినుములు - 42 శాతం (23273), వేరుశనగ - 55 శాతం (143372), ప్రొద్దుతిరుగుడు - 20 శాతం (5064) మరియు కుసుమ - 62 శాతం (7647) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 25 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 23 శాతం, నూనె గింజల పంటలు 44 శాతం సాగుచేయటం జరిగింది.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- చలి ప్రభావం వలన నారుమడులలో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు మరియు ఎరుపు రంగులోకి మారి కొన్నిసార్లు నారు చనిపోవటం గమనించినట్లయితే క్రింద తెలిపిన రక్షణ చర్యలు పాటించాలి:
  - నారుమళ్ళపై ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలతో ఊతమిచ్చి పైన పలుచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం పూట కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి.
  - రాత్రి వేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్తనీరు పెట్టాలి.
  - 10-12 రోజుల దశలో నారు ఆరోగ్యంగా పెరగడానికి పైపాటుగా 1 కిలో యూరియాకి 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలి.
  - యాసంగి వరిలో నారుమడి మరియు ప్రధాన పొలంలో జింక్ ధాతువు లోపం ఎక్కువగా ఉంటుంది. వరుసగా వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి లేనిచో ప్రతి యాసంగిలో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
  - వరి నారుమళ్ళలో జింక్ ధాతువు లోప లక్షణాలు గమనించినచో జింక్ లోప నివారణకు 2 గ్రా. జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
  - నిమ్మలో పల్లాకు తెగులు నివారణకు 5 గ్రా. జింక్ సల్ఫేట్ + 2 గ్రా. మాంగనీస్ సల్ఫేట్ + 2 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ + 2 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ + 1 గ్రా. బోరాక్స్ + 6 గ్రా. క్యాల్షియం లేదా సున్నం + 10 గ్రా. యూరియా మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
  - మామిడిలో తేనెమంచు పురుగు మరియు బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు, 0.3 గ్రా. డైనోటేఫురాన్ + 1 గ్రా. కార్బండాజిమ్ + 2.5 మి.లీ. వేపనూనె లేదా 0.5 గ్రా థయోమిథాక్సామ్ + 2 మి.లీ. హెక్సాకొనజోల్ + 2.5 మి.లీ. వేపనూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి – మెళకువలు

డా॥ బి. శ్రీనివాస్, డా॥ పి. మధుకర్ మరియు డా॥ ఎస్. హరీష్ కుమార్ శర్మ

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల




వరిలో ఎక్కువగా సూటి రకాలనే సాగు చేస్తున్న మనదేశంలో సంకర రకాల (హైబ్రిడ్స్) విస్తీర్ణం వరి సాగు విస్తీర్ణంలో కేవలం 4 శాతం మాత్రమే. ప్రస్తుతం వాడుకలో ఉన్న మేలు రకం వరి వంగడాలు ఎకరాకు దాదాపు 28–32 క్వి. దిగుబడిని ఇస్తున్నాయి. అయితే ఎంత మేలయినా యాజమాన్య పద్ధతులు పాటించినా వరి సూటిరకాలతో అత్యధిక దిగుబడిని (35–40 క్వి. ఎకరానికి లేదా ఆపైనా) సాధించడం చాలా కష్టం, అయితే సంకర రకాల సాగుతో దీన్ని సాధించవచ్చు. వరిలో సాధారణంగా ఉండే సంకర తేజంను ఉపయోగించుకొని చీడపీడలను సమర్ధవంతంగా తట్టుకునే అధిక దిగుబడినిచ్చే సంకర రకాలని అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటి వరకు మనదేశంలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల ద్వారా చాలా వరి సంకర రకాలు అభివృద్ధి చేయబడి సాగులో ఉన్నాయి. అయితే సూటి రకాలతో పోలిస్తే వరిలో సంకర విత్తనాన్ని ఉత్పత్తి చేయాలంటే పురుష వ్యంధత్వం గల 'A' (ఆడ) రకములో ఫర్టిలిటీ లక్షణాన్ని పునరుత్పత్తి చేయగలిగే 'R' (మగ) రకము అవసరం. భారతదేశంలో మొత్తం చూసినట్లైతే తెలంగాణ రాష్ట్రంలోని పూర్వపు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ మరియు మెదక్ జిల్లాలు వరి సంకర విత్తనోత్పత్తి చాలా అనుకూలం. ఈ విత్తనోత్పత్తి ద్వారా రైతులు అధిక నికర ఆదాయం పొందవచ్చు.

**విత్తనోత్పత్తి చేపట్టే కాలం:** యాసంగిలో ఉండే వాతావరణ పరిస్థితులయిన అధిక సూర్యరశ్మి, ఉబ్బరింత పరిస్థితులు వరి హైబ్రిడ్ విత్తనోత్పత్తికి అనుకూలం. సాధారణంగా నవంబర్ 15 నుండి డిసెంబర్ 10 వరకు విత్తుటకు సరియైన సమయం.

విత్తన మోతాదు: ఎకరాకి 6 కి॥ ఆడ రకము (A) మరియు 3 కి॥ మగ రకము (R) సరిపోతుంది.

**ఆడ రకం & మగ రకాలను విత్తుకునే విధానం:** ఆడ రకం (A) మరియు మగ రకంల (R) కాలపరిమితిలోని తేడాలని బట్టి నారుమడిలో వెనకాల ముందు విత్తుకోవాలి. ఎక్కువ కాలపరిమితి గల రకాన్ని ముందుగా, తక్కువ కాలపరిమితి గల రకాన్ని ఆలస్యంగా విత్తుకోవాలి. మగ రకాన్ని (R) మూడు రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా (1,4 మరియు 7వ రోజు) విత్తుకోవాలి. దీని వలన ఆడ, మగ రకాల పూత సమయం ఒకేసారి రావడానికి అవకాశం ఎక్కువగా ఉండి అధిక విత్తన దిగుబడులు సాధించవచ్చు.

**నారుమడి యాజమాన్యం:** ఒక హెక్టారు విస్తీర్ణంలో విత్తనోత్పత్తి చేయడానికి 300 చ.మీ. నారుమడి సరిపోతుంది. నారుమడిని ఎత్తుగా మరియు మురుగు నీరు పోయే విధంగా తయారు చేసుకోవాలి. 100 చ.మీ. నారుమడికి 2.2 కి. యూరియా, 6.25 కి॥ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 1.7 కి॥ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో దమ్ములో వేయాలి. విత్తిన 12–14 రోజులకు 2.2 కి॥ యూరియాని రెండవ దఫాగా వేయాలి. యాసంగిలో నారుమడి సమయంలో చలి అధికంగా ఉంటుంది కాబట్టి భాస్వరం ఎరువులని రెట్టింపు వేసుకోవాలి. జింక్ లోపం లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారి చేయాలి. నారుమడిలో కలుపు నివారణకి విత్తిన 10–15 రోజులకు సైహలోఫాస్ పి బ్యుటైల్ 1.5 మి.లీ. లేదా బిస్‌పైరిబాక్ సోడియం 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నారు తీసే 10 రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడిలో 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు వేయాలి.

**వేర్పాటు దూరం:** హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి చేసేటప్పుడు చుట్టూ ఉండే ఇతర వరి రకాల ద్వారా పరపరాగ సంపర్కం జరిగి విత్తనం కల్తీ అయ్యే ప్రమాదం ఉంది. కావున జన్యు స్వచ్ఛత కోసం విత్తనోత్పత్తి క్షేత్రానికి ఇతర వరి రకాలు పండించే క్షేత్రాలకు మధ్య 100 మీ. వేర్పాటు దూరం పాటించాలి. అలా కుదరని పక్షంలో విత్తనోత్పత్తి క్షేత్రం చుట్టూర 2 మీ. ఎత్తు వరకు పాలిథీన్ షీట్స్ కాని లేదా చీరలని గాని కట్టి విత్తన కల్తీని అరికట్టాలి.

**ప్రధాన పొలంలో ఆడ మరియు మగ మొక్కల నాట్లు:**

25 నుండి 30 రోజుల వయస్సు గల ఆడ మరియు మగ మొక్కలను సిఫారసు చేసిన 6:2 వరుసల నిష్పత్తిలో నాటుకోవాలి. నాటేటప్పుడు కుదురుకి ఒకే ఒక మొక్క ఉండేలా చూసుకోవాలి. 6 వరుసల ఆడ రకానికి (A) ఇరువైపులా 2 వరుసల మగ రకాన్ని (R) నాటుకోవాలి.

**మగ మొక్కలు (R) నాటే పద్ధతి:** మూడు దఫాలుగా విత్తిన మగ మొక్కలను ప్రతీ వరుసలో నాటుకోవాలి. ప్రతి వరుసలో మొదటి దఫా విత్తిన మగ మొక్కలను మొదటి పూసకి, రెండవ దఫా మగ మొక్కలని రెండవ పూసకి మరియు 3వ దఫా విత్తిన మగ మొక్కలని మూడవ పూసకి వరుసగా నాటుకోవాలి. విత్తిన పంట చుట్టూర మగ మొక్కలు (R) నాటుకోవడం వలన ఇతర వరి రకాల నుండి విత్తనం కల్తీ అయ్యే ప్రమాదంను తగ్గించవచ్చు.

**మొక్కల మధ్య దూరం:** మగ (R) వరుసల మధ్య 20 సెం.మీ. ఆడ (A) వరుసల మధ్య 15 సెం.మీ. ఆడ (A) మరియు మగ (R)

వరుసల మధ్య 20-30 సెం.మీ మరియు మొక్కకి మొక్కకి మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా నాటుకోవాలి.

### ప్రధాన పొలం తయారీ మరియు ఎరువుల యాజమాన్యం:

పొలానికి ఒకసారి నీరుపెట్టి క్రితం వరి పంట నుండి రాలిన గింజలను మొలకెత్తనివ్వాలి. తరువాత 10-15 రోజుల వ్యవధిలో 3 సార్లు దమ్ము చేసి బాగా మురగనివ్వాలి. దీని వలన పంట యొక్క వివిధ దశలలో వచ్చే బెరుకులని నివారించవచ్చు. సాధారణంగా హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తికి యాసంగి కాలం అనుగుణంగా ఉంటుంది. కావున ఎకరానికి 48-60 కిలోల నత్రజనికి 24 కి॥ భాస్వరం మరియు 16 కి॥ పొటాష్ నిచ్చే ఎరువులు అవసరమవుతాయి. అదేవిధంగా ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కి॥ జింక్ సల్ఫేట్‌ని తప్పనిసరిగా వేసుకోవాలి.

### కలుపు యాజమాన్యం:

విత్తనోత్పత్తి క్షేత్రంలోని ఏక వార్షిక గడ్డిజాతి కలుపు నివారణకి నాటిన 3-5 రోజులలో 1 లీ॥ బ్యూటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ 20 కి॥ పొడి ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలి. నాటిన 15-20 రోజులకు గడ్డిజాతి కలుపు నివారణకు సైహలోఫాప్ పి బ్యుటైల్ 300 మి.లీ. లను ఎకరానికి, గడ్డి మరియు వెడల్పాటి ఆకు కలుపు నివారణకి బిస్‌పైరి బాక్ సోడియం 100 మి.లీ. ఎకరాకు చొప్పున 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**కేళీల ఏరివేత మరియు అనుబంధ సంపర్కం:** కేళీల ఏరివేత పంట మొక్క మూడు దశలలో (పిలక దశ, పూత దశ, కోతకి ముందు) ఆడ మరియు మగ మొక్కల లక్షణాలని అనుసరించి బెరుకులని గుర్తించి ఏరివేయాలి. పూత సమయంలో ప్రతి రోజు ఆడ మరియు మగ వరుసల్లో కేళీలను తీసివేసిన తర్వాతనే సంపర్కం చేయడం మంచిది. ఆడ వరుసల్లో వచ్చే పోలేన్ షెడ్డర్స్ (బి మొక్కలు) ని వాటి లక్షణాలని అనుసరించి అనగా క్రియాత్మక పుప్పొడిని కలిగి ఉండటం మరియు పోటాకు నుండి వెన్నులు పూర్తిగా బయటకు రావడం లాంటి లక్షణాలు కలిగి ఉన్నట్లైతే వెంటనే వాటిని తీసివేయాలి.

అనుబంధ సంపర్కం జరపటానికి ముందు ఆడ (A) వరుసలలోని మొక్కలు పోటాకు పై నుండి 2/3 పొడవు కత్తిరించుకోవాలి. దీనివలన మగ (R) మొక్కలు మొక్క పుప్పొడి ఏ అవరోధం లేకుండా ఆడ (A) మొక్కల కంకులపై పడుతుంది.

అనుబంధ సంపర్కమును ప్రతి రోజు ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతి 30 ని॥ ఒకసారి సుమారు వారం పది రోజుల పాటు కర్రల సహాయంతో గాని తాడు సహాయంతోగాని మగ (R) మొక్కలని ఊపి పుప్పొడిని ఆడ (A) మొక్కలపై పడే విధంగా చేపట్టాలి. మంచి ఎండ మరియు గాలి ఉన్న సమయంలో అనుబంధ సంపర్కం సమర్ధవంతంగా జరుగుతుంది.

ఆడ మరియు మగ వరుసల పూత సమన్వయం కోసం మగ రకాన్ని మూడు దఫాలుగా విత్తుకొన్నప్పటికీ వాతావరణం మరియు యాజమాన్య పద్ధతుల్లోని తేడాల వలన కొన్నిసార్లు ఒకేసారి పూతకి రావడం జరుగదు. దీనికోసం ఆడ, మగ రకాల పంట కాలపరిమితిని అనుసరించి వెన్ను ఏర్పడే దశలలోని వ్యత్యాసాన్ని 60 రోజుల ముందు నుండే గుర్తించాలి. ఒకవేళ తేడాని గమనించినట్లైతే ఆడ లేదా మగ రకాల మొక్కలు ఆలస్యంగా పూతకి రావడానికి 2 శాతం యూరియా ద్రావణాన్ని అలాగే తర్వాత పూత రావడానికి 1 శాతం ఫాస్ఫేట్ ఎరువుని పిచికారి చేయాలి. అదేవిధంగా పొలంలో నీరు నిండుగా ఉంచినట్లైతే మగ వరుసలు త్వరగా పూతకి వస్తాయి.

**జిబ్బరెల్లిక్ ఆమ్లం పిచికారి ప్రాముఖ్యత:** జన్యు పరంగా ఆడ రకం (A) మొక్కలు వెన్నులు పోటాకు నుండి పూర్తిగా వెడువడవు. పోటాకు కత్తిరింపుకు అయ్యే కూలీల ఖర్చుని తగ్గించి వెన్నులు పూర్తిగా పోటాకు నుండి బయటకు రావడానికి జిబ్బరెల్లిక్ ఆమ్లం పిచికారి దోహదం చేస్తుంది. పిచికారిని రెండు దఫాలుగా, మొదట 10% వెన్నులు బయటకు వచ్చే దశలో 30-40 పిపియం గా రెండవసారి 30% వెన్నులు బయటకు వచ్చిన దశలో 60-80 పిపియం గా పిచికారి చేసుకోవాలి. పౌడర్ రూపంలో ఉండే జిఏ3, ఆమ్లం నీటిలో కరుగదు. కావున మొదట ఆల్కహాల్ కొన్ని గంటలు కరిగించిన తరువాత మందు ద్రావణం తయారు చేసుకోవాలి.

### విత్తనం కోత, నూర్పిడి మరియు ఆరబెట్టుట:

కంకిలోని 90% గింజలు పక్వానికి వచ్చి పసుపు రంగులోకి మారిన తర్వాత కోత చేపట్టాలి. ముందుగా మగ వరుసలను (R) చేత్తో కోసి పనలను విత్తనోత్పత్తి క్షేత్రం నుండి తీసివేసిన తరువాత ఎఫ్1 విత్తనము (ఆడ మొక్కల (A) పై అభివృద్ధి అయిన విత్తనం) కోసుకోవాలి. ఆడ మరియు మగ పనలను వేరు వేరుగా దూరంగా ఆరబెట్టి నూర్పిడి చేసుకోవాలి.

ఎఫ్1 విత్తనాన్ని చేత్తో లేదా వరికోత యంత్రంతో కోయవచ్చు. వరికోత యంత్రంతో కోసేటప్పుడు యంత్రాన్ని ఖాళీగా 2-3 సార్లు నడిపించి విడి భాగాలు తీసి అందులో చిక్కుకున్న పూర్వపు వరి గింజలను తీసివేసి శుభ్రపరచాలి. తరువాత యంత్రంతో కోసిన 5-6 బస్తాలను ఎఫ్1 విత్తనం వేరుగా పోసుకోవాలి. తదుపరి కోసిన ఎఫ్1 విత్తనాన్నే విత్తనంగా సేకరించాలి.

విత్తనాన్ని 12-13% తేమ శాతం వచ్చే వరకు 3-4 రోజులు ఎండలో పలుచగా నేర్పి ఆరబెట్టాలి. విత్తనం ఎండిన తరువాత ఫ్యాన్ సహాయంతో తూర్పారబెట్టి శుభ్రపరచాలి. ఈ విధంగా ఆడ (A) మొక్కలపై తయారైన విత్తనాన్ని హైబ్రిడ్ విత్తనంగా వాడుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9618391562**





# యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు సమగ్ర సస్యరక్షణ

డా॥ డి. వీరన్న, డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ వి. రమ్య, బి. సౌందర్య, డా॥ జి. శేషు, డా॥ వై. హరి, బి. మాధవి, డా॥ జె. భార్గవి, కె. మానస రెడ్డి, డా॥ సిహెచ్. రాములు మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

తెలంగాణ రాష్ట్రంలో వరి పంటను యాసంగిలో సుమారు 51.49 లక్షల ఎకరాలలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైరు నాటు వేసే దశ నుండి పిలక దశలో ఉన్నది. అయితే యాసంగిలో వరి పైరును కాండం తొలిచే పురుగు (మొగి పురుగు) అధికంగా ఆశించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సిద్దిపేట, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల మరియు జగిత్యాల జిల్లాలో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇదే గత యాసంగిలో కూడా గమనించడం జరిగింది.

**యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతికి గల ప్రధాన కారణాలు:**

- వానాకాలంలో అక్టోబర్-నవంబర్ మాసాలలో అధిక వర్షాలు కురవటం వలన రైతులు వరి పంటకు చిరుపొట్ట దశలో కాండం తొలిచే పురుగుకు ఎలాంటి పురుగు మందులు పిచికారి చేయలేకపోవడం వలన కాండం తొలిచే పురుగు సంతతి పెరిగి, ఆ తర్వాత నిద్రావస్థ దశ (ప్యూపా) లో ఉండిపోతుంది. అదే యాసంగిలో అధిక ఉధృతితో ఆశించే అవకాశం ఉంది.
- అలాగే చాలా మంది రైతులు నారుమడి దశలో ఉన్న వరి పైరులో సిఫారసు చేయని మందులను లేదా క్లోరిపైరిఫాస్ వంటి మందులను యూరియాతో కలిపి వేయడం వలన లేదా సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను వాడటం వలన మిత్ర పురుగుల సంఖ్య తగ్గుతుంది కాబట్టి ఈ పురుగు ఉధృతి ఎక్కువవ్వడం జరగవచ్చు.
- పిలక దశలోనే కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గమనించినట్లైతే అంకురం నుండి చిరుపొట్ట దశలో దీని ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. కావున వరి పైరులో కాండము తొలిచే పురుగును ఎలా గుర్తించాలి మరియు నివారణకు చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించడమైనది.

**లక్షణాలు:**

యాసంగిలో వరిపైరును ఆశించే ప్రధానమైన పురుగు, కాండం తొలిచే పురుగు, వానాకాలం పంట కోసిన తర్వాత మోళ్ళల్లో నాములో వృద్ధి చెంది పంటకాలంలో నారుమడి దశ నుండి ఆశించి నష్టం కలుగజేస్తుంది. కాండం తొలిచే పురుగు యొక్క రెక్కల పురుగులు ముదురు ఎండి గడ్డిలో ఉండి రెక్కల ఇరువైపులా నల్లని చుక్కతో ఉండి ప్రొద్దునే లేదా సాయంత్రం వేళల్లో ఆకుకొనలపై కనపడతాయి. ఒక్కో తల్లి పురుగు 100 నుండి 150 గ్రుడ్లను గుంపులుగా ఆకు కొనలపై లేదా ఆకులపై పెట్టి గోధుమ రంగు వెంట్రుకలతో కప్పుతుంది. ఈ గ్రుడ్లు 5-9 రోజుల్లో పొదగబడి వాటి నుండి వచ్చిన పిల్ల పురుగులు (లార్వాలు) సన్నని దారం వంటి పదార్ధం ద్వారా కాండంలోకి చేరి తినడం వల్ల మొవ్వ చనిపోతాయి.

ఈ పురుగు దుబ్బువేసే దశలో ఆశిస్తే మొవ్వ చనిపోవడం, అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశించినట్లయితే ఈనిన తర్వాత వెన్నంతా తాలుపోయి తెల్లకంకులు గమనించవచ్చు. చనిపోయిన మొవ్వును లేదా తెల్లకంకిని లాగితే తేలికగా ఊడి వస్తుంది. మొవ్వ దశలో కన్నా, కంకి దశలో ఆశిస్తే ఎక్కువగా దిగుబడులు నష్టపోతాము. తెల్లకంకులు బయట పడిన తర్వాత నివారణ వల్ల పెద్దగా ఫలితం ఉండదు, ఎందుకంటే నష్టం అంకురం ఏర్పడే దశ నుండి చిరుపొట్ట దశల మధ్య జరుగుతుంది.

**సమగ్ర సస్యరక్షణ:**

రైతులు రెక్కల పురుగులను లేదా గ్రుడ్ల సముదాయాలను ఎప్పటికపుడు గమనించాలి. లార్వాలు కాండంలోనికి ప్రవేశించక ముందే నివారణ చర్యలు చేపట్టాలి. ఈ పురుగు ఉధృతిని గమనించడానికి రెండు అధ్యయనాలు ఉన్నాయి.

- ఎకరానికి చదరపు మీటరుకి ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం కనిపించిన వారం నుండి పదిరోజుల వ్యవధిలో పురుగు మందులు వాడటం లేదా
- ఎకరాకు 3 కాండం తొలిచే పురుగు లింగాకర్షక బుట్టలను అమర్చి, ప్రతి వారం పడే రెక్కల పురుగులను గమనించటం. వారానికి బుట్టకు 25 (అంటే 3 బుట్టలు కలిపి 75 మగ రెక్కల పురుగులు) లేదా అంతకు మించి రెక్కల పురుగులు పడినప్పుడు పురుగు మందులను వాడటం.

ఈ లింగాకర్షక బుట్టలను ఎకరాకి 8 చొప్పున 500, చ.మీ. కి ఒకటి చొప్పున (20×25 మీటర్లు) అమర్చుకోవాలి. ఈ బుట్టలలో మగ రెక్కల పురుగులు పడటం వల్ల ఆ ప్రాంతంలోని మగ రెక్కల పురుగుల సంఖ్య తగ్గి పోవటం వల్ల తల్లి పురుగులతో సంపర్కం తగ్గడం వల్ల గ్రుడ్ల సంఖ్య తగ్గుతుంది. ఈ పద్ధతి ద్వారా పురుగు మందులు వాడకుండా కాండం తొలిచే పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. ఈ బుట్టలను వాడినప్పుడు ప్రతి 3 వారాలకు లింగాకర్షక ఎరలను మార్చుకోవాలి.

- నారుమడి నుండి ప్రధాన పొలంలోకి ప్రవేశించే కాండం తొలిచే పురుగు నివారణకు నారు పీకే వారం రోజుల ముందు 5 సెంట్లు (200 చ.మీ) నారుమడికి (ఒక ఎకరాకు సరిపోయే నారుకు) 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను లేదా 600 గ్రా. ఫిప్రోనిల్ 0.3 జి గుళికలు లేదా 400 గ్రా. ఫిప్రోనిల్ 0.6 జి గుళికలు లేదా 500 గ్రా. క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జి పలుచగా నీరుంచి వేసుకోవాలి.
- వరి పైరు 15-20 రోజుల వయసున్న పిలకదశలో వరి పైరుకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జి 4 కిలోలు లేదా ఫిప్రోనిల్ 0.3 జి గుళికలు 8 కిలోలు లేదా ఫిప్రోనిల్ 0.6 జి గుళికలు 4 కిలోలు వేయాలి.
- కొన్ని ప్రాంతాల్లో 25-30 రోజుల వయసున్న వరి పంటను ఈ పురుగు ఆశించినట్లుగా గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎస్‌పి 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం సరిపోతుంది.
- పిలక దశలో కాండం తొలిచే పురుగు అధికంగా ఉండటం వలన అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశిస్తే తెల్లకంకులు ఏర్పడి నష్టం అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున రైతులు చిరుపొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతి గమనించి నివారణ చర్యలు చేపట్టాలి. చిరుపొట్ట దశలో నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **8802345027**

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం"

### రైతు వేదికల వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శాస్త్రవేత్తల - రైతుల ముఖాముఖి - జనవరి, 2026

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 1 | 06.01.2026 | యాసంగి మొక్కజొన్న సాగులో అధిక దిగుబడులకు సూచనలు | **డా॥ ఇ. రజనీకాంత్,** శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్, ఫోన్ నెం.: 9908698043 |
| 2 | 13.01.2026 | వేసవి నువ్వు పంట సాగు | **డా॥ ఎన్. సంధ్య కిషోర్,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, ఫోన్ నెం.: 9948976575 |
| 3 | 20.01.2026 | వేసవి అపరాలు సాగులో మెళకువలు | **డా॥ కె. రుక్మిణి దేవి,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం.:7675050041 |
| 4 | 27.01.2026 | వేసవి చిరుధాన్యాల సాగులో సూచనలు | **డా॥ డి. శశిభూషణ్,** ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ పాథాలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8919409933 |

# జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగులో ఎదురయ్యే సమస్యలు – పరిష్కార మార్గాలు

డా॥ ఇ. రజనీకాంత్, డా॥ ఇ. ఉమారాణి, డా॥ జి. ఉషారాణి, డా॥ బి. హరికృష్ణ,
డా॥ కె. మదన్‌మోహన్ రెడ్డి, డా॥ ఎమ్. రాజేంద్రప్రసాద్ మరియు డా॥ బి. రాంప్రసాద్
వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్









మనదేశంలో పండించే ఆహార, పశుగ్రాస మరియు పారిశ్రామిక పంటలలో మొక్కజొన్న పంట ప్రధానమైనది. ఇటీవల కాలంలో పెరిగిన సాగు వ్యయం. నీటి వనరుల లభ్యత మరియు వ్యవసాయ కూలీల కొరత వంటి పలు కారణాల చేత రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొంది ఆధునిక సాగు పద్ధతుల వైపు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా సాధారణ పద్ధతిలో మొక్కజొన్న సాగుకు బదులు జీరోటిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగును ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు. జీరోటిల్లేజ్‌లో భూమిని దున్నకుండానే పంటను నేరుగా విత్తడం ద్వారా దుక్కి దున్నడానికి అయ్యే ఖర్చు సమయం ఆదా అవడంతోపాటు నేల ఆరోగ్యం మరియు నేలలో మిగిలి ఉన్న తేమను సంరక్షించవచ్చు. అయితే జీరోటిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు లాభదాయకం అయినప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందుచేత జీరోటిల్లేజ్‌లో మొక్కజొన్నలో సాగులో ఎదురయ్యే ప్రధానమైన సమస్యలు మరియు పాటించవలసిన మెళకువలను క్రింద వివరించడం జరిగింది.

**జీరోటిల్లేజ్ మొక్కజొన్న సాగులో ప్రధాన సమస్యలు మరియు పరిష్కార మార్గాలు:**

**1. పూర్వపు పంట అవశేషాలు మరియు మొలక సమస్య:**

జీరోటిల్లేజ్‌లో దుక్కి దున్నకుండా విత్తనం విత్తుట ద్వారా పూర్వపు పంట అవశేషాలు (కొయ్యకాళ్ళు,దుబ్బులు మొ॥) విత్తనం మొలకెత్తకుండా ఆటంకం కలిగిస్తాయి. కాబట్టి సీడ్ డ్రిల్ లేదా హ్యాపీ సీడర్‌తో పంటను విత్తుకుంటే పూర్వపు పంట అవశేషాలు పక్కకు నెట్టివేయబడి సరియైన లోతులో విత్తనం పడి మొలకశాతం పెరుగుతుంది. పంట వేసేటప్పుడు నేలలో తగినంత తేమ లేనట్లైతే తేలికపాటి తడిని ఇచ్చి విత్తుకుంటే మొలకశాతం బాగుంటుంది.

పంట విత్తేముందు శిలీంద్ర నాశనులు మరియు కీటకనాశునులతో విత్తనశుద్ధి చేయడం వలన నేల ద్వారా సంక్రమించే చీడపీడలను తట్టుకుని మొలకశాతం పెరిగి లేత దశలో పంటను పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుతుంది.

**2. కలుపు మొక్కల ఉధృతి:** వరి మాగాణుల్లో మొక్కజొన్న పంటలో కలుపు ఎక్కువగా ఉంటుంది. మరియు వరి కొయ్యలు మళ్ళీ చిగురించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కావున విత్తిన 2 రోజుల్లోపు నేలలో సరైన తేమ ఉన్నప్పుడు కలుపు మందు 1 కిలో అట్రాజిన్ 50% డబ్ల్యుపి + పారాక్వాట్ డైక్లోరైడ్ ఎస్ఎల్ అనే కలుపు మందు 1 లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఈ పారాక్వాట్ అను గడ్డిమందు వరి మొలకలను మరియు మొలకెత్తిన కలుపు మొక్కలను చంపుతుంది. అదే విధంగా అట్రాజిన్ అను గడ్డిమందు కొత్తగా కలుపును మొలకెత్తకుండా పనిచేస్తుంది. ఒకవేళ విత్తిన తర్వాత కలుపు మొలిస్తే అట్రాజిన్ 1 కిలో 200 లీ. నీటిలో కలిపి కలుపు మొక్కలపై పడేట్లు పిచికారి చేయాలి. కలుపు ఉధృతిని బట్టి 25-30 రోజులకు హెలోసల్ఫ్యూరాన్ మిథైల్ 75 డబ్ల్యూజి 36 గ్రా. లేదా టోప్రామిజోన్ 33.6% ఎస్.సి. 40 మి.లీ.+ అట్రాజిన్ 400 గ్రా. లేదా అట్రాజిన్ + మీసోట్రయోన్ 1400 మి.లీ. లేదా టెంబోట్రయోన్ 34.4% ఎస్.సి. ద్రావణాన్ని 115 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి కలుపు 4 ఆకుల దశలో పిచికారి చేసినట్లయితే వివిధ రకాల కలుపు మొక్కలను నియంత్రించవచ్చు. అవసరమైతే కూలీలతో కలుపు తీయాలి.

**3. పంట పై వచ్చు పోషక లోపాలు:** నేలలో నత్రజని లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి బేసల్ డోస్‌గా సిఫారసు చేసిన యూరియా డి.ఎ.పి పొటాష్ ఎరువులను విత్తు సమయంలో వేయాలి. పై పాటుగా సిఫారసు చేసిన నత్రజని ఎరువును 45-50 రోజులకు మరియు పూత దశలో చేయాలి. జీరోటిల్లేజ్ మొక్కజొన్న పంటలో క్రింద తెలిపిన పోషక లోపాలు వస్తాయి.

**నత్రజని పోషక ధాతులోపం:** ఈ పోషక ధాతులోపం వచ్చినట్లైతే మొదట క్రింద ఆకులు పసుపు పచ్చగా మారి తర్వాత క్రమక్రమంగా మొక్క మొత్తం పాలిపోయి పసుపుపచ్చ రంగులోకి మారుతాయి. ఈ లోపం చాలా రోజులు కొనసాగితే ఆకు అంచున మొదలు వైపు మధ్య ఈనెల కొన నుండి 'V' ఆకారంలో మొత్తం పసుపు రంగుకు మారి ఎండిపోతుంది. ఈ నత్రజని లోపం సరైన తేమ లేనవుడుకాని లేదా తేమ ఎక్కువైనపుడు లేదా నేలలో సారవంతం లేనపుడు వచ్చును. దీని నివారణకు 2 శాతం యూరియా ద్రావణాన్ని వారం రోజుల వ్యవధలో 2 నుండి 3 సార్లు పిచికారి చేసుకోవాలి.

**భాస్వరం లోపం:** ఈ ధాతు లోపం నేలలో భాస్వరం లోపించినపుడు లేదా వాతావరణం చల్లగా ఉన్నపుడు లేదా పొలంలో నీరు నిలిచినపుడు కనబడుతుంది. ఈ ధాతు లోపం వచ్చునపుడు మొక్క పెరుగుదల ఆగిపోయి ఆకులు ఎరువుతో కూడిన నీలి లేదా ఊదా రంగులోకి మారుతాయి. దీని నివారణకు సిఫారసు చేసిన భాస్వరంను విత్తు సమయంలో తప్పకుండా వేయాలి. దీని నివారణకు పంటపై 2 శాతం డి.ఎ.పి. 4 నుండి 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

**జింక్ లోపం:** ఈ ధాతు లోపం వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మోతాదు మించి భాస్వరం ఎరువులను వేసినప్పుడు మరియు అధిక నీటి ముంపుకు గురైనపుడు కనబడుతుంది. ఈ ధాతు లోపం వచ్చినపుడు ఆకుల ఈనె మధ్య భాగాలు పాలిపోయిన పసుపు మరియు తెలుపు రంగుగా మారుతాయి. దీని నివారణకు పంటపై జింక్ లోపం వచ్చినప్పుడు 2 గ్రా॥ జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 4-5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**4. పురుగులు మరియు రోగాలు:** పంట అవశేషాలలో కొన్ని పురుగులు, తెగుళ్ళు నిల్వ ఉంటాయి. పంట అవశేషాలను సక్రమంగా చెదరగొట్టాలి.

**మొక్కజొన్నలో వచ్చు చీడపీడలు:** కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు

**కాండం తొలుచు పురుగు:** మొక్కజొన్నలో ఆశించే కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్‌సి 0.4 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి 12-15 రోజుల పైరు మీద పిచికారి చేయాలి. ఈ పురుగు నివారణకు ఈ క్రింది చర్యలను చేపట్టాలి.

- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉనికిని (పంట విత్తిన వారానికి) గమనించాలి.
- పొలంలో నలుమూలల తిరిగి పురుగు ఆశించిన మొక్కలను గమనించాలి.
- వేప సంబంధిత మందైన అజాడిరాక్టిన్ (1,500 పిపిఎం) 5 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వల్ల పురుగు గ్రుడ్లను, మొదటిదశ పిల్ల పురుగులను నివారిస్తుంది.
- స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడంవల్ల రెండవదశ దాటిన లార్వాల నివారించవచ్చు.
- క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనటోరం 0.5 మి.లీ లేదా థయోమిథాక్సామ్ + లామ్డాసైహాలోత్రిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడంవల్ల పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న మరియు ఎదిగిన లార్వాలను కూడా నియంత్రించవచ్చు. 65 రోజులు పైబడిన మొక్కజొన్న పంట అనగా పూతదశ తరువాత పురుగును గమనించినట్లైతే పురుగు మందులు పెద్దగా పనిచేయవు. ఎదిగిన లార్వాలను మనుషులతో ఏరించి కిరోసిన్ దబ్బాలో వేసి చంపి వేయాలి లేదా విషపు ఎరను వేసుకోవాలి.

**కత్తెర పురుగు:** ఇటీవల వాతావరణ మార్పుల వలన మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి గమనించడమైనది. కత్తెరపురుగు మొదటిదశ లార్వాలు పత్ర హరితాన్ని గోకి తినుటవలన ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుంది. రెండు మరియు మూడవ దశ లార్వాలు ఆకు సుడిలో ఉండి రంధ్రాలు చేసుకుంటూ తినటం వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడుతాయి. సుడిలోని ఆకులను పూర్తిగా కత్తరించి వేస్తుంది. పురుగు విసర్జించిన పసుపు పచ్చని గుళికలను సుడులలో గమనించవచ్చును. గొడ్డు మొక్కలు కూడా ఏర్పడుతాయి. ఎదిగిన లార్వాదశలో ఆకులను వెలుపల నుండి లోపలి వైపుకు తినివేస్తూ, పూర్తిగా ఆకులను తిని ఈనెలను మాత్రమే మిగులుస్తాయి. కంకి పొరలను తొలుచుకుంటూ రంధ్రాలు చేసి లోపలి గింజలను ఆశించి నష్టపరుస్తుంది.

**కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ:**

1. ఇమిడాక్లోప్రిడ్ 4 మి.లీ. మందును కిలో విత్తనంకు కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకున్నట్లయితే సుమారు 20 రోజుల వరకు కత్తెర పురుగు రాకుండా పంటను కాపాడుకోవచ్చును.
2. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 8 నుంచి 10 వరకు పైరుకు ఒక అడుగుపై వరకు ఉండునట్లు అమర్చుకోవాలి.
3. మొక్కజొన్న చుట్టూ నాలుగు వరుసలలో నేపియర్ గడ్డిని సాగు చేసి గడ్డి పై పురుగు పెట్టిన గ్రుడ్డు సముదాయాన్ని నాశనం చేయాలి.
4. పొలంలో నలుమూలల తిరిగి పురుగు ఆశించిన మొక్కలను గమనించాలి. మొక్కజొన్నలో సిఫారసు చేసిన ఎరువులను (నత్రజని, భాస్వరం మరియు పొటాష్) వేసుకోవాలి. పైరులో కలుపు లేకుండా ఎప్పటికప్పుడు కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.
5. పురుగు గమనించిన వెంటనే పొడి ఇసుకను మొక్కజొన్న సుడులలో వేసుకున్నచో ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకుగాను ఈ క్రింది రసాయన మందులను మొక్క సుడిలో పడునట్లుగా ఉదయం లేదా సాయంత్రం వేళలో పిచికారి చేయాలి. ముందు జాగ్రత్తగా పైరు మొలచిన 7-10 రోజులలోపు వేప సంబంధిత మందైన అజాడిరక్టిన్ (1500 పిపిఎం) 5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 20-25 రోజుల దశలో పురుగు ఉధృతి గమనించినచో క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎరను లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ + లామ్డా సైహలోథ్రిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి పిచికారి చేయాలి. విషపు ఎర తయారీ విధానం ఎకరానికి 10 కిలోల తౌడు, 2 కిలోల బెల్లం తీసుకొని, బెల్లంను 2-3 లీటర్ల నీటిలో కరిగించి తరువాత తౌడులో కలిపి మిశ్రమాన్ని 24 గంటలు పులియనిచ్చి అరగంట ముందు ఈ మిశ్రమానికి 100 గ్రా.ల థయోడికార్బ్ మందును కలిపి విషపు ఎరను మొక్క సుడిలో ఉదయం లేదా సాయంత్రం వేళలో వేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9908698043**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఎ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. జనవరి, 2026 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 08.01.2026 | మానవ ఆరోగ్యంపై ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ ప్రభావం | **డా॥ టి. రోహిత్,** శాస్త్రవేత్త<br>క్వాలిటీ కంట్రోల్ ల్యాబోరేటరీ, పి.జ.టి.ఎ.యు., రాజేంద్రనగర్<br>ఫోన్ నెం.: 8879183895 |
| 15.01.2026 | యాసంగి పంటలలో ఎరువుల మరియు కలుపు యాజమాన్యం | **శ్రీమతి కె. సంధ్య రాణి,** శాస్త్రవేత్త (అగ్రానమి)<br>వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్, ఫోన్ నెం.: 7207735341 |
| 22.01.2026 | జొన్న ప్రాముఖ్యత, రకాలు మరియు యాజమాన్యం | **శ్రీ ఎ. శ్రీరామ్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 8919777028 |
| 29.01.2026 | వేసవిలో అపరాల సాగు - మేలైన యాజమాన్యం పద్ధతులు | **డా॥ జి. ఈశ్వర్ రెడ్డి,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 6281121526 |

# జనవరి మాసంలో సాగుకు అనుకూలమైన కొర్ర పంట ప్రాముఖ్యత మరియు సాంకేతిక యాజమాన్య పద్ధతులు

డా॥ శేఖర్ కలువల

అగ్రానమి విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్





ప్రపంచ వ్యాప్తంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై శ్రద్ధ, అవగాహన పెరగడం వల్ల చాలా మార్పులు గమనిస్తున్నాము. ఈ విషయంలో ప్రధానంగా భారతదేశంలో సిరిధాన్యాలు మరియు శ్రీ అన్నంగా పిలవబడుతున్న చిరుధాన్య పంటైన కొర్రతో బహుళ ప్రయోజనాల దృష్ట్యా స్వల్పకాలంలోనే అధిక దిగుబడులనిచ్చే వివిధ రకాలు మరియు కొర్ర విలువ ఆధారిత ఉత్పత్తులు రావడంచే దేశీయ మార్కెట్‌లో డిమాండు పెరుగుతుండడం గమనిస్తున్నాము. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలైనా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌ల రైతాంగానికి కొర్ర సాగుకు చాలా అనుకూలమైన మరియు లాభదాయకం. మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులు జనవరిలో సాగు ఆరంభించినట్లైతే అధిక దిగుబడులను ఖరీఫ్ లేదా వానాకాలం కన్నా ఎక్కువ సాధించవచ్చు.

గత ఐదు సంవత్సరాలుగా కొర్రల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాల్లో సాగవుతోంది. ప్రధానంగా కొర్ర పండించే రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, రాజస్థాన్, మహారాష్ట్ర మరియు ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నది. కొర్రలో ప్రోటీన్లు మరియు పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. పోషకాల పరంగా 60% పిండి పదార్థాలు, 12.3% ప్రోటీన్లు, 8% పీచు పదార్థం ఉండి భాస్వరం 290 మి.గ్రా., కాల్షియం 31 మి.గ్రా., 2.8 మి.గ్రా. ఐరన్ (ప్రతి 100 గ్రా. లకు గాను) లభిస్తాయి. కోత అనంతరం చేపట్టే ప్రాసెసింగ్ అధికంగా చేయకుంటే పోషకాల లభ్యత ఎక్కువగా ఉండును.

**వాతావరణం మరియు అనుకూలమైన నేలలు:** కొర్రలను ఉష్ణమండలంతోపాటు ఉప ఉష్ణ మండల ప్రాంతాలలో పండించవచ్చు. తేలికపాటి ఎర్ర చల్కా నేలలు మరియు మధ్యస్థ నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఈ పంట అధిక తేమను తట్టుకోలేదు.

**పంట కాలం:** తక్కువ, పంటకాలం సుమారుగా 85-100 రోజుల్లోపే కోత పూర్తవుతుంది.

**విత్తే సమయం:** వేసవి పంట సాగుకు జనవరి రెండవ పక్షంలోపు విత్తుకోవాలి.

**రకాలు:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సిఎఫ్×ఎమ్‌వి-1 మహానంది, రేనాడు, గరుడ, లేపాక్షి నరసింహరాయ, కృష్ణదేవరాయ మరియు సూర్యనంది మేలైన దిగుబడులు ఇస్తాయి.

**విత్తన మోతాదు:** ఎకరాకు 2.0 కిలోలు

**విత్తనశుద్ధి:** వ్యాధులను నివారించడానికి ఒక కిలో విత్తనానికి 3.0 గ్రా. కార్బండాజిమ్‌తో విత్తనశుద్ధి చేయాలి.

**విత్తే విధానం:** సాళ్ళలో విత్తనం నాటవచ్చు లేదా నారు నాటవచ్చు. విత్తే ముందు 1:3 నిష్పత్తిలో విత్తనం మరియు సన్నని ఇసుక కలుపుకొని వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంలో గొర్రుతో విత్తుకోవాలి.

**ఎరువులు:** ఎకరాకు 3-4 టన్నుల పశువుల ఎరువు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరంనిచ్చే ఎరువులను విత్తేటప్పుడు వేయాలి. విత్తిన 30-35 రోజుల దశలో మరో 8 కిలోల నత్రజనినిచ్చే ఎరువును పైపాటుగా వేయాలి.

**నీటి యాజమాన్యం:** పొడి వాతావరణం ఎక్కువకాలం ఉంటే, దిగుబడిని పెంచడానికి మొదటి నీటితడిని 25-30 డిఏఎస్ వద్ద, రెండవ నీటితడిని 40-45 డిఏఎస్ వద్ద ఇవ్వాలి.

**కలుపు నియంత్రణ:** విత్తిన 25-30 రోజుల వరకు కలుపు లేకుండా చేసుకోవాలి. ఉత్తమ దిగుబడి కోసం సాళ్లలో నాటిన పంటలో రెండుసార్లు అంతరకృషి మరియు ఒకసారి చేతితో కలుపుతీయడం అవసరం. విత్తనాలు చల్లి నాటిన పంటలో రెండుసార్లు చేతి కలుపులు తీయుట మరియు 2,4-డి సోడియం ఉప్పు (80%) హెక్టారుకు 1.0 కిలో విత్తిన 20-25 రోజులలో పిచికారి చేయాలి. ఐసోప్రోటురాన్ హెక్టారుకు 1.0 కిలో 500 లీ. నీటిలో కలిపి విత్తిన 2 రోజుల లోపల తడి నేలపై పిచికారి కూడా ప్రభావమంతమైనది.

**అంతర పంటలు:** కొర్రలు + వేరుశనగ (2:1 నిష్పత్తి), కొర్రలు + బఠానీ (5:1 నిష్పత్తి) వేసినట్లైతే ఒకే పంటగా కొర్రలు వేసినప్పటికీ లాభదాయకంగా ఉంటుంది.

**కోత సమయం:** పంట 80-100 రోజుల్లో కోతకు వస్తుంది. కంకులు ఎండినప్పుడు, కంకులను విడిగా లేదా మొత్తం మొక్కను కొడవలితో కోయవచ్చు. ఈ పంట జనవరిలో విత్తినచో సాధారణంగా ఏప్రిల్-మే వరకు కోతకొస్తుంది.

**దిగుబడి:** సగటున ధాన్యం దిగుబడి ఎకరాకు 8-12 క్వింటాళ్ళు మరియు పశుగ్రాసం దిగుబడి హెక్టారుకు 4.0-6.0 టన్నులు.

## కీటకాలు - నివారణ:

**మొవ్వ చంపు ఈగ:** మొవ్వ చంపు ఈగ ఉధృతిని పర్యవేక్షిస్తూ ఉండాలి. ఈగ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో 50 శాతం అధిక విత్తనాన్ని వాడడం మూలంగా మొక్కల సంఖ్య తగ్గదు. భూమిని సిద్ధం చేసే సమయంలో మట్టిలో కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు హెక్టారుకు 8-10 కిలోల వరుసల్లో వేసుకోవాలి. మొక్కల మీద నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి పిచికారి చేయాలి.

## తెగుళ్ళు - నివారణ:

**అగ్గి తెగులు:** చిన్న మొక్కలు ఎక్కువగా గురవుతాయి. లక్షణాలు వృత్తాకార లేదా అండాకాల ఆకారపు మచ్చలు ఆకుపై ఏర్పడతాయి. ఈ మచ్చలు మధ్యలో బూడిద రంగు కలిగి ఉండి ముదురు గోధుమ రంగు అంచుతో ఉంటాయి. అనుకూలమైన పరిస్థితులలో, ఈ మచ్చలు పెద్దవిగా మారి, కలిసిపోయి, పగిలిపోయినట్లుగా కనిపిస్తాయి. మరియు గణనీయంగా దిగుబడి నష్టాన్ని కలిగిస్తాయి. నివారణకు తెగులును తట్టుకొను రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎక్కువగా నత్రజని ఎరువులను వాడకూడదు. తెగులు ప్రారంభ దశలో ఎస్ఎఎఎఫ్ (0.2%) లేదా కార్బండాజిమ్ (0.05%) లేదా ట్రైసైక్లోజోల్ (0.05%) పిచికారి చేయడం మరియు వ్యాధి తీవ్రతను బట్టి 10 రోజుల తర్వాత అవసరాన్ని బట్టి రెండవ పిచికారి ద్వారా ఈ తెగులును నియంత్రించవచ్చు.

**వెర్రి కంకి తెగులు:** తేమతో కూడిన వాతావరణంలో ఆకుల అడుగున బూజు లాంటి శిలీంధ్రం పెరుగుదల కనిపిస్తుంది. మొక్క నుండి బయటకు వచ్చిన కంకులు ఆకుపచ్చని ఆకుల మాదిరిగా మారుతాయి.

నివారణకు తెగులును తట్టుకొను రకాలను ఎంపిక చేసుకోవాలి. సోకిన మొక్కల అవశేషాలను సేకరించి తొలగించాలి. కిలో విత్తనానికి 3 గ్రా. రిడోమిల్ - ఎమ్‌జెడ్ 72 డబ్ల్యుపి తో విత్తనశుద్ధి చేయడం వల్ల విత్తనం ద్వారా మరియు నేల ద్వారా వచ్చే సంక్రమణను నివారించవచ్చు. 3 గ్రా. రిడోమిల్-ఎమ్‌జెడ్ లీటరు నీటిలో పిచికారి చేయడం వల్ల ఈ తెగులు నియంత్రించవచ్చు.

**తుప్పు తెగులు:** మొక్కల దిగువ ఆకుల రెండు వైపుల ఎర్రటి గోధుమ రంగు తుప్పు మచ్చలు కనిపిస్తాయి. తరువాత ఆకు మరియు కాండం మీద పెద్ద బుడిపెలుగా అభివృద్ధి చెందుతాయి. ఇవి దీర్ఘచతురస్రాకారంగా, గోధుమ రంగులో ఉంటాయి. తరచుగా రేఖీయ వరుసలలో ఏర్పడతాయి. సంక్రమణ తీవ్రంగా ఉంటే, ఆకులు ఎండిపోతాయి. ఫలితంగా గణనీయమైన దిగుబడి నష్టం జరుగుతుంది. నివారణకు వ్యాధి నిరోధక రకాలను వాడాలి. పొలం గట్లపై ఆశ్రయ మొక్కలను నాశనం చేయాలి. లక్షణాలను గమనించిన వెంటనే లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్‌ను పిచికారి చేయాలి.

# వేసవి నువ్వు పంట సాగులో అధిక దిగుబడులకు పాటించవలసిన మెళకువలు

వై. స్వాతి, యన్. సుమలత, డా॥ యన్. సంధ్య కిషోర్, డా॥ పి. స్పందన భట్, డా॥ పి. రవి, కె. రామకృష్ణ,
డా॥ కె. రాజేష్, డా॥ యన్. సాయినాధ్ మరియు డా॥ హరీష్ కుమార్ శర్మ

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల



వేసవి కాలంలో సాగు చేయడానికి అనుకూలమైన నూనెగింజల పంటలలో ప్రధానమైనది నువ్వులు. తక్కువ పెట్టుబడి, స్వల్పకాల పరిమితి, రెండవ పంటగా వేసవి కాలంలో సాగుచేసే వెసులుబాటులు ఉన్న అన్ని రకాల నేలలలో పంట సాగుకు అనుకూలత, ఎగుమతి ప్రాధాన్యం మరియు మంచి మార్కెట్ ధర లభించడం వలన రైతులు ఈ పంటను వేసవిలో సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ మరియు రబీలో పండించిన దానికన్నా వేసవిలో ఆరుతడి పంటగా సాగుచేసినప్పుడు చీడపీడల బెడద తక్కువగా ఉండి నాణ్యమైన విత్తనం మరియు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉన్నది. ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలో వేసవిలో సాగుచేస్తున్నారు. రైతులు పసుపు తీసిన తర్వాత రెండవ పంటగా నువ్వులను సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. విత్తన ఎంపిక మొదలు, విత్తే విధానం,కలుపు, ఎరువులు, నీటి మరియు చీడపీడల యాజమాన్యం, కోత మరియు కోత దశ అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు లాంటి విషయాలపై రైతులకు సాంకేతికంగా అవగాహన లేకపోవడం వలన క్షేత్రస్థాయిలో దిగుబడులు తక్కువగా నమోదు అవుతున్నాయి. కావున వేసవి నువ్వు సాగులో పాటించవలసిన యాజమాన్య చర్యలను రైతులకు వివరించడం ద్వారా అధిక దిగుబడులు పొందుతారు.

**నేల ఎంపిక మరియు తయారీ:** మురుగు నీరు నిలవని తేలికపాటి నేలలు నువ్వు సాగుకు అనుకూలం. దుక్కిని బాగా చదును చేసి పొడి దుక్కి ఉండేలా చేసుకున్నట్లయితే విత్తనాలు బాగా మొలకెత్తుతాయి.

**అనువైన రకాలు:** అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం - నువ్వు పంట, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల నుండి విడుదల చేసిన తెల్లరంగు గింజ నువ్వు రకాలు వేసవి కాలంలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. రాజేశ్వరి, శ్వేత (జె.సి.యస్ 96), హిమ (జె.సి.యస్ 94-26), చందన, జగిత్యాల తిల్-1 (జె.సి.యస్ 1020), జగిత్యాల తిల్-2 (జె.సి.యస్ 2454), తెలంగాణ తిల్-1 (జె.సి.యస్ 3202) సివిఆర్‌సి.

**విత్తన సేకరణ:**

**మోతాదు-సమయం విత్తు పద్ధతి:** విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానాలు / తెలంగాణ సీడ్స్ / యన్ఎస్‌సి / నమ్మకమైన విత్తన

రైతుల నుండి మాత్రమే సేకరించాలి. విత్తన మొలకశాతం కనీసం 80 శాతానికి పైగా ఉండాలి. విత్తు సమయం విత్తన మోతాదు వేసవి (జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు) 2.5 కిలోల విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఎకరాకు 2.5 కిలోల విత్తనానికి 7 కిలోల పొడి ఇసుకలో కలిపి వేసుకోవాలి. విత్తనాన్ని 2.5 సెం.మీ. లోతు మించకుండా వరుసలలో విత్తుకోవాలి.

పంటను వరుసలలో గొర్రు / ట్రాక్టరు నడిచే సీడ్‌డ్రిల్‌తో విత్తడం వల్ల వరుసల మధ్య దూరం (30 సెం.మీ.) మొక్కలు మధ్య దూరం (15 సెం.మీ.) గా నియంత్రించవచ్చు. రైతుస్థాయిలో పొడి దుక్కులో విత్తనాన్ని సమంగా చల్లుకొని గొర్రు తోలుకుంటారు.

**విత్తనశుద్ధి:** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా మ్యాంకోజెబ్ లేదా 2 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యుయస్ కలిపి శుద్ధి చేసుకొని విత్తుకోవాలి. మొదటగా తెగుళ్ళ మందుతో విత్తనశుద్ధి చేసి, తరువాత పురుగుమందుతో విత్తనశుద్ధి చేయాలి.

**ఎరువులు:** ఆఖరి దుక్కిలో ఒక ఎకరానికి బాగా చివికిన 4 టన్నుల పశువుల ఎరువు లేదా ఒక టన్ను వర్మీకంపోస్ట్ లేదా టన్ను గొర్రెల ఎరువును వేసి కలియదున్నాలి. సేంద్రియ ఎరువులు వాడటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చును.

దుక్కిలో ఎకరానికి 16 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం మరియు పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో గనుక వేసినట్లైతే కాల్షియం మరియు గంధకం మూలంగా గింజ నాణ్యత మరియు నూనె శాతంతోపాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. వేసవిలో విత్తిన 30 రోజులకు మొదట కలుపు తీసి మొక్కలు పలుచగా చేసిన తర్వాత నీటి తడి పెట్టుకొని ఎకరానికి 25 కిలోల యూరియా మరియు 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలుపుకొని మొక్కల మొదళ్ళలో వేయాలి.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే మొదటి నీటి తడి ఇవ్వాలి. లేని పరిస్థితులలో మొలక శాతం దెబ్బతింటుంది. పూతదశ, కాయ అభివృద్ధి మరియు గింజ కట్టు దశల్లో తడులు ఇవ్వాలి. విత్తిన తర్వాత 35-40 రోజుల నుండి 65-70 రోజుల వరకు ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

**కలుపు నివారణ:** విత్తిన 48 గంటల్లోపు తడి నేలపై 5 మి.లీ. అలాక్లోర్ 50% లేదా 6-7 మి.లీ. పెండిమిథాలిన్ 30% లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. విత్తిన 20 రోజులకు అదనపు మొక్కలను తొలగించి పలుచన చేయాలి. మొక్కలు ఒత్తుగా ఉన్నట్లైతే, ఉన్న మొక్కల్లో కొమ్మలు మరియు ఆకులు మాత్రమే ఏర్పడి పూత మరియు కాత ఎక్కువగా రాక దిగుబడి తగ్గిపోతుంది. విత్తిన 30 రోజుల వరకు కలుపు లేకుండా చేయాలి.

**సస్యరక్షణ:** వేసవి నువ్వు పంటను చీడపీడలు మొలకెత్తిన దశ నుండి గింజ కట్టే దశ వరకు ఆశించి పంటకు నష్టం కలుగజేస్తాయి. అందువలన రైతులు నువ్వు పంటను ఆశించే చీడపీడలు గురించి అవగాహన ఏర్పరచుకొని, సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టినచో అధిక దిగుబడులు పొందే అవకాశం ఎంతైనా ఉంది.

**గడ్డి చిలుక:** విత్తిన 20 రోజులలోపు గడ్డి చిలుక మొలకెత్తే మొదళ్ళను కొట్టివేయడం వలన మొక్క ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది. దీని నివారణకు రక్షక పంటగా జొన్న వేయడంతో పాటు గట్ల వెంబడి ఎలాంటి కలుపు లేకుండా చూడాలి. ఉధృతి ఎక్కువైనప్పుడు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2.0 మి.లీ. ప్రొఫెనోఫాస్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుముడత / కాయ తొలుచు పురుగు:** పైరు లేత దశలో, చిన్న గొంగళి పురుగులు 2-3 ఆకులను దగ్గరకు చేర్చి గూడు కట్టుకొని పచ్చని పదార్థం గోకి తినడం వలన ఆకులు ఎండిపోయి, కాలినట్లు కన్పిస్తాయి. ఈ పురుగు మొగ్గ ఏర్పడే దశలో పూమొగ్గలను, పూతను మరియు కాయల్లోని గింజలను తింటూ పంటకు నష్టం కలుగజేస్తాయి. దీని నివాణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రసం పీల్చే పురుగులు (తామర పురుగులు, పేనుబంక మరియు తెల్లనల్లి):** తామర పురుగులు మరియు పచ్చదోమ విత్తిన 10 రోజుల నుండి పంటను ఆశిస్తాయి. ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులన్నీ పాలిపోయి తర్వాత ఎండిపోతాయి. తెల్లనల్లి ఆశిస్తే ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ముడుచుకొని దోనె ఆకారంగా మారి పాలిపోతాయి. ప్రధానంగా వేసవి నువ్వు పంటలో పేనుబంక ఉధృతి అధికంగా ఉంటుంది. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తెల్లనల్లి నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బీహారి గొంగళి పురుగులు:** పైరు విత్తిన 20 రోజుల నుండి ఆఖరి దశ వరకు ఆశిస్తుంది. పైరు లేత దశలో చిన్న గొంగళి పురుగులు గుంపులు గుంపులుగా చేరి ఆకుల మీద పత్ర హరితాన్ని తిని ఆకులను జల్లెడాకులుగా మారుస్తాయి. బాగా ఎదిగిన గొంగళి

పురుగులు ఒక మొక్క నుండి ఇతర మొక్కలకు వలస వెళ్ళి పంటకు ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు పంటలో చిన్న గొంగళి పురుగులు ఆకులపై కనిపించిన వెంటనే ఆకులతో సహా తీసివేసి నాశనం చేయాలి. ఈ పురుగు నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 10 గ్రా. థయోడికార్బ్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ పిచికారి చేయాలి.

**పిండిపురుగు / పిండినల్లి:** ఈ మధ్యకాలంలో పిండి పురుగు యొక్క పిల్ల మరియు తల్లి పురుగులు కొమ్మలు, కాండం మరియు మొగ్గలు నుండి రసాన్ని పీల్చడం వలన మొక్క వాడి ఎండిపోతుంది. నివారణకు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. నివారణకు ఒక లీటరు నీటికి 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ కలిపి పిచికారి చేయాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు:** పైరు విత్తిన 30 రోజుల నుండి ఆఖరి దశ వరకు ఆశిస్తుంది. ముదురు గోధుమ రంగులో గల వలయాకారపు మచ్చలు మొక్క క్రింద ఆకుల మీద ఏర్పడి తర్వాత మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకులు అంతటా వ్యాపించడం వలన ఆకులు ఎండిపోతాయి. మచ్చలు కాడలు మరియు కాయలు మీద కూడా వ్యాపించడం వలన గింజ నాణ్యత మరియు దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఈ తెగులు కలుగజేయు శిలీంధ్రం పంట అవశేషాల ద్వారా మరియు విత్తనాల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

**సర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు:** ఆకులపై చిన్న చిన్న బూడిద రంగు మచ్చలు ఏర్పడి తర్వాత గోధుమ రంగుకు మారి ఆకుల అంతటా వ్యాపించి ఆకులు రాలిపోతాయి. ఈ మచ్చలు కాండం మరియు కాయలు మీద కూడా ఏర్పడి పంటను నష్టపరుస్తాయి.

ఆల్టర్నేరియా మరియు సర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు నివారణకు విధిగా విత్తనశుద్ధి పాటించాలి. ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగుళ్ళను తొలిదశలోనే గుర్తించి 2.5 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిసి ఉన్న మందును లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు మార్చి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** ఈ తెగులు ముఖ్యంగా శాఖీయ దశ నుండి కాయలు గింజకట్టే దశ వరకు తీవ్రంగా ఆశిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలో తగ్గుదల, గాలిలో అధిక తేమ శాతం మరియు మంచు కురవటం లాంటి పరిస్థితులలో ఈ తెగులు ఉధృతి నువ్వు పంటలో ఎక్కువగా ఉంటుంది. తొలిదశలో ముదురు ఆకులమీద బూడిద రంగు లాంటి పదార్థం ఏర్పడి తర్వాత లేత ఆకులకు వ్యాపిస్తుంది. ఆకులలో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడి, ఆకులు పండుబారి రాలిపోతాయి. నివారణకు తొలిపూత దశలో నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా మైక్లోబ్యూటానిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వేరు మరియు కాండం కుళ్ళు తెగులు:** తెగులు సోకిన మొక్కల ఆకులు పసుపు వర్ణానికి మారి తరువాత దశలలో ఆకులు ముడుచుకొని రాలిపోతాయి. తెగులు సోకిన మొక్కల వేర్లు పూర్తిగా లేదా పాక్షికంగా కుళ్ళిపోతాయి. ఆశించిన మొక్కల కాండం కుళ్ళిపోయి, గులాబిరంగు శిలీంధ్రపు పెరుగుదలను కాండం మీద గమనించవచ్చును. అధిక ఉష్ణోగ్రతలు మరియు బెట్ట పరిస్థితులు వృద్ధికి దోహదపడతాయి. దీని నివారణకు పంట మార్పిడి పాటించాలి. ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులును తొలిదశలోనే గుర్తించి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మ్యాంకోజెబ్ ఒక లీటరు నీటికి కలుపుకొని భూమి తడిచేటట్లు మొక్కల మొదళ్ళను తడపాలి.

**వెర్రి తెగులు (ఫిల్లోడి):** తెగులు సోకిన మొక్కల ఆకులు చిన్నవై పువ్వుల్లోని భాగాలన్నీ చిన్న ఆకులుగా మారిపోయి కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల తగ్గి పై భాగంలో చిన్న చిన్న ఆకులు గుబురుగా ఏర్పడి వెర్రి తల మాదిరిగా కనిపించును. ఈ తెగులు పచ్చదోమ ద్వారా వ్యాప్తి చెందును.

**యాజమాన్యం:** రాజేశ్వరి, చందన మరియు హిమ రకాలు కొంతవరకు తట్టుకుంటాయి. పచ్చదోమ నివారణకు ఒక లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారి చేయాలి.

**పంటకోత:** ఆకులు రాలటం ప్రారంభమయినప్పుడు, కాయలు 75% పసుపు రంగుకు మారిన తర్వాత కోయాలి. కోసిన తర్వాత మొక్కలను టార్పలిన్ పై తల క్రిందులుగా నిలబెట్టి వారం రోజులపాటు ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత కర్రలతో కొట్టి గింజలను నూర్పిడి చేసినట్లైతే గింజ నాణ్యత మరియు తెలుపుదనం బాగా ఉంటుంది.

**నిల్వ చేయటం:** గింజల్లో తేమ శాతం 8కి తగ్గే వరకు ఎండలో ఆరబెట్టాలి. గోనె సంచుల్లో నిల్వ చేసి అన్ని వైపుల నుండి గాలి, వెలుతురు లభ్యమయ్యే ప్రదేశంలో నిల్వ చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7032697271**



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సంవత్సరం వానాకాలం, యాసంగి మరియు ఎండాకాలంలో సాగు చేసే ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 23 సం॥ల నెలవారీ మోడల్ ధరలు మరియు 7 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 వానాకాలం, యాసంగి మరియు ఎండాకాలం పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

**2025-26 వానాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | కంది | తాండూర్ | జనవరి-ఫిబ్రవరి | 6800-7100 |
| 2. | మిరప | ఖమ్మం | జనవరి-ఫిబ్రవరి | 14500-17000 |

**2025-26 యాసంగి పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1 | మొక్కజొన్న | బాదేపల్లి | జనవరి-మార్చి | 2240-2480 |
| 2 | శనగలు | నారాయణపేట | జనవరి-ఫిబ్రవరి | 5100-5400 |
| 3 | వేరుశనగ | గద్వాల్ | జనవరి-మార్చి | 5750-6250 |
| 4 | ప్రొద్దుతిరుగుడు | సిద్దిపేట | జనవరి-మార్చి | 4300-4600 |

**2025-26 ఎండాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1 | టమాటా | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 900-1100 |
| 2 | వంకాయ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1630-1990 |
| 3 | బెండ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1800-2100 |
| 4 | బత్తాయి | గడ్డి అన్నారం | అక్టోబర్-నవంబర్ | 3000-3300 |
| 5 | మామిడి | గడ్డి అన్నారం | మార్చి-మే | 4310-4860 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

# వ్యవసాయ విద్యా దినోత్సవం...






వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి మరియు వ్యవసాయ శాఖ మంత్రి భారతరత్న డా॥ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని డిసెంబర్ 3న ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వర్సిటీ ఉపకులపతి డా॥ అల్దాస్ జానయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, వ్యవసాయంలోని వివిధ కోణాలను విద్యార్థులకు పరిచయం చేయడం, వ్యవసాయం యొక్క ఔచిత్యాన్ని తెలియచేయటం ద్వారా విద్యార్థులను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించడం మరియు పాఠశాల విద్య తర్వాత వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో వృత్తిని ఎంచుకోవడం తద్వారా భారతదేశ అభివృద్ధిలో వ్యవసాయరంగం యొక్క ప్రాముఖ్యతను ఇనుమడింపచేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పాఠశాల పాఠ్యాంశాలలో ప్రస్తుతం ఉన్న జీవశాస్త్రంతో పాటు వ్యవసాయం మరియు ఆహార శాస్త్రాలకు సంబంధించిన ఒక సబ్జెక్టుగా ఉండాలని అన్నారు. అనంతరం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించడం జరిగింది. దానిలో భాగంగా సేద్య విభాగంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్, వ్యవసాయ పనిముట్లు, బిందు సేద్యం, కీటక శాస్త్ర విభాగంలో ఏర్పాటు చేసిన పట్టుపురుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, వివిధ పంటలను ఆశించే చీడపీడలు మరియు సకశేరుక చీడపీడలు వాటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, బ్లాక్ సోల్జర్ ఫ్లై, వ్యవసాయ విస్తరణ విభాగంలో వ్యవసాయ టూరిజం, వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగాలు, వ్యవసాయ ఆర్థికశాస్త్రంలో వ్యవసాయ మార్కెటింగ్ ఇంటలిజెన్స్, అంచనా ధరలు మరియు సాగు ఖర్చులు, జన్యుశాస్త్ర విభాగంలో వివిధ పంటలలో విడుదలైన నాణ్యమైన విత్తనాలు, టిష్యూ కల్చర్, స్పీడ్ బ్రీడింగ్ ఛాంబర్, డిఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ మరియు మైక్రోప్రోపగేషన్, ప్లాంట్ పాథాలజీ విభాగంలో సమగ్ర తెగుళ్ల యజమాన్యం, జీవనియంత్రకాలు, వివిధ పంటలను ఆశించిన తెగుళ్ల నమూనాలు, మృత్తికాశాస్త్ర విభాగంలో వివిధ పంటల్లో పోషకాల లోపాలు, వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువులు, మైక్రోబయాలజీ విభాగంలో జీవన ఇంధనాలు, విత్తన సాంకేతికత విభాగంలో విత్తనాలను నిలువ చేసే సంచులు, విత్తన నాణ్యతను మెరుగుపరిచే పద్ధతులు, ఇతర మొలక పరీక్ష పద్ధతులు, విత్తన ప్రాసెసింగ్, వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగంలో పంటలలో వాడదగిన యంత్ర పరికరాలు, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ వారి చిరుధాన్యాల ప్రాసెసింగ్ మరియు ఇంక్యుబేషన్ సెంటర్, ఉద్యాన విభాగంలో పెరటి తోటల పెంపకం, హైడ్రోఫోనిక్స్, మిద్దె తోటల పెంపకం, వ్యవసాయ అనుభవ అభ్యాస కార్యక్రమంలో పుట్టగొడుగుల పెంపకం, జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం మరియు భూసార పరీక్ష కేంద్రం పైన ఏర్పాటుచేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# మానవ రహిత వ్యవసాయ సాధనలో జయశంకర్ వర్సిటీ తొలి అడుగు...





ఎస్‌బిఐ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన తొలిదశ అగ్రి రోబోటిక్స్ ప్రయోగశాలని ఎస్‌బిఐ చైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి మరియు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యతో కలిసి డిసెంబర్ 19న ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ, భారతదేశంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో మొట్ట మొదటిసారిగా ఇటువంటి అధునాతన అగ్రి రోబోటిక్స్ ప్రయోగశాలని పిజెటిఏయులోనే స్థాపించారని, ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థిగా తన వంతు తోడ్పాటుగా విశ్వవిద్యాలయంలో ఇటువంటి అధునాతన ప్రయోగశాలని ప్రారంభించడం సంతోషకరమని, భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఈ ప్రయోగశాల చాలా తోడ్పాటు అందిస్తుందని భావించి ఎస్‌బిఐ ఫౌండేషన్ ద్వారా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న అగ్రి హబ్‌కి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగం వైపు యువతని ఆకర్షించడానికి కృత్రిమ మేధస్సుతో కూడిన డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానం చాలా తోడ్పాటు అవుతుందని, ఒక ఏడాదిలోనే ఈ ప్రయోగశాల ప్రతిపాదన కార్యరూపం దాల్చి మొదటి దశ అధునాతన ల్యాబ్‌ని ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది, ఎస్‌బిఐ ఫౌండేషన్ ప్రతినిధుల్ని ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, 2047 నాటికి వికసిత్ భారత్, 2047 తెలంగాణ రైజింగ్ లక్ష్యసాధనలో వ్యవసాయ, గ్రామీణ రంగాలు కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం పైననే భవిష్యత్తు వ్యవసాయ రంగం ఆధారపడి ఉందని, ఆ దిశగా మానవరహిత వ్యవసాయ సాధనలో భాగంగా నేడు ఎస్‌బిఐ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో అగ్రి రోబోటిక్స్ ల్యాబ్‌ని ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. 2030–35 నాటికి తెలంగాణ రాష్ట్రంలోని రైతుల పొలాల్లో రోబోలు, డ్రోన్లు, మానవ రహిత ట్రాక్టర్లు మరియు సెన్సార్ల వినియోగం విస్తృతం కానున్నాయని, ఈ లక్ష్య సాధనకు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, అగ్రిహబ్ ఎమ్‌డి డా॥ జి. వెంకటేశ్వర్లు, అరిసా ల్యాబ్ ప్రాజెక్ట్ హెడ్ డా॥ జెల్లా సత్యనారాయణ, ఎస్‌బిఐ సీనియర్ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






# వ్యవసాయ పదవినోదం

**కూర్పు : డా॥ ఆర్. సునిత దేవి**



**అడ్డం:**

2. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి అనుకూలమైన సంచులు ఏవి? (6)
3. మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులో ఎన్ని కిలోల గంధకం లభిస్తుంది? (5)
4. మిరపలో ఏ పురుగు ఆశించడం వలన ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారి క్రిందకు ముడుచుకుంటాయి? (4)
7. పురుగుమందులు కొనేటప్పుడు రైతులు డబ్బా పైన చూసుకోవలసిన ముఖ్య అంశం ఏది? (5)
9. అలహాబాద్ సఫెద ఏ పంట రకం? (2)
11. ప్రకృతి వ్యవసాయంలో ఏ పురుగు నివారణకు బంతి పంటను పొలంలో అక్కడక్కడ వేయాలి? (6)
12. ప్రధాన పంట కన్నా పురుగులు ఎక్కువగా ఆకర్షించే పంటను ఏమంటారు? (4)
13. చెఱకు ప్రారంభ దశలో వచ్చే కాండం తొలుచు పురుగును ఏమంటారు? (5)

**నిలువు:**

1. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు మబ్బులతో కూడిన వర్షపు జల్లులు లేదా మంచు కురవడం వలన ఏ తెగులు ఆశిస్తుంది? (7)
2. ఏ పంట తోటలో ఇలడోబియస్ కామెరూనికస్ అనబడే కీటకాన్ని విడుదల చేయడం వలన ఫలదీకరణ పూర్తిగా జరుగుటకు సహాయపడుతుంది? (4)
5. ఈ మధ్యకాలంలో మనదేశానికి వలస వచ్చి మిరపలో అధిక నష్టం కలుగజేస్తున్న పురుగు ఏది? (8)
6. కోతుల నుండి పంటను రక్షించే పరికరం ఏది? (5) (క్రింది నుండి పైకి)
8. తీగజాతి కూరగాయలను ఆశించి నష్టం కలుగజేస్తుంది. ఈ పురుగు నివారణకు మలాథియాన్, బెల్లం మరియు నీటిని కలిపి విషపు ఎరను తయారీ చేసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఏ పురుగుకు? (4) (క్రింద నుండి పైకి)
10. కత్తెర పురుగు, పొగాకు లద్దె పురుగు ఎదిగిన లార్వాలను నివారించుటకు ఏమి తయారు చేసి సాయంత్రం వేళల్లో వెదజల్లాలి? (5)

**సమాధానాలు 50వ పేజీలో**

# మిరపను ఆశించే పురుగులు – నివారణ మరియు వాటి నియంత్రణలో వాడే పురుగుమందుల సురక్షిత కాలం

డా॥ కె. వాణిశ్రీ, డా॥ జి. శ్రీదేవి, డా॥ యస్. ఉపేందర్, డా॥ యం. రాజశేఖర్, డా॥ యం. అరుణ, డా॥ బి. అపర్ణ, డా॥ సి. స్వాతి మరియు డా॥ డి. రాకేష్

సస్యరక్షణ మందుల అవశేషాల విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్



మిరప భారతదేశంలోని ముఖ్యమైన వాణిజ్య పంటల్లో ఒకటి. ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తారంగా పండించబడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 1.54 లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇది ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల్, భూపాలపల్లి మరియు కొత్తగూడెం జిల్లాల్లో విస్తారంగా సాగు చేయబడుతుంది. ప్రస్తుత వాతావరణంలోని విపరీతమైన మార్పుల దృష్ట్యా ఈ పంటను తొలిదశ నుండి మలిదశ వరకు వివిధ రకాలైన చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టపరచడం వలన దిగుబడి, పండ్ల నాణ్యత మరియు మార్కెట్ ధర తగ్గడం జరుగుతుంది. వీటి నివారణకు రైతులు విస్తృతంగా కీటకనాశక మందులను వాడుతున్నారు. కానీ ఈ మందులు వాడేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోతే పురుగుమందు అవశేషాలు పంటలో ఉండి మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని చేసే ప్రమాదం కలదు. అయితే పంట కోతకు ముందు సురక్షిత కాలం పాటించడం అత్యంత అవసరం. ఈ సురక్షిత కాలం పాటించడం వలన మిరపలో పురుగుమందుల అవశేషాలు తగ్గి వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలగకుండా నిరోధిస్తుంది.

**రసంపీల్చు పురుగులు:**

1. **తామర పురుగులు:** తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన గుంపులుగా చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు మెలితిరిగి అంచుల వెంబడి పైకి ముడుచుకుపోతాయి. అందువల్ల దీనిని పై ముడత అంటారు. దీనివలన మొక్కలు గిడసబారి పూత రాలుతుంది. లేతకాయలు గిడసబారి చారలు ఏర్పడి కాయల నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
2. **తెల్లనల్లి:** తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన గుంపులుగా గూడు కట్టుకుని రసాన్ని పీలుస్తాయి. ఈ పురుగు ఆశించిన ఆకులు కింది వైపుకు ముడుచుకొనిపోయి తిరగబడిన పడవ ఆకారంలో ఉంటాయి. ఈ పురుగులు ఆశించడం వల్ల కాయతోలు గట్టిపడి తెల్లని చారలు ఏర్పడతాయి. నివారణకు ప్రోపార్గైట్ 2.5 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా ఫెనాజాక్వ్యాఇన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
3. **పేనుబంక:** పేనుబంక లేత కొమ్మల ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు ఎండి మొక్కల పెరుగుదల తగ్గుతుంది. ఈ పురుగులు విసర్జించే తీయని పదార్థం వల్ల చీమలు చేరతాయి. ఈ పురుగులు ఆశించిన ఆకులు మెలికలు తిరిగి మొక్క ఎదుగుదల తగ్గి, దిగుబడి తగ్గుతుంది. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
4. **తెల్లదోమ:** తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల నుండి రసం పీల్చడం వలన మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. వీటి నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా డైనోటెఫ్యూరాన్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### కాయ తొలుచు పురుగులు:

1. **శనగ పచ్చ పురుగు:** శనగ పచ్చ పురుగు కాయలకు రంధ్రం చేసి లోపలకు తలను ఉంచి మిగతా శరీరాన్ని బయటే ఉంచి గింజలను తింటుంది. ఇవి చేసిన రంధ్రాలు గుండ్రంగా ఉంటాయి. నివారణకు స్పైనోటోరం 0.5 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

2. **పొగాకు లద్దె పురుగు:** ఈ లద్దె పురుగులు ఆకులపై వంకర టింకర రంధ్రాలు చేసి తింటాయి. కాయలను కూడా ఆశించి రంధ్రాలు చేసి గింజలను తింటాయి. నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

3. **పూత పురుగు (మిడ్జ్ ఈగ):** ఈ పురుగు సోకిన ఎడల పూత ఎండి కాయలు రాలిపోతాయి. కాయలు గిడసబారి పరిమాణం మారిపోయి వంకరలు తిరిగి ఉండటం వల్ల నాణ్యత తగ్గి ధర పలకదు. దీని నివారణకు పూతదశలో 5% వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### మిరప పంటలో పురుగుమందుల సురక్షిత కాలాలు:

| | పురుగులు | పురుగుమందు | సురక్షిత కాలం |
|---|---|---|---|
| 1. | తామర పురుగులు | స్పైనోశాడ్ | 5 రోజులు |
| 2. | తామర పురుగులు | ఫిప్రోనిల్ | 7 రోజులు |
| 3. | తెల్ల నల్లి | ప్రొపార్గైట్ | 12 రోజులు |
| 4. | తెల్ల నల్లి | స్పైరోమెసిఫెన్ | 10 రోజులు |
| 5. | తెల్ల నల్లి | గంధకం | 5-7 రోజులు |
| 6. | తెల్ల నల్లి | ఫెనాజాక్వుఇన్ | 10-12 రోజులు |
| 7. | పేనుబంక | ఇమిడాక్లోప్రిడ్ | 7 రోజులు |
| 8. | పేనుబంక | థయోమిథాక్సామ్ | 7 రోజులు |
| 9. | తెల్లదోమ | ఎసిటామిప్రిడ్ | 7-10 రోజులు |
| 10. | తెల్లదోమ | డైనోటెఫ్యూరాన్ | 10-14 రోజులు |
| 11. | శనగ పచ్చ పురుగు | స్పైనటోరం | 7 రోజులు |
| 12. | శనగ పచ్చ పురుగు | ఇమామెక్టిన్ బెంజోయేట్ | 7-10 రోజులు |
| 13. | శనగ పచ్చ పురుగు | సైపర్‌మెత్రిన్ | 10 రోజులు |
| 14. | పొగాకు లద్దె పురుగు | క్లోరాంట్రానిలిప్రోల్ | 10 రోజులు |
| 15. | పొగాకు లద్దె పురుగు | ఇండాక్సాకార్బ్ | 10 రోజులు |
| 16. | పూత పురుగు | వేపగింజల కషాయం/వేపనూనె | 3-5 రోజులు |

### ముఖ్య సూచనలు:

- ప్రతి మందుకు సిఫారసు చేసిన మోతాదు పిచికారి పద్ధతి మరియు సురక్షిత పంటకోత కాలం పాటించాలి.
- చివరి పిచికారి చేసిన తర్వాత పంట కోయడానికి కనీసం సురక్షిత కాలం గడవాలి.
- పంటపై అధిక మోతాదులో మందులు వాడకూడదు.
- జీవ శిలీంధ్రాలైన బాసిల్లస్ తురింజెన్సిస్, బవేరియా, వేపనూనె మొదలగునవి వాడటం ద్వారా సురక్షితమైన పద్ధతిలో సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చును.

మిరప పంటలో కీటకాల నియంత్రణలో సురక్షిత కాలం పాటించడం అనేది రైతుల బాధ్యత మాత్రమే కాకుండా వినియోగదారుల ఆరోగ్య రక్షణకు కూడా ఎంతో ముఖ్యమైనది. సిఫారసు చేసిన మోతాదులో పురుగుమందులను వాడుతూ, పంటకోతకు ముందు నిర్దిష్ట కాలం గడపటం ద్వారా సురక్షితమైన, నాణ్యమైన మిరప ఉత్పత్తి సాధించవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9494407924

# భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు - వాడే విధానం లాభాలు

కె. మానస, బి. మాధవి, డా॥ జె. భార్గవి, డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ జి. శేషు, డా॥ డి. వీరన్న, డా॥ వై. హరి, బి. సౌందర్య మరియు డా॥ సిహెచ్. రాములు

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్



పంట సాగులో ఎరువుల యాజమాన్యం చాలా కీలకమైన అంశం. అందులో భాస్వరం ఎరువుల వాడకం అత్యంత కీలకమైనదిగా పేర్కొనవచ్చు. పంటలకు అందించే భాస్వరపు ఎరువుల్లో 20-25 శాతం మాత్రమే అప్పటికప్పుడు వినియోగ పడుతుంది. మిగతా 75-80 శాతం భూమిలో ఉదజని సూచికని బట్టి వివిధ రకాలైన లభ్యంకాని భాస్వరం రూపంలోకి మారుతుంది. భూమిలో ఆమ్ల గుణం ఉన్నచో ఇనుము లేదా అల్యూమినియం ఫాస్ఫేట్‌గా మారును. మరియు భూమిలో క్షార గుణం ఉన్నచో కాల్షియం లేదా మెగ్నీషియం ఫాస్ఫేట్లుగా మారి మొక్కకు లభ్యంగాని స్థితిలో భూమిలో గడ్డలుగా పేరుకుపోతుంది.

నేలసారం మీద అవగాహన లేకపోవడం వల్ల రైతులు మోతాదులకు మించి భాస్వరం ఎరువులను ఉపయోగించడం వల్ల పోషకాల మధ్య సమతుల్యత దెబ్బతినడం, పోషక లోపాలు తలెత్తుతాయి. కావున భాస్వరం కరిగించే జీవనఎరువులు (సూడోమోనాస్, బాసిల్లస్) వాడకంపై అవగాహన కలిగి, వినియోగించడం ఎంతైనా అవసరం. భాస్వరంను కరిగించే జీవన ఎరువులు పంటలలో వాడటం వల్ల మొక్కకు లభ్యంకాకుండా గడ్డ లాగా పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందే విధంగా చేస్తుంది.

ఈ జీవన ఎరువును అన్ని రకాల పంటలలో నత్రజని బ్యాక్టీరియాతోపాటు వాడుకోవచ్చు. ఈ జీవన ఎరువు వాడటం వల్ల ఒక బస్తా డి.ఎ.పి (హెక్టారుకు) తగ్గించి ఏ మాత్రం తక్కువ కాకుండా దిగుబడులను పొందవచ్చు. భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులను అన్ని పంటలలో వాడవచ్చు. ఈ జీవన ఎరువు సమర్థవంతంగా పని చేసి మంచి ఫలితాలను ఇవ్వాలంటే సేంద్రియ కర్బనం అత్యవసరం. కావున ఈ జీవన ఎరువుతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువును వాడవలెను. భూమిలో తేమ ఉండేలా చూసుకోవాలి.

ఇవి భాస్వరాన్ని కరిగించడానికి వివిధ రకాలైన ఎంజైములను ఆమ్లాలను ఉత్పత్తి చేస్తాయి. అంతేకాకుండా వివిధ రకాలైన హార్మోన్లను మరియు యాంటీ బయోటిక్స్ ఉత్పత్తి చేయడం వలన వేరుకుళ్ళు మరియు ఎండుతెగులు మొక్కలకు రాకుండా మొక్క యొక్క రోగనిరోధక శక్తిని కూడా పెంపొందిస్తుంది.

ఈ జీవన ఎరువును వాడటం వల్ల 25 కిలోల భాస్వరం ప్రతి హెక్టారుకు అందించవచ్చు. అంతేకాక దీనిని వాడటం వల్ల పంట నాణ్యత మరియు దిగుబడి కూడా పెరుగుతుంది.

భాస్వరంను కరిగించే జీవన ఎరువులను వాడే విధానం:

1. **విత్తనానికి పట్టించే పద్ధతి**
2. **భూమిలో వేసే పద్ధతి**

1. **విత్తనానికి పట్టించే పద్ధతి:** ఒక కిలో విత్తనానికి 15-20 గ్రా. జీవన ఎరువును సమాన మోతాదులో 10% చక్కెర లేదా బెల్లం ద్రావణానికి కలిపి విత్తనం చుట్టూ సమానంగా పట్టేటట్లు కలపాలి. తరువాత 30 నిమిషాలు నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.
2. **భూమిలో వేసే పద్ధతి:** రెండు కిలోల జీవన ఎరువును దాదాపు 200 కిలోల పశువుల ఎరువుతోగాని, వానపాముల ఎరువుతో లేదా ఇతర సేంద్రియ ఎరువుతో గాని కలిపి విత్తనంను నాటే సాళ్ళలో పడేటట్లు చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోను పంట పొలంలో చేపట్టే మొదట అంతరకృషి చేయుటకు ముందుగా జీవన ఎరువులు వాడటం ముగించాలి.

వరిలో నాటు వేసిన తర్వాత 3-7 రోజుల వ్యవధిలో సేంద్రియ ఎరువుతో కలిపి వెదజల్లాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7569022841

# జీవక్రిమిసంహారకాల నాణ్యత ప్రమాణాలు - రైతులు తెలుసుకోవలసిన అంశాలు



డా॥ నేనవత్ బలరాం, డా॥ వి. భారతి, డా॥ మహేశ్వరమ్మ,
డా॥ కె. సుకుమార్, డా॥ కె. ప్రభావతి, డా॥ కె. అనురాధ మరియు
డా॥ సి.హెచ్. దామోదర రాజు

విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రము,
రాజేంద్రనగర్, హైదరాబాద్

జీవ క్రిమిసంహారకాలు (బయోపెస్టిసైడ్స్) అనేవి మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులు (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లు) మరియు కొన్ని రకాల సహజ ఖనిజ వనరుల నుండి తీసుకోబడిన ఉత్పత్తులు. ఇవి ప్రధానంగా మూడు రకాలుగా ఉంటాయి:

**1. సూక్ష్మ జీవ క్రిమిసంహారకాలు:** వీటిని ఉపయోగకరమైన సూక్ష్మజీవుల నుండి తయారు చేస్తారు. ఉదాహరణలు: ట్రైకోడెర్మా, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ మరియు బవేరియా బాసియానా.

**2. జీవ రసాయన క్రిమిసంహారకాలు:** ఇవి సహజంగా లభించే పదార్థాలు, ఇవి విషపూరితం కాకుండా, కీటకాల సంభోగానికి ఆటంకం కలిగించడం, వాటి ఎదుగుదలను నియంత్రించడం వంటి పద్ధతుల ద్వారా పురుగులు/తెగుళ్ళను అదుపు చేస్తాయి. ఉదాహరణ: వేప నూనె మరియు లింగ సంపర్క ఫెరోమోన్లు.

**3. అంతర్నిర్మిత రక్షణ:** కొన్ని మొక్కల జన్యువులలో మార్పులు చేసి, వాటిలో అంతర్గతంగానే చీడపీడలను నాశనం చేసే గుణాన్ని కల్పించడాన్ని అంతర్నిర్మిత రక్షణ అంటారు. ఉదాహరణ: బిటి పత్తి.

**భారతదేశంలో జీవ క్రిమిసంహారకాల వాడకం పెరగడానికి ముఖ్య కారణాలు**

1. **నేల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ:** రసాయన అవశేషాల తగ్గింపు: రసాయన పురుగుమందుల వాడకం వల్ల పంటలలో, నేలలో మరియు నీటిలో విషపూరితమైన అవశేషాలు మిగిలిపోతాయి. జీవక్రిమిసంహారకాలు త్వరగా విచ్ఛిన్నం అవుతాయి, కాబట్టి రసాయన కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది.

**నేల జీవ వైవిధ్య రక్షణ:** రసాయనాలు నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులను, వానపాములను నాశనం చేస్తాయి. అంతేకాకుండా ఈ నేల జీవవైవిధ్యాన్ని కాపాడటంతోపాటు నేల ఆరోగ్యాన్ని మరియు సారవంతాన్ని పెంచుతుంది.

2. **రైతు మరియు వినియోగదారుల ఆరోగ్యం:** సురక్షితమైన వ్యవసాయం: రసాయన క్రిమిసంహారకాలు పిచికారీ చేసేటప్పుడు రైతులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. జీవ క్రిమి సంహారకాలు తక్కువ విషపూరితం, కాబట్టి రైతులకు సురక్షితమైన వాతావరణం లభిస్తుంది.

**విషరహిత ఆహారం:** వినియోగదారులు ఆరోగ్య స్పృహతో ఉండటం వలన, రసాయన అవశేషాలు లేని సేంద్రీయ మరియు సురక్షితమైన ఆహారాన్ని కోరుకుంటున్నారు. జీవ క్రిమి సంహారకాలు ఈ డిమాండ్‌ను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

3. **తెగుళ్లలో నిరోధకత నివారణ:** ఒకే రసాయన పురుగు/తెగుళ్ళ మందును మళ్ళీ మళ్ళీ వాడటం వలన, కీటకాలు/ శిలీంధ్రాలు ఆ రసాయనాలకు నిరోధక శక్తిని పెంచుకుంటాయి, దీంతో అవి మరింత ప్రమాదకరంగా మారుతాయి. జీవ క్రిమిసంహారకాలను సమీకృత చీడపీడల నిర్వహణలో భాగస్వామ్యం చేయడం ద్వారా, పురుగు/తెగుళ్ళ నిరోధకతను సమర్థవంతంగా నియంత్రించవచ్చు.

4. **ఆర్థిక ప్రయోజనం మరియు ఎగుమతి అవకాశం:**

**ఉత్తమ ధర:** సేంద్రీయంగా పండించిన లేదా తక్కువ రసాయన అవశేషాలు ఉన్న ఉత్పత్తులకు దేశీయంగా మరియు అంతర్జాతీయ మార్కెట్లలో ఎక్కువ ధర లభిస్తుంది. జీవ క్రిమిసంహారకాల వాడకం భారతీయ రైతులకు అదనపు ఆదాయాన్ని ఇస్తుంది.

**ఎగుమతి ప్రమాణాలు:** చాలా దేశాలు దిగుమతి చేసుకునే ఆహార ఉత్పత్తులపై రసాయన అవశేషాల పరిమితులను కఠినతరం చేశాయి. ఈ ప్రమాణాలను అందుకోవడానికి జీవ క్రిమిసంహారకాలు తప్పనిసరి.

జీవనియంత్రణ కారకాలైన ట్రైకోడెర్మా, సూడోమోనాస్ మరియు బవేరియా వేరు వేరు సూక్ష్మజీవుల నుండి తయారవుతాయి, కాబట్టి వాటి నాణ్యతను పరీక్షించే పద్ధతులు మరియు ప్రమాణాలు కూడా భిన్నంగా ఉంటాయి. ఈ జీవ క్రిమిసంహారకాలు నాణ్యతను సాధారణంగా భారతదేశంలో కేంద్ర పురుగుమందుల బోర్డు మరియు రిజిస్ట్రేషన్ కమిటీ (సిఐబి & ఆర్‌సి) మార్గదర్శకాల ప్రకారం నిర్ణయిస్తారు. ట్రైకోడెర్మా, సూడోమోనాస్ మరియు బవేరియా వంటి జీవ క్రిమిసంహారకాలు యొక్క నాణ్యత ప్రమాణాలు కింద ఇవ్వబడినవి.

## ట్రైకోడెర్మా నాణ్యత ప్రమాణాలు

| క్ర.సం. | ప్రమాణము | వివరణ |
|---|---|---|
| 1. | సాంద్రత | ఉత్పత్తిలో ఉన్న ట్రైకోడెర్మా శిలీంద్ర బీజాంశాల సంఖ్య. జీవ నియంత్రణ సమర్థతకు ఇది అత్యంత ముఖ్యమైన ప్రమాణం. దీనిని కాలనీ ఫార్మింగ్ యూనిట్స్ పర్ గ్రామ్ (సిఎఫ్‌యు/గ్రా.) లేదా పర్ మిల్లీలీటర్ (సిఎఫ్‌యు/మి.లీ.) లో కొలుస్తారు. ఇది $2\times10^{6}$ సిఎఫ్‌యు/మి.లీ./గ్రా. కన్నా తక్కువ ఉండకూడదు. |
| 2. | శుద్ధత | ఉత్పత్తిలో ట్రైకోడెర్మా మినహా ఇతర హానికరమైన లేదా కలుషితమైన సూక్ష్మజీవులు ఉండకూడదు. ఇతర సూక్ష్మజీవులు $1\times10^{4}$ సిఎఫ్‌యు/ మి.లీ./గ్రా. మించి ఉండకూడదు. |
| 3. | తేమ శాతం | పొడి రూపంలో ఉన్న ట్రైకోడెర్మాలో తేమ శాతం తక్కువగా ఉండాలి. అధిక తేమ దాని నిల్వ కాలం మరియు నాణ్యతను తగ్గిస్తుంది. తేమ 8% మించరాదు. |
| 4. | ఉదజని సూచిక పరిధి | ట్రైకోడెర్మా పెరుగుదలకు మరియు క్రియాశీలతకు అనుకూలమైన పీహెచ్ (సాధారణంగా 6 నుండి 8 మధ్య) పరిధిలో ఉండాలి లేదా నేలలో వేసినపుడు సమర్థవంతంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. |
| 5. | సమర్థత | ట్రైకోడెర్మా తెగుళ్ళను నియంత్రించగల లేదా మొక్కల పెరుగుదలను పెంచగల శక్తి. ఇది ప్రయోగశాల లేదా క్షేత్ర పరీక్షల ద్వారా ధృవీకరించబడింది. సాధారణముగా ఇది 50% కన్నా తక్కువ ఉండకూడదు. |
| 6. | నిల్వ కాలం | ఉత్పత్తి దాని నాణ్యతను మరియు నిర్దేశించిన సాంద్రతను కోల్పోకుండా నిల్వ చేయగలిగే సమయం. సాధారణముగా ఇది 6 నెలలు ఉంటుంది. |

## సుడోమోనాస్ నాణ్యత ప్రమాణాలు

| క్ర.సం. | ప్రమాణము | వివరణ |
|---|---|---|
| 1. | సాంద్రత | ఉత్పత్తిలో ఉన్న సూడోమోనాస్ బ్యాక్టీరియా కణాల సంఖ్య. జీవ నియంత్రణ సామర్థ్యానికి ఇది ప్రాథమిక ప్రమాణం. దీనిని కాలనీ ఫార్మింగ్ యూనిట్స్ పర్ మిల్లీలీటర్ (సిఎఫ్‌యు/మి.లీ.) లేదా పర్ గ్రామ్ (సిఎఫ్‌యు/గ్రా.) లో కొలుస్తారు. ఇది $1\times10^{8}$ సిఎఫ్‌యు/ మి.లీ./గ్రా. కన్నా తక్కువ ఉండకూడదు. |
| 2. | శుద్ధత | ఉత్పత్తిలో సూడోమోనాస్ మినహా ఇతర హానికరమైన సూక్ష్మజీవులు, రసాయన మరియు జీవ రసాయనాలు ఉండకూడదు. ఇతర సూక్ష్మజీవులు $1\times10^{4}$ సిఎఫ్‌యు/మి.లీ./గ్రా. మించి ఉండకూడదు. |
| 3. | వాయువు ఉదజని సూచిక పరిధి | సూడోమోనాస్ పెరుగుదలకు మరియు క్రియాశీలతకు అనుకూలమైన పీహెచ్, (సాధారణంగా 6 నుండి 8) మధ్య ఉన్నప్పుడు మెరుగ్గా పనిచేస్తుంది. |
| 4. | సమర్థత | సూడోమోనాస్ ఉత్పత్తి చేసే యాంటీబయోటిక్స్ లేదా ఇతర రక్షణ సమ్మేళనాల ద్వారా తెగుళ్ళను నియంత్రించగలగడం దాని సామర్థ్యం. ఇది ప్రయోగశాల పరీక్షల ద్వారా ధృవీకరించబడుతుంది. |
| 5. | నిల్వ కాలం | నిర్దేశించిన నిల్వ పరిస్థితులలో (ఉష్ణోగ్రత-$30^{0}$ సెం.గ్రే. మరియు తేమ-65%) ఉత్పత్తి దాని సాంద్రతను మరియు క్రియాశీలతను కోల్పోకుండా ఉండగలిగే సమయం. సాధారణంగా ఇది 6 నెలలు ఉంటుంది. |
| 6. | ప్యాకేజింగ్ మరియు లేబులింగ్ | ఉత్పత్తికి సంబంధించిన పూర్తి వివరాలు (తయారీ తేదీ, గడువు తేదీ, నిల్వ సూచనలు, వాడే విధానం, సాంద్రత) స్పష్టంగా మరియు సరిగ్గా లేబుల్ చేయబడి ఉండాలి. |

### బవేరియా బాసియానా నాణ్యత ప్రమాణాలు

| క్ర.సం. | ప్రమాణము | వివరణ |
|---|---|---|
| 1. | సాంద్రత | ఉత్పత్తిలో ఉన్న బవేరియా బాసియానా కణాల సంఖ్య. జీవ నియంత్రణ సామర్థ్యానికి ఇది ప్రాథమిక ప్రమాణం. దీనిని కాలనీ ఫార్మింగ్ యూనిట్స్ పర్ మిల్లీలీటర్ (సిఎఫ్‌యు/మి.లీ.) లేదా పర్ గ్రామ్ (సిఎఫ్‌యు/గ్రా.) లో కొలుస్తారు. ఇది $1\times10^{8}$ సిఎఫ్‌యు/ మి.లీ./గ్రా. కన్నా తక్కువ ఉండకూడదు. |
| 2. | శుద్ధత | ఉత్పత్తిలో సూడోమోనాస్ మినహా ఇతర హానికరమైన సూక్ష్మజీవులు, రసాయన మరియు జీవ రసాయనాలు ఉండకూడదు. ఇతర సూక్ష్మజీవులు $1\times10^{4}$ సిఎఫ్‌యు/మి.లీ./గ్రా. మించి ఉండకూడదు. |
| 3. | వాయువు ఉదజని సూచిక పరిధి | సూడోమోనాస్ పెరుగుదలకు మరియు క్రియాశీలతకు అనుకూలమైన పీహెచ్, (సాధారణంగా 6 నుండి 8) మధ్య ఉన్నప్పుడు మెరుగ్గా పనిచేస్తుంది. |
| 4. | సమర్థత | సూడోమోనాస్ ఉత్పత్తి చేసే యాంటీబయోటిక్స్ లేదా ఇతర రక్షణ సమ్మేళనాల ద్వారా తెగుళ్ళను నియంత్రించగలగడం దాని సామర్థ్యం. ఇది ప్రయోగశాల పరీక్షల ద్వారా ధృవీకరించబడుతుంది. |
| 5. | నిల్వ కాలం | నిర్దేశించిన నిల్వ పరిస్థితులలో (ఉష్ణోగ్రత-$30^{0}$ సెం.గ్రే. మరియు తేమ-65%) ఉత్పత్తి దాని సాంద్రతను మరియు క్రియాశీలతను కోల్పోకుండా ఉండగలిగే సమయం. సాధారణంగా ఇది 6 నెలలు ఉంటుంది. |
| 6. | ప్యాకేజింగ్ మరియు లేబులింగ్ | ఉత్పత్తికి సంబంధించిన పూర్తి వివరాలు (తయారీ తేదీ, గడువు తేదీ, నిల్వ సూచనలు, వాడే విధానం, సాంద్రత) స్పష్టంగా మరియు సరిగ్గా లేబుల్ చేయబడి ఉండాలి. |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9821492644**

**జనవరి, 2026లో పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 07.01.2026 | ప్రత్తి పంట తరువాత నువ్వుల పంట సాగు |
| | సహజ వ్యవసాయం - లాభాలు, ప్రయోజనాలు |
| 14.01.2026 | జీవన ఎరువులు |
| | చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఆహారాలు |
| 21.01.2026 | చిరుధాన్యాల సాగు |
| | జాతీయ బాలిక దినోత్సవం |
| 28.01.2026 | తేనెటీగల పెంపకం |
| | మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు |

# సమగ్ర వ్యవసాయం – స్థిర ఆదాయానికి సోపానం


బి. మంజు భార్గవి, జి. రాకేష్, డా॥ ఏ. కృష్ణ చైతన్య,
డా॥ వై.ఎస్. పరమేశ్వరి, ఎం. సాయి చరణ్,
డా॥ రమ్యా రాథోడ్, డా॥ రమేష్ మరియు
డా॥ కె. పవన్ చంద్రా రెడ్డి

ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్





వ్యవసాయ జనగణన 2021-22 ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో సన్నకారు రైతుల శాతం 68.7%, చిన్న రైతుల శాతం 22.7% గా ఉంది. అంతేకాక, రాష్ట్రంలో రైతుల సగటు భూపరిమాణం కేవలం 0.89 హెక్టార్లు మాత్రమే. ఈ గణాంకాలు తెలంగాణలో వ్యవసాయం ప్రధానంగా చిన్న మరియు సన్నకారు రైతులపై ఆధారపడినదని స్పష్టంగా సూచిస్తున్నాయి. ఇలాంటి పరిమిత పరిస్థితుల్లో, వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు నేటి వ్యవసాయాన్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నాయి. అతివృష్టి మరియు అనావృష్టి వంటి పరిస్థితులు పంటల ఉత్పత్తిని తీవ్రంగా ప్రభావితం చేయడంతో రైతులు స్థిరమైన ఆదాయం పొందడం కష్టమవుతోంది. అంతేకాక, పంటలు సరిగా పండినప్పటికీ మార్కెట్లో సరైన ధరలు లభించక రైతులు నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇటువంటి సవాళ్ల నేపథ్యంలో ఒకే పంటపై ఆధారపడే వ్యవసాయం తీవ్రమైన అనిశ్చితిని కలిగిస్తూ వ్యవసాయాన్ని మరింత అస్థిరంగా మారుస్తోంది. ఈ పరిస్థితుల్లో పంటలు, పశుసంవర్ధక, చేపల పెంపకం, ఉద్యానవనం వంటి అనేక వ్యవసాయ కార్యకలాపాలను పరస్పరం అనుసంధానం చేసే సమగ్ర వ్యవసాయం రైతులకు భద్రత, స్థిర ఆదాయం మరియు వనరుల సమర్థ వినియోగాన్ని అందించే ఆశాజనక పరిష్కారంగా నిలుస్తోంది.

### సమగ్ర వ్యవసాయం:

"సమగ్ర వ్యవసాయం అనగా పంటల ఆధారంపై నడిచే అనుసంధానిత వ్యవస్థలు. ఇందులో ఒక భాగం నుంచి వచ్చే వ్యర్థాలు మరో భాగానికి వనరులుగా మారి ఉత్పత్తి ఖర్చు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగవుతుంది."

సమగ్ర వ్యవసాయ వ్యవస్థ అనేది స్థిరమైన వ్యవసాయ విధానం. ఇందులో రెండు లేదా రెండు కన్నా ఎక్కువ వ్యవసాయ కార్యకలాపాలను పరస్పరం అనుసంధానం చేసి నిర్వహిస్తారు. దీనివల్ల వనరులను గరిష్ఠంగా వినియోగించుకోవడం, పంట విఫలమయ్యే ప్రమాదాన్ని తగ్గించడం, కుటుంబానికి అదనపు ఆదాయంతో పాటు ఆహార భద్రత లభిస్తుంది. సమగ్ర వ్యవసాయ వ్యవస్థలో ఒక విభాగం నుంచి వచ్చే ఉప-ఉత్పత్తులు మరో విభాగానికి ఇన్‌పుట్‌లుగా పనిచేస్తాయి. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యం అవుతుంది.

రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగంతో వచ్చిన పర్యావరణ సమస్యలకు పరిష్కారంగా సమగ్ర వ్యవసాయం మంచి మార్గం. పంటలు, పశుసంవర్ధక, చేపల పెంపకం, అటవీ వంటి విభాగాల సమ్మిళిత వ్యవస్థ రైతులకు ఆదాయం, ఉపాధిని పెంచుతుంది.

### లక్ష్యాలు:

- అన్ని విభాగాల ద్వారా స్థిరమైన ఆదాయం
- పర్యావరణ సమతుల్యత
- పురుగు, వ్యాధి, కలుపు సమస్యల తగ్గింపు
- రసాయనాల వినియోగం తగ్గించటం
- వనరుల వినియోగం సామర్థ్యం పెంచడం
- పంటలు + పశువులు + కోళ్లు + తేనెటీగలు + ఉద్యానవనం వంటి విభాగాల అనుసంధానం

### సమగ్ర వ్యవసాయం యొక్క ప్రయోజనాలు:

**లాభదాయకత:** ఒక విభాగం నుంచి వచ్చే వ్యర్థాలను తక్కువ ఖర్చుతో మరో విభాగంలో వినియోగించడం ద్వారా ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది.

**స్థిరత్వం:** సమగ్ర వ్యవసాయంలో పరస్పరం అనుసంధానించిన విభాగాల ఉప-ఉత్పత్తులను సేంద్రీయంగా వినియోగించడం వల్ల ఉత్పత్తి సామర్థ్యం చాలా కాలం పాటు నిలకడగా కొనసాగుతుంది.

**సమతుల ఆహారం:** వివిధ రకాల వ్యవసాయ విభాగాలను అనుసంధానం చేయడం ద్వారా పాలు, గుడ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి భిన్నమైన పోషకాహార వనరులు ఉత్పత్తి చేయవచ్చు.

**పర్యావరణ రక్షణ:** సమగ్ర వ్యవసాయంలో వ్యర్థాలను సరైన భాగాలతో అనుసంధానం చేసి రీసైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గి, వ్యవసాయ ప్రకృతి సమతుల్యత కాపాడబడుతుంది.

**సంవత్సరం పొడవునా ఆదాయం:** పంటలు, పశువులు, గుడ్లు, పాలు, మొదలగు వంటి విభాగాల పరస్పర అనుసంధానం వల్ల రైతుకు అన్ని కాలాల్లోనూ ఆదాయం లభిస్తుంది.

**నూతన సాంకేతికతల అనుసరణ:** సమగ్ర వ్యవసాయంలో పాల ఉత్పత్తి, పుట్టగొడుగుల ఉత్పత్తి, మాంసం, కూరగాయలు మొదలైన విభాగాల అనుసంధానం ద్వారా ఆదాయం స్థిరంగా పెరుగుతూ, చిన్న రైతులు కూడా కొత్త సాంకేతికతలను ఆచరణలోకి తీసుకునేలా ప్రోత్సాహం లభిస్తుంది.

**శక్తి పొదుపు:** వ్యవస్థలో లభ్యమయ్యే సేంద్రీయ వ్యర్థాలను బయోగ్యాస్ ఉత్పత్తికి వినియోగించడం ద్వారా శక్తి సంక్షోభాన్ని తగ్గించవచ్చు.

**ఇంధనం, కలప అవసరాలు తీర్చడం:** సరైన విధంగా అగ్రో-ఫారెస్ట్రీని అనుసంధానం చేయడం ద్వారా ఇంధన మరియు పారిశ్రామిక కలప ఉత్పత్తి పెరిగి అటవీ నరికివేత తగ్గుతుంది, తద్వారా ప్రకృతి వ్యవస్థ రక్షించబడుతుంది.

**ఉపాధి సృష్టి:** పంటలను పశుసంవర్ధక విభాగాలతో కలపడం వల్ల పనిదిన అవసరం పెరిగి కుటుంబ కార్మికులకు సంవత్సరం పొడవునా ఉపాధి లభిస్తుంది.

రైతులు నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో సమగ్ర వ్యవసాయ మాడ్యూల్‌లో పంటలు, పశుసంవర్ధక (గేదెలు మరియు గొర్రెలు), ఉద్యానవనం, కూరగాయలు, కోళ్లు, వర్మీ కంపోస్ట్ యూనిట్ వంటి విభాగాలను పరస్పరం అనుసంధానం చేసే సమగ్ర వ్యవసాయ వ్యవస్థ రైతులకు స్థిరమైన ఆదాయం లభించే మార్గంగా నిలుస్తోంది. ఈ మాడ్యూల్‌లో భాగంగా మొత్తం 10,000 చదరపు మీటర్ల (2.5 ఎకరాలు) విస్తీర్ణాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నట్లయితే, ప్రధాన భాగమైన ఆహార ధాన్యాలు మరియు పశుగ్రాస పంటలకు 70% భూమిని కేటాయించడం ద్వారా వరి-స్వీట్ కార్న్, సోయాబీన్-గోధుమ, పసుపు+ మొక్కజొన్న, పత్తి+కందులు ఆహార ధాన్య పంటగా, అదేవిధంగా పశుగ్రాస పంటలకు హైబ్రిడ్ సూపర్ నాపియర్ గడ్డి మరియు హెడ్జ్ లూసెర్న్ వంటి పంటలను సాగు చేయవచ్చు.

ఫల పంటల కోసం కేటాయించిన 20% భూభాగంలో మామిడి / జామ తోటలను ఏర్పాటు చేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. 4% విస్తీర్ణంలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి టమాటా, బెండకాయ, వంకాయ, ఆకుకూరలు వంటి కూరగాయలను పెంచి కుటుంబ పోషక అవసరాలను తీర్చడంతో పాటు మార్కెట్ విక్రయ అవకాశాలను కూడా సాధించవచ్చు. అదేవిధంగా, పశుసంవర్ధకానికి కేటాయించిన 4% భూభాగంలో పాడి పశువులు, గొర్రెలు మరియు పౌల్ట్రీ (కోళ్ల పెంపకం) ను నిర్వహించడం ద్వారా సంవత్సరం పొడవునా నగదు ప్రవాహాన్ని ఆశించవచ్చు. మిగిలిన 2% భూభాగంలో వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను అభివృద్ధి చేసి వ్యవస్థలోనే ఏర్పడే వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చి పంటల ఉత్పత్తి ఖర్చులను తగ్గించవచ్చు.

ఈ సమతుల్య భూవిభజనతో ప్రతి భాగం పరస్పరం ఆధారంగా పనిచేసి, నీటి లభ్యత పరిమితంగా ఉన్నా రైతుకు స్థిరమైన ఆదాయం, పోషక భద్రత, మరియు వనరుల సమర్థ వినియోగం అందేలా ఈ సమగ్ర వ్యవసాయ మోడల్ దోహదపడుతుంది.

సమగ్ర వ్యవసాయంలో వివిధ విభాగాల మధ్య ఉండే పరస్పర సహకారం వల్ల సహజ వనరులు సమర్థంగా వినియోగించబడుతూ, పర్యావరణంపై పడే భారం తగ్గుతుంది. అంతేకాక, వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే సామర్థ్యం, నేల ఆరోగ్యం మెరుగుదల, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పెంపు వంటి అంశాలు సమగ్ర వ్యవసాయంకు బలమైన స్థిరత్వాన్ని అందిస్తాయి. ఇవి కార్బన్ నిల్వలను పెంచి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

సమగ్ర వ్యవసాయ వ్యవస్థలను ఆచరణలోకి తీసుకోవడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత అనుకూలంగా, ఉత్పాదకంగా, వాతావరణ మార్పులకు తట్టుకునే స్థిరమైన వ్యవస్థగా మార్చవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9959960992**

# జాతీయ ఆహార విధానాల రూపకల్పనలో వ్యవసాయ డేటా పాత్ర

డా॥ జె. సునిల్, డా॥ టి. లావణ్య, డా॥ ఎం. సంపత్ కుమార్ మరియు డా॥ ఆర్. సతీష్
బీజేఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల






ఒకదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రధాన భూమికను పోషిస్తుంది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. సుమారు 60 శాతం ప్రజలు నేరుగా లేదా పరోక్షంగా వ్యవసాయరంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంత పెద్ద జనాభా అవసరాలను తీర్చడం, రైతుల ఆదాయాన్ని స్థిరంగా ఉంచడం, మరియు ఆహార భద్రతను సాధించడం కోసం ప్రభుత్వం సమగ్ర ఆహార విధానాలు రూపొందించాలి. ఈ విధానాల రూపకల్పనలో వ్యవసాయ డేటా కీలక పాత్ర పోషిస్తుంది. సమగ్రమైన, విశ్వసనీయమైన డేటా ఆధారంగా తీసుకునే నిర్ణయాలు మాత్రమే దేశ ఆహార భద్రత, ధర స్థిరత్వం, మరియు రైతుల సంక్షేమం దిశగా దోహదపడతాయి.

## వ్యవసాయ డేటా అంటే ఏమిటి?

వ్యవసాయ రంగానికి సంబంధించిన వాస్తవాలను సేకరించి, వర్గీకరించి, విశ్లేషించి పొందిన సమాచారాన్ని వ్యవసాయ డేటా అంటారు. ఇది రైతు స్థాయిలో నుండి జాతీయ స్థాయి వరకు వ్యవసాయ కార్యకలాపాలపై స్పష్టమైన చిత్రాన్ని అందిస్తుంది. ఉదాహరణలు:

- పంటల ఉత్పత్తి, దిగుబడి మరియు సాగు విస్తీర్ణం
- వర్షపాతం, ఉష్ణోగ్రత, వాతావరణ వివరాలు
- నేల రకం, సారవంతత మరియు నీటి లభ్యత
- మార్కెట్ ధరలు, నిల్వలు, రవాణా మరియు సరఫరా వివరాలు
- ఎగుమతి–దిగుమతి గణాంకాలు

ఈ సమాచారమంతా కలిపి వ్యవసాయ వ్యవస్థకు బలమైన డేటా ఆధారాన్ని అందిస్తుంది.

## వ్యవసాయ డేటా మూలాలు:

భారతదేశంలో వ్యవసాయ డేటా సేకరణకు అనేక సంస్థలు, సాంకేతిక వనరులు, మరియు ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి.

### 1. ప్రభుత్వ సంస్థలు

- భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ: పంట ఉత్పత్తి అంచనాలు, ఎరువుల వినియోగం, సాగు విస్తీర్ణం మొదలైన వివరాలను సేకరిస్తుంది.
- జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ): వ్యవసాయ మరియు గ్రామీణ ఉపాధి గణాంకాలను సేకరిస్తుంది.
- భారత ఆహార నిగమం (ఎఫ్సిఐ): ఆహార ధాన్యాల నిల్వలు, రవాణా, మరియు పంపిణీ డేటాను నిర్వహిస్తుంది.
- వ్యవసాయ మరియు ప్రాసెస్ చేయబడిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ మరియు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్: వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి–దిగుమతి గణాంకాలను అందిస్తాయి.

### 2. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ విభాగాలు

ప్రతి రాష్ట్రంలో వ్యవసాయ శాఖలు పంట స్థాయిలో ఉత్పత్తి, సాగు స్థలాలు, మరియు రైతు వివరాలను సేకరిస్తాయి. ఈ డేటా కనీస మద్దతు ధరలు నిర్ణయించడానికి, మరియు పంట బీమా పథకాలు అమలు చేయడానికి ఉపయోగపడుతుంది.

### 3. పరిశోధనా సంస్థలు మరియు విశ్వవిద్యాలయాలు

ఐసిఏఆర్, కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పంట ఉత్పత్తి, వాతావరణ

ప్రభావం, నేల విశ్లేషణ, మరియు సాంకేతికతలపై పరిశోధనాత్మక డేటా సేకరిస్తాయి.

**4. ఆధునిక సాంకేతిక వనరులు**

- **రిమోట్ సెన్సింగ్ మరియు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ టెక్నాలజీ:** శాటిలైట్ చిత్రాల ద్వారా సాగు స్థలాలు మరియు పంట స్థితిని గుర్తించడం.
- **డ్రోన్లు మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సెన్సార్లు:** నేల తేమ, ఉష్ణోగ్రత, మరియు పంట ఆరోగ్యాన్ని రియల్ టైమ్‌లో నమోదు చేస్తాయి.
- **మొబైల్ యాప్‌లు మరియు రైతు సేవా పోర్టల్స్:** రైతులు తమ పంట సమాచారం, మార్కెట్ ధరలు, మరియు వాతావరణ సూచనలను పొందగలరు.
- డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (2021-2025)

భారత ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ రైతుల కోసం సమగ్ర డేటా ఎకోసిస్టమ్ నిర్మించడమే లక్ష్యం.

**ముఖ్య భాగాలు:**

**అగ్రి స్టాక్:**

- ప్రతి రైతుకు ఒక యూనిక్ ఫార్మర్ ఐడి ఇవ్వడం.
- పంట వివరాలు, భూమి రికార్డులు, మార్కెట్ డేటా, మరియు ప్రభుత్వ పథకాలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో సమీకరించడం.
- దీనివల్ల రైతులకు వ్యక్తిగత సలహాలు, డిజిటల్ రుణాలు, మరియు సబ్సిడీల పంపిణీ సులభమవుతుంది.

**కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్:**

- ఇది డేటా ఆధారిత నిర్ణయాలను తీసుకోవడానికి రూపొందించిన వ్యవస్థ.
- వాతావరణం, పంట స్థితి, మరియు మార్కెట్ ధోరణుల ఆధారంగా పాలసీ మేకర్లకు మరియు రైతులకు మార్గనిర్దేశం చేస్తుంది.

**ఫలితంగా:** ఈ రెండు సాంకేతిక మిషన్లు డేటా పారదర్శకత, రైతు సదుపాయాల డిజిటలైజేషన్, మరియు స్మార్ట్ పాలసీ మేకింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**5. అంతర్జాతీయ డేటా మూలాలు**

**ఎఫ్ఏఓ:** ప్రపంచ వ్యాప్తంగా ఆహార ఉత్పత్తి మరియు వాణిజ్య గణాంకాలు.

**వరల్డ్ బ్యాంక్:** ఆర్థిక, వ్యవసాయ అభివృద్ధి డేటా.

**డబ్ల్యూటీఓ:** అంతర్జాతీయ వాణిజ్య విధానాలు మరియు ధాన్య ధరల ప్రభావం.

**పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్:** భారత ప్రజలకు ధాన్యాల పంపిణీపై గణాంకాలు.

**ఆహార విధానాల రూపకల్పనలో డేటా ప్రాముఖ్యత:**

1. **పంట ఉత్పత్తి అంచనా:** డేటా ద్వారా ప్రభుత్వం ఏ పంట ఎంత మోతాదులో ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేయగలదు. ఉదాహరణకు బియ్యం, గోధుమల ఉత్పత్తి స్థాయిని అంచనా వేసి గోదాములు, రవాణా వనరులు సిద్ధం చేస్తారు.
2. **ధరల నియంత్రణ:** మార్కెట్లో సరఫరా-డిమాండ్ సమతుల్యం తప్పిపోతే ధరలు పెరగవచ్చు లేదా పడిపోవచ్చు. రైతులు నష్టపోకుండా, వినియోగదారులపై భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను డేటా ఆధారంగా నిర్ణయిస్తుంది.
3. **ఆహార భద్రతా పథకాలు:** పేదలకు ధాన్యం అందించడానికి ప్రభుత్వం పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అమలు చేస్తుంది. ఇందులో ఏ రాష్ట్రానికి ఎంత ధాన్యం కేటాయించాలన్నది ఉత్పత్తి డేటా ఆధారంగా నిర్ణయిస్తారు. ఉదాహరణకు కోవిడ్-19 సమయంలో ఆహార నిల్వలు ఉన్నాయో లేదో డేటా ఆధారంగా చూసి, ఉచిత ధాన్యం పథకాలు అమలు చేశారు.
4. **ఎగుమతి-దిగుమతి విధానం:** డేటా ఆధారంగా మిగులు ఉన్నప్పుడు ఎగుమతులు అనుమతిస్తారు. లోటు ఉన్నప్పుడు దిగుమతులు పెంచి దేశీయ అవసరాలు తీర్చబడతాయి. ఉదాహరణకు ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా పెరిగినప్పుడు ప్రభుత్వం ఎగుమతులను ఆపేస్తుంది.
5. **సంక్షోభ నిర్వహణ:** వర్షాభావం, వరదలు, కీటక వ్యాధులు, గ్లోబల్ మార్కెట్ మార్పులు వంటి పరిస్థితుల్లో ఎంత నష్టం జరిగిందో డేటా ద్వారా అంచనా వేస్తారు. దాని ఆధారంగా రైతులకు నష్టపరిహారం లేదా సబ్సిడీలు ఇస్తారు.
6. **పంట రకాల ఎంపిక మరియు సాగు పద్ధతులు:** ప్రాంతాల వారీగా నేల రకం, వర్షపాతం ఆధారంగా ఏ పంటలు ఉత్తమ దిగుబడిని ఇస్తాయో డేటా విశ్లేషణ ద్వారా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటిని వినియోగించే పంటలను (జొన్న, సజ్జ వంటివి) సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహించవచ్చు. దీనివల్ల వనరుల వినియోగం మెరుగుపడుతుంది మరియు ఆహార భద్రత పెరుగుతుంది.

**7. సామాజిక–ఆర్థిక ప్రభావాల అంచనా:** రైతుల ఆర్థిక స్థితి, గ్రామీణ ఉపాధి రేటు, ఆహార వినియోగ అలవాట్లపై డేటా సేకరించడం వల్ల ప్రభుత్వం తమ విధానాలు సమాజంలోని వివిధ వర్గాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో అర్థం చేసుకోగలదు. దీని ఆధారంగా పేదరికం, ఆకలి వంటి సమస్యలను తగ్గించే లక్ష్మిత పథకాలు రూపొందించవచ్చు.

**8. వ్యవసాయ పరిశోధన మరియు అభివృద్ధి:** డేటా ద్వారా పంట దిగుబడిపై నేల స్వభావం, వాతావరణం, ఎరువులు, పురుగుమందుల ప్రభావాన్ని అంచనా వేయవచ్చు. దీని ఆధారంగా పరిశోధన సంస్థలు కొత్త, అధిక దిగుబడినిచ్చే పంట రకాలను, వాతావరణ మార్పులను తట్టుకునే సాంకేతికతలను అభివృద్ధి చేయగలవు.

**9. డిజిటల్ వ్యవసాయం మరియు టెక్నాలజీ:** స్మార్ట్‌ఫోన్లు, డ్రోన్లు, సెన్సార్ల ద్వారా సేకరించే రియల్-టైమ్ డేటా రైతులు తమ పొలాలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఉపయోగ పడుతుంది. ఈ డిజిటల్ వ్యవసాయం డేటా పంటల ఆరోగ్యం, నీటి లభ్యత, తెగుళ్ల వ్యాప్తి వంటి సమాచారాన్ని తక్షణమే అందిస్తుంది. దీని ద్వారా రైతులు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. అలాగే ప్రభుత్వం కూడా మొత్తం వ్యవసాయ ఉత్పాదకతను పర్యవేక్షించి మెరుగుపరచగలదు.

### సవాళ్లు:

**1. డేటా సేకరణ లోపాలు:**

- కొన్ని ప్రాంతాల్లో సరైన మరియు సమగ్ర డేటా సేకరణ వ్యవస్థలు లేవు.
- ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది కొరత, పరికరాల లోపం, మరియు తగిన శిక్షణ లేకపోవడం వల్ల డేటా నాణ్యత తగ్గుతుంది.

**2. డేటా సమయానికి అందకపోవడం:**

- రియల్ టైమ్ అప్‌డేట్ వ్యవస్థలు లేకపోవడం వల్ల పాలసీ నిర్ణయాలు ఆలస్యం అవుతాయి.
- వాతావరణం, పంట స్థితి, లేదా మార్కెట్ ధరల మార్పులు వెంటనే ప్రతిబింబించవు.

**3. రైతుల అవగాహన లోపం:**

- చాలా మంది రైతులు డేటా ఆధారిత సాంకేతికతల ప్రయోజనాలను పూర్తిగా అర్థం చేసుకోలేరు.
- డిజిటల్ యాప్‌లు, పోర్టల్స్, మరియు ఆన్‌లైన్ సేవల వినియోగం తక్కువగా ఉంటుంది.

**4. డేటా భద్రత మరియు గోప్యత:**

- రైతుల వ్యక్తిగత సమాచారాన్ని (భూమి రికార్డులు, ఉత్పత్తి వివరాలు మొదలైనవి) రక్షించాల్సిన అవసరం ఉంది.
- సైబర్ భద్రతా లోపాలు, డేటా దుర్వినియోగం ప్రమాదం ఉంది.

### భవిష్యత్ దిశ

భవిష్యత్తులో, కృత్రిమ మేధస్సు (ఏఐ), యంత్ర అభ్యాసం మరియు పెద్ద డేటా విశ్లేషణ వంటి సాంకేతికతలు వ్యవసాయ డేటా విశ్లేషణలో విరివిగా ఉపయోగించబడతాయి.

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (2021-2025) వంటి ప్రభుత్వ కార్యక్రమాలు రైతు స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు డేటా సమగ్రతను పెంచుతాయి.

### సారాంశం

**వ్యవసాయ డేటా జాతీయ ఆహార విధానాల పునాది. సరైన డేటా సేకరణ, విశ్లేషణ, మరియు వినియోగం ద్వారా:**

- ఆహార భద్రతా లక్ష్యాలు సాధ్యమవుతాయి,
- రైతుల ఆదాయం స్థిరపడుతుంది మరియు
- దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది.

డేటా ఆధారిత వ్యవసాయ విధానాల ద్వారా భారతదేశం సుస్థిర ఆహార ఉత్పత్తి మరియు సమగ్ర అభివృద్ధివైపు దృఢంగా అడుగులు వేస్తోంది.






ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9618874445



# జనవరి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు


డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**


**మామిడి:**

పూత, పిందె సమయంలో తేనెమంచు పురుగు, తామర పురుగులతో పాటు బూడిద తెగులు కూడా సోకే అవకాశం ఉంది. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. + కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 1 గ్రా. + ప్లానోఫిక్స్ పావు మి.లీ. లను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఏనుగు / రాతి మంగు రాకుండా నల్లపూత దశలో 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. 75 శాతం పైగా పిందె కట్టిన తరువాత మొదటి తడి ఇవ్వాలి. నీటి వసతి లేనట్లైతే 1 శాతం యూరియా (10 గ్రా./లీటరు నీటికి) ద్రావణంను పిచికారి చేసుకోవడం ద్వారా కట్టిక పిందెలు రాలకుండా చూడవచ్చు.

**జామ:**

ముదురు ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు ముడుచుకొని రాలిపోతాయి. నివారణకు మ్యాంకోజెబ్ మందును 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఆకులపై తెల్ల సుడిదోమ పిల్ల పురుగులు తెల్లని దూది వంటి మెత్తని పదార్థంలో కప్పబడి రసాన్ని పీలుస్తాయి. ఆశించిన ఆకులు ఎర్రబడి ముడతలు పడతాయి. ఆశించిన కొమ్మలు కత్తిరించి వేసి, 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువైనచో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:**

అంబే బహార్ (జనవరిలో వచ్చే పూత) లో వచ్చే లేత ఆకులపై ఎగిరే పేను పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొగ్గ పగిలే దశలో ఒకసారి, మళ్ళీ 10 రోజుల తరువాత పిచికారి చేయాలి. పిందె బాగా కట్టడానికి ప్లానోఫిక్స్ 1.5 గ్రా. 1 కిలో యూరియా 100 లీటర్ల నీటిలో కలిపి మొగ్గ, పూత దశలో పిచికారి చేయాలి.

**ద్రాక్ష:**

ఈ మాసంలో పిండినల్లి ఆశించిన కొమ్మలను, ద్రాక్ష గుత్తులను కత్తిరించి నాశనం చేయాలి. బూప్రోఫెజిన్ 1.25 మి.లీ. లేదా మిథోమిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. జనవరి-ఫిబ్రవరి మాసాలలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు థయోమిథాక్సామ్ 0.25 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బొప్పాయి:**

ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోవును. నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ఉసిరి:**

కాయలపై తుప్పు తెగులు కనిపిస్తుంది. కాయలు కోతకు ముందే రాలిపోతాయి. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.





**జీడి మామిడి:**

ఈ మాసంలో ఎండుతెగులు ఆశిస్తుంది. దీని వల్ల పుష్పగుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి, పూర్తిగా పెరగకుండా ఎండిరాలిపోతాయి. నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కూరగాయలు:**

**బెండ:**

వేసవి పంటను జనవరి రెండవ పక్షం నుండి విత్తుకోవచ్చు. 2.5 కిలోల విత్తనంను, వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 15-20 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.

**వంగ:**

వేసవి పంట కోసం ఈ మాసంలో విత్తనాలను నారుమడిలో నాటుకోవాలి.

**టమాట:**

వేసవి పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చు. 21-25 రోజుల వయస్సు ఉండి 3-4 ఆకులు గల మొక్కలను 45×30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. సాధ్యమైనంత వరకు 30 రోజులు మించిన ముదురు నారును నాటరాదు.

**పందిరి కూరగాయలు:**

ఆనప, దోస, కాకరలను జనవరి రెండో పక్షం నుండి నాటుకోవచ్చు. గుమ్మడి, పొట్లను జనవరి చివరి వరకు నాటుకోవచ్చు. గుమ్మడి పెంకు పురుగుల పిల్ల పురుగులు పెరుగుదల దశలో ఆకులను కొరికి తింటాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పెరుగుదల దశ నుండి పూత వచ్చే వరకు 5% వేపగింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

**చిక్కుడు:**

వేసవి చిక్కుడును ఈ మాసంలో విత్తుకోవచ్చు. పందిళ్ళపై పెంచే పంటకు 2-2 మీ. దూరంలో కాలువలు చేసి 1.5-2.0 మీ. దూరంలో పాదులు చేసి ఒక్కో పాయలో 3-4 విత్తనాలు పెట్టాలి. 5-7 రోజుల తరువాత బలమైన రెండు మొక్కలుంచి మిగిలినవి పీకి వేయాలి.

**గోరు చిక్కుడు:**

వేసవి పంట కోసం 12-16 కిలోల విత్తనాలను 45×15 సెం.మీ. దూరంలో జనవరి రెండవ పక్షం నుండి విత్తుకోవాలి.

**మిరప:**

ఈ మాసంలో పేనుబంక లేత కొమ్మల, ఆకుల అడుగున చేరి రసాన్ని పీల్చడం వల్ల పెరుగుదల తగ్గుతుంది. ఆకులు, కాయలు, నల్లటి మసిపూసినట్లుగా మారిపోతాయి. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**అల్లం:**

సాధారణంగా అల్లం దుంపలు ఈ మాసంలో త్రవ్వకానికి వస్తాయి. ఆకులు పసుపు పచ్చగా మారి ఎండిపోవడం, కాండం ఎండిపోవడంను బట్టి అల్లం దుంపలు పక్వానికి వచ్చినట్లుగా గుర్తించి త్రవ్వుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**



# టెర్రేరియం - గాజు లోపల సహజ పచ్చని ప్రకృతి ప్రపంచం

డా॥ యం.ఆర్. భానుశ్రీ, డా॥ వి. అనిత, డా॥ కె. కవిత మరియు డా॥ బి. పుష్పావతి

వ్యవసాయ కళాశాల, పాలెం, నాగర్ కర్నూల్



టెర్రేరియంలు ఇంటి లోపల సహజ వాతావరణాన్ని ప్రతిబింబించే అందంగా కనిపించే తక్కువ సంరక్షణలోనే పెరుగుదలకు అనువైన సూక్ష్మ తోటలు. వీటిని అలంకరణ వస్తువులుగా, ప్రత్యేక బహుమతులుగా అలాగే ప్రకృతి పర్యావరణ విద్యా సాధనాలుగా ఉపయోగించవచ్చు. సరియైన గాజపాత్ర. తగిన మొక్కల ఎంపికతో పాటు కొంత సృజనాత్మకతను వినియోగిస్తే స్వయంనియంత్రణలో పనిచేసే చిన్న ఉద్యానవనాన్ని రూపొందించవచ్చు. ఇలాంటి టెర్రేరియంలు ఇంటి లేదా కార్యాలయం పరిసరాలకు పచ్చదనాన్ని చేకూర్చడమే కాకుండా మనకు ఆహ్లాదాన్ని ప్రశాంతతను అందిస్తాయి.

టెర్రేరియం అనేది పారదర్శక గాజు సీసా లేదా గిన్నెలో ఏర్పాటుచేసే సూక్ష్మ అంతర్గత ఉద్యానవనం. ఇది సహజ వాతావరణాన్ని అనుకరించేలా రూపుదిద్దిన చిన్న స్వయంపాలిత జీవవ్యవస్థ. వర్షరణ్యం, ఎడారి వంటి భిన్న వాతావరణాలను కూడా ఇందులో సృష్టించవచ్చు. ప్రత్యేకించి బయట స్థలం తక్కువగా ఉన్న పట్టణ పరిసరాల్లో ప్రకృతిని గదిలోకి తీసుకురావడానికి ఇవి ఎంతో అనుకూలం. ఇది స్వయం నియంత్రన వ్యవస్థ కావడంతో నీటి మరియు సంరక్షణ అవసరం తక్కువగా ఉంటుంది. బిజీ షెడ్యూల్ ఉన్నవారికి ఇది ఎంతో అనువైనది.

టెర్రేరియంలోని పారదర్శక గాజు గోడలు, ధూళీ, గాలి, ఉష్ణోగ్రత మార్పుల నుండి మొక్కలను రక్షిస్తాయి. గాజు ద్వారా వెలుతురు సులభంగా ప్రవేశించడం వలన మొక్కలు ఎదుగుదలకు అనుకూలంగా ఉంటుంది. టెర్రేరియం అధిక తేమ వాతావరణం ఏర్పడుతుంది. ఇందులో మొక్కలు ఆకుల నుండి వెలువడే నీటి ఆవిరి చల్లని గాజు గోడలను తాకినప్పుడు ద్రవ రూపంలోకి మారి గిన్నె అడుగున ఉన్న మట్టిలోకి చేరుతుంది. ఆ నీటిని మొక్కలు మళ్ళీ వేరు వ్యవస్థ ద్వారా గ్రహించు కుంటాయి. మూసిన లేదా తెరిచిన గాజు పాత్రలు, ఆక్వేరియం వంటి గాజు పాత్రల్లో వీటిని రూపొందించవచ్చు.

## టెర్రేరియం రకాలు:

టెర్రేరియంలు రెండు రకాలుగా ఉంటాయి.

**1. మూసిన టెర్రేరియం:** మూత లేదా కార్క్‌తో పూర్తిగా మూసివేసిన ఈ టెర్రేరియం లోపల వాతావరణం స్వయంపాలితంగా ఉంటుంది. ఎక్కువ తేమను ఇష్టపడే పచ్చని నాచు మొక్కలు, ఫెర్న్ జాతి మొక్కలు ఇందుకు ఎంచుకోవాలి, వారానికి ఒకసారి మూత తీసి లోపల ఎక్కువగా ఉన్న తేమను బయటికి పంపాలి. అలా చేస్తే తెగుళ్ళు ఇతర హానికర సూక్ష్మజీవులు పెరగకుండా ఉంటాయి.

**2. తెరిచి ఉండే టెర్రేరియం:** ఈ టెర్రేరియం పైభాగం పూర్తిగా తెరిచి ఉండి గాలి సులభంగా లోపలికి వెళుతుంది. ఎక్కువ తేమ అవసరం లేని మొక్కలకు ఇవి ఉత్తమ ఎంపిక, ఎడారి జాతి మొక్కలైన కాక్టస్, ఆకులలో నీరు ఎక్కువగా నిల్వ ఉంచే సక్యులెంట్‌లు మరియు చిన్న ఆకులు కలిగిన మొక్కలు, పొడి వాతావరణాన్ని ఇష్టపడే జాతులకు ఇవి ఎంతో అనుకూలం.

**అవసరమైన వస్తువులు:**

- పారదర్శక గాజు పాత్ర (పాత గాజు సీసా, జార్, ఆక్వేరియం)
- చిన్న గులక రాళ్ళు లేదా కంకర రాళ్ళు
- బొగ్గు, పుట్టమట్టి
- టెరేరియంకు సరిపోయే మొక్కలు
- అందాన్ని పెంచే చిన్న అలంకరణ వస్తువులు
- నీరు పిచికారి చేయడానికి స్ప్రే బాటిల్

**గాజు పాత్ర:** పారదర్శకంగా ఉండాలి, మసక లేదా రంగు గాజు వెలుతురు తగ్గిస్తుంది.

**మట్టి తయారీ:** సీసా అడుగున 1 1/2 - 2 అంగుళాలు మట్టిని వేసుకోవాలి. నీరు క్రింద పొరలకు సులభంగా వెల్లడానికి సీసాలలో ఇసుక, చిన్న గులక రాళ్ళు, బొగ్గు, కుండ పెంకులు (ముక్కలు) వేయాలి.

**టెరేరియంకు అనుకూలమైన మొక్కలు:**

నెమ్మదిగా పెరిగే చిన్న మొక్కలను ఎంచుకోవాలి.

- సింగోనియం
- సాన్సివిరియ
- సెలాజినెల్లా
- పెలియోనియా
- పెపరోమియా
- ఫిటోనియా
- మనీప్లాంట్
- పైలియా
- చిన్న ఫెర్న్ జాతి మొక్కలు
- బేబీస్ టియర్స్
- నీటిలో పెరిగే నాచు

**మొక్కల అమరిక:** టెరేరియంను మనకు నచ్చినట్లు ఏదైనా ప్రత్యేక థీమ్ ఆధారంగా ఆకర్షణీయంగా రూపొందించుకోవచ్చు. చిరు అరణ్యం, ఫెయిరీగార్డెన్ వంటి వివిధ శైలులను ఎంపిక చేసుకోవచ్చు. మొక్కలను పాత్రలో అమర్చేటప్పుడు ముందు భాగంలో చిన్న మొక్కలు, వెనుక భాగంలో కొంచెం పెద్ద మొక్కలు పెట్టాలి. అలంకరణ కోసం చిన్న రాళ్ళు, గడ్డి, గవ్వలు (షెల్స్). చిన్న బొమ్మలు వంటి వస్తువులను ఉపయోగించవచ్చు. అయితే ఇవి ప్రత్యేక సహజత్వాన్ని తగ్గించకుండా పరిమితంగా ఉండాలి.

**సంరక్షణ:**

**నీరు:** టెరేరియంలు స్వయం తేమ చక్రం కలిగి ఉండటం వలన ఎక్కువ నీరు అవసరం ఉండదు. మట్టి స్వల్పంగా ఎండినప్పుడు మాత్రమే కొద్దిగా నీరు పిచికారి చేస్తే సరిపోతుంది. అధికంగా నీరు అందిస్తే పాత్ర లోపల కుళ్ళు లేదా ఫంగస్ పెరుగుదల చోటు చేసుకోవచ్చు.

**కాంతి సంరక్షణ:** మొక్కలకు నేరుగా సూర్యకాంతి పడడం హానికరం. అందువల్ల నీడతో కూడిన వెలుతురు (కిటికీ పక్కన) లో ఉంచాలి. లేదా కృత్రిమ లైట్ల సమీపంలో ఉంచాలి.

కత్తిరింపులు మరియు శుభ్రపరచడం: వేగంగా పెరిగే మొక్కలను క్రమం తప్పకుండా కత్తిరించాలి. ఆకృతిని కొనసాగించాలి. ఎండిన, పండుబారిన ఆకులను తొలగించాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9618874445**

**డిసెంబర్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క్ర.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 09.12.2025 | 6వ మెమోరియల్ లెక్చర్ ఆఫ్ డా॥ బి. రాం మూర్తి (డా॥ కె. సమ్మి రెడ్డి) |
| 2. | 10.12.2025 | పి.జె.టి.ఎ.యు. ఎట్ తెలంగాణ రైజింగ్ సమ్మిట్ - 2025 |
| 3. | 15.12.2025 | డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ అగ్రికల్చర్ రీసెర్చ్ & ఎడ్యుకేషన్ పోర్ట్‌ఫోలియో పర్ ఎ బెటర్ ఫ్యూచర్ |
| 4 | 22.12.2025 | రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు దృశ్యమాలిక |
| 5 | 27.12.2025 | పూర్వపు విద్యార్థులు - గెస్ట్ లెక్చర్ (డా॥ జి.ఎస్.జి. అయ్యంగార్) |

# శీతాకాలంలో చేపలకు వచ్చే వ్యాధులు మరియు నివారణ చర్యలు

డా॥ జి. గణేష్

కృషి విజ్ఞాన కేంద్రం, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, మామునూర్, వరంగల్







శీతాకాలంలో చలి ప్రభావం వలన చేపల చెరువులో నీటి ఉష్ణోగ్రత తగ్గుతుంది మరియు చేపలు శీతల రక్త జీవులు కావున చేపల శరీర ఉష్ణోగ్రత, చేపల చెరువు నీటి ఉష్ణోగ్రతకు సమానంగా ఉండే అవకాశం ఉంది. కావున శీతాకాల ప్రభావము వలన చేపల శరీర ఉష్ణోగ్రత తగ్గి చేపలపై ఒత్తిడి పెరుగుతుంది మరియు జీర్ణక్రియ రేటు కూడా తగ్గుతుంది. కావున చేపల మేత వినియోగం తగ్గి తద్వారా రోగ నిరోధక శక్తి క్షీణించి తొందరగా వ్యాధులకు గురి అయ్యే ప్రమాదం ఉంది. శీతాకాలంలో ప్రముఖంగా చేపలకు తాటాకు తెగుళ్లు, శంఖు పూత, కురుపుల వ్యాధి మరియు మొప్ప పురుగు మొదలగు వ్యాధులు సంభవించే అవకాశం ఉంది. వీటితో పాటు చేపల చెరువులోని నీటిలో ప్రాణ వాయువు లోపం, నీటి ఉదజని తగ్గుదల, అమ్మోనియా సాంద్రత అధికమగుట వంటి లక్షణాల వలన చేపలపై ఒత్తిడి పెరిగి పెరుగుదల తగ్గి, చేపలు చనిపోయే అవకాశం ఉంది.

### 1. తాటాకు తెగుళ్లు

**వ్యాధి లక్షణాలు:** ప్రధానంగా భారతీయ మేజర్ కార్ప్ (బొచ్చ, రవ్వ, మొయ్య) చేపలకు, అన్ని వయస్సుల చేపలకు కూడా సోకే అవకాశం ఉంటుంది. మరణాల శాతం అధికంగా ఉంటుంది. ఈ వ్యాధి ముఖ్యంగా చేపల మొప్పలకు, చర్మానికి సోకుతుంది. ఈ వ్యాధి ప్రధాన లక్షణం మొప్పల రంగు మాడిపోయి తాటాకు రంగులోకి మారుతాయి దీనివలన చేపలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది కాబట్టి అధిక మొత్తంలో చేపలు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన చేపలు మేత కూడా తీసుకోవు, చెరువు నీటి పై భాగానికి చేరుకొని కట్టల అంచులకు వచ్చి చనిపోతుంటాయి.

**నివారణ:** మరణించిన చేపలను ప్రతిరోజూ ఏరివేసి గుంట తీసి అందులో సున్నం గానీ, బ్లీచింగ్ పౌడర్ గాని వేసి కప్పి పెట్టాలి. 4% సోడియం హైపోక్లోరేటు ద్రావణాన్ని ఎండగా ఉన్నప్పుడు ఎకరాకు ఒక లీటరు చొప్పున నీళ్ళలో కలిపి చల్లాలి. లేదా 20% అయోడిన్ ద్రావణాన్ని ఎకరాకు 250 మి.లీ. చొప్పున నీళ్ళతో కలిపి చల్లుకోవాలి. 10% ఆక్సీటెట్రాసైక్లిన్ మందును టన్ను చేపకు 100 గ్రా. చొప్పున 5-7 రోజులు మేతతో కలిపి ఇవ్వాలి. అలాగే చేపల చెరువులోని నీటిలో నైట్రేట్లు, అమ్మోనియా వంటి విష పదార్థాలు తయారు కాకుండా మంచి యాజమాన్య పద్ధతులు అవలంభించాలి.

### 2. శంఖుపూత

అన్ని రకాల మంచి నీటి చేపలకు సహజంగా సోకుతుంది. మిక్సోబోలస్ జాతికి చెందిన పరాన్నజీవి ఈ వ్యాధికి కారణం. అన్ని వయస్సులు గల చేపలకు సోకుతుంది. ముఖ్యంగా ఫ్రై, ఫింగర్లింగ్స్ చేపలకు అధికంగా సోకుతుంది. వ్యాధికారక పరాన్న జీవులు స్పోర్సు రూపంలో మొప్పలు, చర్మం మరియు కండరాలలో ఉంటాయి.

**వ్యాధి లక్షణాలు:** వ్యాధి సోకిన చేపలు ఆహారం తీసుకోవు, బద్ధకంగా నీటి పై భాగాన ఈదుతూ ఉంటాయి. పెరుగుదల తక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో గిరగిరా తిరిగి చనిపోతుంటాయి. మొప్పలలో తెల్లటి పొక్కులు కల్గి ఉంటాయి.

**నివారణ:** ఇది చాలా మొండి వ్యాధి. వ్యాధికారక క్రిములు దోస గింజలు లాంటి స్పోర్సును ఉత్పత్తి చేస్తాయి. వ్యాధి తీవ్రంగా ఉంటే ఫార్మాలిన్ ద్రావణం ఎకరాకు ఒక లీటరు చొప్పున నీటిలో కలిపి చల్లుకోవాలి (ఎండ సమయంలో). మేతల్లో ఉప్పు కలిపి 10-12

రోజులకు ఒక్కసారి ఇవ్వాలి. మేత మూటలు వద్ద ఉప్పు మూటలు వేలాడగట్టాలి. చేపల చెరువులో చేపల సాంద్రత తగ్గించుకోవాలి.

### 3. కురుపుల వ్యాధి

ఈ వ్యాధి ప్రధానంగా శీతాకాలంలో ఎక్కువగా వస్తుంది. ముఖ్యంగా తెల్ల చేపలు, కొర్రమెను, ముల్లెట్లు, మార్పు, ఇంగిలాయి, తిలపియా మరియు పాల చేపలకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి "ఎఫినో మైసిన్ ఇన్ వాడన్సు" అనే ఫంగస్ (శిలీంద్రం) వలన వస్తుంది. అన్ని వయస్సులలోను సోకుతుంది. చర్మం మరియు కండరాలలో వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

**వ్యాధి లక్షణాలు:** పొలుసు ఊడిపోయి చర్మంపై పుండ్లు ఏర్పడతాయి. ఎరుపు మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి ముదిరినప్పుడు బూడిద రంగు పుండ్లు ఏర్పడతాయి. మరణాలు అధికంగా ఉంటాయి.

**నివారణ:** వ్యాధి సోకి మరణించిన చేపలను ప్రతీ రోజూ వేరు చేసి గుంటలో సున్నం వేసి పుడ్చేయాలి. నీటి పరీక్షలు చేయించి, ఆ గుణాలు సమస్థాయిలో ఉంటే ఫార్మాలిన్ ద్రావణాన్ని ఎకరాకు లీటరు చొప్పున ఎండ సమయంలో చల్లాలి. పుండ్లు పడిన చోట సెకండరీ ఇన్‌ఫెక్షనుగా బ్యాక్టీరియా సోకే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితులలో ఆక్సీటేటాసైక్లిక్‌ను టన్ను చేపకు 100 గ్రాముల చొప్పున 5-7 రోజులు మేతలో కలిపి ఇవ్వాలి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే రెండోసారి ఫార్మాలిన్ ద్రావణాన్ని నీటిలో చల్లుకోవాలి. భారతీయ మంచినీటి చేపల పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన సిపెక్సు మందును కూడా వాడవచ్చు.

### 4. శంఖు జలగ

ఈ వ్యాధికి మూల కారణం డక్టైలో గైరస్ పరాన్నజీవి. అన్ని రకాల కార్పు చేపలకు, క్యాట్ ఫిష్‌లకు, కొర్రమీను జాతి చేపలకు మరియు అలంకరణ చేపలకు వ్యాధులకు సోకుతుంది. ఈ పరాన్న జీవి ప్రధానంగా చేప మొప్పలు, చర్మం రెక్కలు అంటిపెట్టుకొని ఉంటుంది. అన్ని దశల చేపలు వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. చేపలు చిన్న పరిమాణంలో ఉన్నప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది మరియు ఎక్కువగా మృత్యువాత పడే అవకాశం ఉంది.

**వ్యాధి లక్షణాలు:** తక్కువ సంఖ్యలో పరాన్న జీవులు ఉన్నప్పుడు వ్యాధి లక్షణాలు ఏమి కనిపించవు. పరాన్న జీవుల సంఖ్య ఉధృతంగా ఉన్నప్పుడు దురదతో చేపలు చెరువు గట్లకు, అంచులకు, అడుగు భాగంతో రుద్దుకుంటూ ఉంటాయి. కొన్ని సందర్భాలలో ఎగరడం, వేగంగా ఈదడం లక్షణాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత బాగా ఎక్కువగా ఉంటే చేపలు నీరసంగా ఉండి ఎక్కువగా జిగురు స్రవించి మొప్పలు కలిసిపోయి ముద్దగా ఉంటాయి. మొప్పల వాజములు, చర్మం గీసుకుపోయి ఉంటుంది.

**నివారణ:** నీటి పరీక్షలు జరిపి ఆక్సిజన్, నైట్రేట్, అమ్మోనియా నిర్ణీత ప్రమాణ స్థాయిలో ఉండే విధంగా మంచి శానిటైజర్లు వాడుకోవాలి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఉప్పు ఎకరాకు 20-25 కేజీలు 10 రోజుల వ్యవధిలో నెలకి రెండు సార్లు వాడుకోవాలి లేదా సాంకేతిక నిపుణుల సలహా మేరకు చర్యలు చేపట్టాలి.

పైన సంభవించిన వ్యాధులతో పాటు శీతాకాలంలో వచ్చే అతి ముఖ్యమైన సమస్య ఆక్సిజన్ లోటు సమస్య. శీతాకాలంలో ఎండ సమయం తగ్గడం వల్ల చెరువు నీటిలో ఆక్సిజన్ ఉత్పత్తి తగ్గుతుంది. మేత ఎక్కువగా వాడటం వలన వృధా అయిన మేత నీటి అడుగున చేరి ఆక్సిజన్ లోటు ఏర్పడుతుంది. శీతాకాలంలో చేపల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు రైతులు గమనించి క్రింది యాజమాన్య పద్ధతులు పాటించాలి. నీటి రంగు ఉదజని, ఆక్సిజన్ వంటి చెరువు నీటి గుణాలను ప్రతి రోజు ఉదయాన్నే గమనించి తగు విధంగా నీటి నాణ్యతను మెరుగుపరచాలి. పోషక సమతుల్య కలిగిన మేతను వాడాలి. మేత వృధా కాకుండా యాజమాన్య చర్యలు చేపట్టాలి. ప్రతి 20 రోజులకొకసారి 25 కిలోల అగ్రికల్చరల్ లైమ్‌ని ఒక ఎకరాకు చల్లాలి. దీని వలన నీటి నాణ్యత మెరుగుపడడమే కాకుండా రోగ కారక క్రిములు నాశనం అవుతాయి. సేంద్రీయ ఎరువులను మితిమీరి వాడకూడదు. ముఖ్యంగా కోళ్ళ ఎరువు, పచ్చి పేడ వంటి ఎరువులను అసలు వాడకూడదు. రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఇమ్యూనో స్టిమ్యులెంట్స్, విటమిన్ మినరల్ మిక్సర్‌ని తరచూ వాడాలి. చెరువు లోతు తగ్గకుండా చూసుకోవాలి. రోజు పరిమిత సంఖ్యలో చేపలు చనిపోతున్నట్లయితే వ్యాధి నిర్ధారణ కొరకు దగ్గరిలో ఉన్న నిపుణులను సంప్రదించి రోగ నిర్ధారణ అయిన తర్వాత సరియైన మందులను వాడాలి. ఇటువంటి చర్యలు చేపట్టినట్లయితే శీతాకాలంలో చేపల పెంపకంలో వచ్చే వ్యాధులను తట్టుకొని మత్స్యకార రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6281836891**

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1 | 05.01.2026 | పప్పుదినుసుల సాగులో మెళకువలు | **డా॥ సి.వి. సమీర్ కుమార్,** డైరక్టర్ & హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోలిక్యులర్ బయోలజీ & బయోకెమిస్ట్రీ వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9704157788 |
| 2 | 12.01.2026 | గులాబి రంగు పురుగు నివారణకు ప్రస్తుతం ప్రత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు | **డా॥ వి. వెంకన్న,** ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం.: 9949317565 |
| 3 | 19.01.2026 | చెఱకులో రకాలు మరియు యాజమాన్య పద్ధతులు | **శ్రీ జి. రాకేష్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ఆర్.ఎస్. & ఆర్.ఆర్.ఎస్., రుద్రూర్, ఫోన్ నెం.: 8501059411 |
| II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 05.01.2026 | వేసవి పంటల్లో అధిక దిగుబడికి సమగ్ర యాజమాన్య పద్ధతులు | **డా॥ ఫిర్దోజ్ షాహానా,** శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, రుద్రూర్, ఫోన్ నెం.: 9182375732 |
| 2 | 12.01.2026 | వేసవి పంటలలో కలుపు & ఎరువులు యాజమాన్యం | **డా॥ జె.ఎస్. సుధారాణి,** సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమి) ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9550526096 |
| 3 | 19.01.2026 | లాభసాటిగా పుట్టగొడుగుల పెంపకం | **డా॥ బి. రాజేశ్వరి,** సీనియర్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ పాథాలజీ, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9912655843 |
| 4 | 26.01.2026 | రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ.) - లాభాలు | **డా॥ బి. రాజ మధు శేఖర్,** శాస్త్రవేత్త (టి.ఓ.టి.) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వికారాబాద్, ఫోన్ నెం:9866103797 |
| III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 03.01.2026 | యాసంగి పంటలలో సస్యరక్షణ | **డా॥ కె. వాణిశ్రీ,** సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ఎ.ఐ.ఎన్.పి. అన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ ల్యాబ్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9494407924 |
| 2 | 17.01.2026 | వివిధ యాసంగి పంటల్లో పాటించవలసిన సస్యరక్షణ పద్ధతులు | **డా॥ వి. లక్ష్మీ నారయణమ్మ,** ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటమాలజీ, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 9949282907 |
| 3 | 24.01.2026 | వేసవి పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు | **డా॥ పి. శ్రీ రంజిత,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (అగ్రానమి) వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, జోగిపేట, ఫోన్ నెం.: 9989617700 |
| 4 | 31.01.2026 | యాసంగి వేరుశనగ పంటల్లో సస్యరక్షణ | **శ్రీ యం. రాజశేఖర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటమాలజీ, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 8247421216 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునిత దేవి మరియు డా॥ సి. పద్మవేణి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. ఆర్ ఎన్ ఆర్ 15048 (తెలంగాణ సోన) లో గ్లైసిమిక్స్ ఇండెక్స్ ఎంత శాతం ఉంటుంది?**

ఎ) 41-42 బి) 51-52
సి) 61-62 డి) 71-72

**2. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఏ బదనికలను విడుదల చేయాలి?**

ఎ) ట్రైకోగ్రామ కెలోనిస్
బి) ట్రైకోగ్రామ జపానికమ్
సి) ట్రైకోగ్రామ ప్రీటీయోజం
డి) ట్రైకోగ్రామ బ్రాసికమ్

**3. ఈ క్రింది పోషక లోపం వలన వేరుశనగలో పూత ఆలస్యమై కాయలు డొల్లగా వస్తాయి?**

ఎ) జింక్ బి) మాంగనీస్
సి) ఇనుము డి) బోరాన్

**4. ఒక మూట డి.ఎ.పి మరియు అర మూట సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులో మొత్తం ఎన్ని కిలోల భాస్వరం లభిస్తుంది?**

ఎ) 40 బి) 30
సి) 25 డి) 20

**5. ఆమ్ల నేలల్లో ఉదజని సూచి ఎంత ఉంటుంది?**

ఎ) 6 కంటే ఎక్కువ
బి) 6 కంటే తక్కువ
సి) 8 కంటే ఎక్కువ
డి) ఏదీకాదు

**6. రసాయన పురుగుమందులు విచక్షణా రహితంగా వాడితే కలిగే అనర్థాలు?**

ఎ) రీసర్జెన్స్ బి) రెసిస్టెన్స్
సి) రెసిడ్యూస్ డి) పైవన్నీ

**7. బొప్పాయిలో క్రిప్టోలిమస్ అనే అక్షింతల పురుగుని విడుదల చేస్తే ఏ రసంపీల్చు పురుగును అదుపులో ఉంచవచ్చు?**

ఎ) తామర పురుగులు
బి) తెల్లదోమ
సి) పేనుబంక
డి) పిండినల్లి

**8. 2021-22 వ్యవసాయ గణన డేటా ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో సగటు రైతు భూ విస్తీర్ణం ఎంత ఉంది?**

ఎ) 0.89 బి) 1.12
సి) 1.15 డి) 1.18

**9. పందిరి కూరగాయల్లో మొక్కలు 2-4 అంకుర దశల్లో ఉన్నప్పుడు బోరాక్స్ పిచికారి ఎందుకు చేయాలి?**

ఎ) ఆడపూలు ఎక్కువగా రావటానికి
బి) మగపూలు ఎక్కువగా రావటానికి
సి) పురుగుల నియంత్రణకు
డి) ఏదీకాదు

**10. భారతదేశంలో కాఫీ ఉత్పత్తిలో ఏ రాష్ట్రం అగ్రగామిగా ఉంది?**

ఎ) కర్ణాటక బి) కేరళ
సి) తమిళనాడు డి) ఆంధ్రప్రదేశ్

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## ఘనంగా డా॥ బి.ఆర్. అంబేడ్కర వర్ధంతి

భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతిని విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో డిసెంబర్ 6న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥ అంబేడ్కర్ చిత్రపటానికి ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది కూడా నివాళులర్పించారు.

## పిజెటిఏయు ప్రగతి నివేదిక విడుదల

రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పిజెటిఏయు ప్రగతి నివేదికను రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ వర్మ డిసెంబర్ 17న విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యా ప్రవేశాలలో కూలీల పిల్లలకు 15% సీట్లు కేటాయించడం, వర్సిటీ సాధిస్తున్న ప్రగతిని ఆయన ప్రశంసించారు. అదేవిధంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో పిజెటిఏయు 37వ ర్యాంకు నుండి 24వ స్థానానికి ఎగబాకడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోను మంచి పనితీరును కనపరచాలని, అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న మూడు బ్యాచ్‌లకి కలిపి ఒకే స్నాతకోత్సవాన్ని ఫిబ్రవరి, 2026లో నిర్వహించడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య చేసిన విజ్ఞప్తిని గవర్నర్, ఛాన్సలర్ అంగీకరించడం జరిగింది.

## వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ పై వెబినార్ అవగాహన సదస్సు

విశ్వవిద్యాలయం పరిధిలోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ మరియు రిసోర్స్ డిస్కవరీ టూల్స్ పై డిసెంబర్ 12న అవగాహన వెబినార్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ లైబ్రేరియన్ డా॥ జే. వివేకవర్ధన్, అంతర్జాలంలో సమాచార వనరులను గుర్తించటం, తక్కువ సమయంలో వాటిని ఎలా పొందాలో, సోషల్ మీడియాలో జరుగుతున్న సమాచార విప్లవం గురించి అవగాహన కల్పించటం జరిగింది. అసిస్టెంట్ ప్రొఫెసర్, లైబ్రరీ సైన్స్, డా॥ ఎన్. పి. రవికుమార్, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ (ఓఎన్ఓఎస్) భాగంగా దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, ఉన్నత విద్య కళాశాలలకు ఆన్‌లైన్‌లో ఫుల్ టెక్స్ట్ జర్నల్స్, వాటిని పొందే ప్రక్రియ, మరియు ప్రతిష్టాత్మక స్కోపస్ జర్నలలో పరిశోధన పత్రాలు ప్రచురించడానికి ఓఎన్ఓఎస్ ద్వారా ఏపీసీ రూపంలో అందిస్తున్న సహకారాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు, వివిధ విభాగాధిపతులు, కళాశాలల అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేలల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు తప్పనిసరి అనే అంశంపై శిక్షణా కార్యక్రమం

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేటలో డిసెంబర్ 5న నేలల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు తప్పనిసరి అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేలల సంరక్షణకు, ఆరోగ్యకరమైన నేలలకు వాతావరణ పద్ధతులు, వరి, ప్రత్తి, మొక్కజొన్న పంటల అవశేషాల నిర్వహణ, నేల ఆరోగ్య ప్రాముఖ్యత, మట్టి నమూనా పద్ధతి గురించి శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయం ద్వారా జీవనోపాధి మెరుగుదల పై శిక్షణా కార్యక్రమం

కృషి విజ్ఞాన కేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయం ద్వారా జీవనోపాధి మెరుగుదల అనే అంశం పై డిసెంబర్ 12న శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర వ్యవసాయం ద్వారా జీవనోపాధి భద్రత మరియు ఉపాధి సృష్టి గురించి శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. తదనంతరం రైతులు గ్రామీణ యువత మరియు మహిళలు సమగ్ర వ్యవసాయం యొక్క డెమాన్‌స్ట్రేషన్ యూనిట్‌ను సందర్శించారు. తరువాత వివిధ ఇన్‌పుట్‌లను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## కిసాన్ మేళా మరియు ప్రదర్శన

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో డిసెంబర్ 12న కిసాన్ మేళా మరియు ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడానికి శాస్త్రీయ పరిశోధన "ప్రయోగశాల నుండి రైతు పొలంలోకి" వెళ్లాలని, అదే విధంగా రైతు సోదరులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కొరారు. కలెక్టర్ శ్రీ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముఖ్యంగా ప్రత్తి పంటను అధిక సాంద్రత పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించి ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాలని అన్నారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు డా॥ యాకాద్రి మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు రైతులకు నేరుగా చేరేలా చూడడమే విశ్వవిద్యాలయం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ప్ల బాబు

# "దమ్ముచేసిన వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్న పామిరెడ్డిపల్లి రైతుల విజయగాథ"

డా॥ పి. అర్చన మరియు డా॥ సి.హెచ్. భరత్ భూషణ్ రావు

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పాలెం



వనపర్తి జిల్లాలో 2023-24 సంవత్సరంలో వరి 74,451 హెక్టార్లలో రైతులు వానాకాలంలో సాగు చేయడం జరిగింది. రైతులు వరి సాగులో కూలీల కొరత మరియు నాట్లు వేసే సమయంలో కూలీలు అందుబాటులో లేకపోవడం వలన సరైన సమయంలో నాట్లు పడకపోవడం మరియు ముదురునారు వేయడం వల్ల దిగుబడులు తగ్గడమే కాకుండా నాట్లు వేసే కూలీల మీద పెట్టుబడి ఎక్కువ పెట్టడం వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేకపోతున్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ శాస్త్రవేత్తలు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం, పామిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తర్ణ అధికారితో కలిసి దమ్ము చేసిన పొలంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు విధానం మరియు కలుపు యాజమాన్యంపై అవగాహన కార్యక్రమంను 2021-22 వానాకాలంలో ఏర్పాటు చేసి రైతులకు జరిగింది. ఆ గ్రామ ఆదర్శ రైతు అయినటువంటి కారెడ్డి కృష్ణారెడ్డి గారి పొలంలో ఒక ఎకరంలో వరిని దమ్ము చేసి నేరుగా విత్తే విధానంలో సాగుచేయించడం జరిగింది. సాధారణ నాట్లు వేసే పద్ధతి కన్నా ఈ పద్ధతిలో రైతుకి 2 క్వింటాళ్ళు అధిక దిగుబడి రావడంతోపాటు ఎకరానికి 7500 రూపాలయ ఖర్చు నాట్ల కూలీల మీద తగ్గించుకోవడం జరిగింది.

ఈ ఫలితాలను చూసిన పామిరెడ్డిపల్లి గ్రామ రైతులు 2022-23 లో 30 ఎకరాలలో మరియు 2023-24వ సంవత్సరం వానాకాలంలో మొత్తం గ్రామ వరి సాగు విస్తీర్ణం (1700 ఎకరాలు) లో 70% వరిని అనగా 1120 ఎకరాలలో వరిని నేరుగా విత్తే పద్ధతిలో మరియు డ్రమ్‌సీడర్ ద్వారా 30 ఎకరాలలో సాగుచేయడం జరిగింది. దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తే విధానం ద్వారా రైతులు ఎకరానికి సరాసరి 28.80 క్వింటాళ్ళ దిగుబడిని పొందడంతోపాటు 70,160 రూపాయల నికర ఆదాయాన్ని ఒక హెక్టారుకి పొందడం జరిగింది.

**సాంకేతిక సహకారం:** ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ మరియు వ్యవసాయ అధికారులు దమ్ముచేసిన పొలంలో నేరుగా విత్తే వరి సాగు మరియు కలుపు యాజమాన్యం గురించి సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన మరియు కరపత్రాలను ఇవ్వడం జరిగింది.

**రైతులు అవలంబించిన మేలైన పద్ధతులు:**

1. సరైన సమయంలో కలుపు మందులు వాడడం
2. పంట 20 రోజులకి కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు ట్రైఫామోన్ + ఇథాక్సీసల్ఫ్యూరాన్ 90 గ్రా. ఎకరానికి + బిస్‌బైరిబ్యాక్ సోడియం 100 మి.లీ. ఎకరానికి కలిపి వాడడం. లేదా పెనాక్సులం + సైహలోఫాప్ బ్యూటైల్ 800 మి.లీ. ఎకరానికి + బిస్పైరిబ్యాక్ సోడియం 100 మి.లీ. కలిపి వాడడం వల్ల రైతులు కలుపును సమర్థవంతంగా అరికట్టడం జరిగింది.
3. శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల యాజమాన్యం మరియు పురుగులు తెగుళ్ళ యాజమాన్యాన్ని చేపట్టడం జరిగింది.

**పామిరెడ్డిపల్లి రైతుల అభిప్రాయం:** వెదజల్లే పద్ధతిలో దమ్ము చేసిన పొలంలో వరి సాగు చేయడం వల్ల రైతులు ఎకరానికి 7000 రూపాయలు ఆదా చేసుకోగలిగారు మరియు ఈ సంవత్సరం 2023-24 యాసంగిలో మొత్తం వరి సాగుని వెదజల్లే పద్ధతిలో చేయడం జరిగింది.

**సాగు ఖర్చు మరియు ఆదాయం (రూ./ఎకరం)**

| క్ర.సం. | వివరాలు | వెదజల్లే పద్ధతిలో వరి సాగు | సాధారణ పద్ధతిలో వరి సాగు |
|---|---|---|---|
| 1. | పెట్టుబడి (రూ./ఎకరా) | 22,000 | 29,500 |
| 2. | దిగుబడి (క్వి./ఎకరా) | 28.80 | 26.80 |
| 3. | మొత్తం ఆదాయం (రూ./ఎకరా) | 92,160 | 85,760 |
| 4. | నికర ఆదాయం (రూ./ఎకరా) | 70,160 | 56,260 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9666150842**

**28వ పేజీలోని పదవినోదం సమాధానాలు**

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 మా | | | | 2 పా | లి | ప్రొ | పై | లి | న్ |
| 3 ప | ద్దె | ని | మి | ది | | మా | | | | | నా |
| | | పం | | | | యి | | | | | కె |
| | | డు | | | | ల్ | | | | | గ్రి |
| | | 4 తె | ల్ల | 5 న | ల్లి | | గ | | | | 6 అ |
| | | గు | | ల్ల | | | ఈ | | | | |
| | | లు | | తా | | 7 గ | డు | వు | తే | ది | |
| | | | 9 జా | మ | | | 8 పం | | | | |
| | | | | ర | | | | | | 10 ఎ | |
| | లు | గు | రు | పు | లి | 11 సు | | | | ర | |
| | | | | రు | | | | 12 కం | చె | పం | ట |
| 13 పీ | క | పు | రు | గు | | | | | | ట | |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. బి 2. సి 3. డి 4. సి 5. బి 6. డి 7. డి 8. ఎ 9. ఎ 10. ఎ**

# సేంద్రియ వ్యవసాయంలో ఆచరించాల్సిన పద్ధతులు

డా॥ ఆర్. సునిత దేవి మరియు డా॥ బి. సవిత
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్




1. పచ్చిరొట్ట ఎరువులను వాడటం
2. పశువుల ఎరువులను వాడటం
3. అవసరం మేరకే దుక్కి దున్నటం
4. పంట మార్పిడి చేయడం
5. జీవన ఎరువులను వాడటం
6. చీడపీడల నివారణకు జీవ, వృక్ష సంబంధ ద్రావణాలను వాడటం

RNI No : TELTEL/2015/60296 January, 2026 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52
Date of Publication : 06.01.2026
Date of Posting : 09.01.2026

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



**జగిత్యాల నువ్వులు (జెసియస్ 3287)**

**బూడిద తెగులు మరియు కాండం కుళ్ళు తెగుళ్ళను కొంత వరకు తట్టుకొనే దీర్ఘకాలిక నల్లగింజ రకం**

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152